www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

VIGNAN'S
వీశాట్ ర్యాంకులు, జేఈఈ మెయిన్స్, ఇంటర్ మార్కుల ఆధారంగా
మే 7 నుంచి 12 వరకు కౌన్సిలింగ్
Guntur | Hyderabad. Mobile : 86394 47875

సోమవారం | 5-5-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 36 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, శుక్లపక్షం; తిథి: అష్టమి ఉ.7.36 తదుపరి నవమి; నక్షత్రం: ఆశ్లేష మ.2.01 తదుపరి మఖ; వర్జ్యం: రా.2.56-4.39; దుర్ముహూర్తం: మ.12.37-1.28, మ.3.09-4.00; అమృతఘడియలు: మ.12.20-2.01; రాహుకాలం: 7.30-9.00; సూర్యోదయం: 5.50; సూర్యాస్తమయం: 6.33 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



సబలెంకాదే 'మాడ్రిడ్' కిరీటం

మాడ్రిడ్: ప్రపంచ టెన్నిస్ నెంబర్‌వన్ క్రీడాకారిణి అరియానా సబలెంకా మాడ్రిడ్ ఓపెన్‌లో అదరగొట్టింది. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో టాప్‌సీడ్ సబలెంకా (బెలారస్) 6-3, 7-6 (3)తో అమెరికా స్టార్ కొకొ గాఫ్‌ను ఓడించి ఈ వేదికపై మూడోసారి విజేతగా నిలిచింది. ఈ క్రమంలో మూడు సార్లు ఈ టైటిల్ నెగ్గిన పెట్రా క్విటోవా రికార్డును సమం చేసింది. కాగా, సబలెంకాకు ఇది కెరీర్‌లో 20వ టైటిల్.



ముఖేష్ డబుల్ ధమాకా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో గుంటూరు యువ షూటర్ ముఖేష్ మరో రెండు పసిడి పతకాలు సాధించాడు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఆదివారం జరిగిన 25 మీటర్ల స్టాండర్డ్ పిస్టల్ ఈవెంట్ సీనియర్, జూనియర్ విభాగాల్లో చాంపియన్‌గా నిలిచాడు. దీంతో ఈ టోర్నీలో ముఖేష్ మొత్తం మూడు పతకాలను ఖాతాలో వేసుకున్నాడు. ముందురోజు 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లోనూ ముఖేష్ పసిడి సాధించడం తెలిసిందే.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.ర‌రే
బెంగళూరు	11	8	3	0	16	0.482
పంజాబ్	11	7	3	1	15	0.376
ముంబై	11	7	4	0	14	1.274
గుజరాత్	10	7	3	0	14	0.867
ఢిల్లీ	10	6	4	0	12	0.362
కోల్‌కతా	11	5	5	1	11	0.249
లఖ్‌నవూ	11	5	6	0	10	-0.469
రాజస్థాన్	12	3	9	0	6	-0.718
హైదరాబాద్	10	3	7	0	6	-1.192
చెన్నై	11	2	9	0	4	-1.117

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

మ్యాక్స్‌వెల్ స్థానంలో ఓవెన్



న్యూఢిల్లీ: గాయంతో ఐపీఎల్‌కు దూరమైన మ్యాక్స్‌వెల్ స్థానంలో మిచెల్ ఓవెన్‌ను ఎంపిక చేసినట్టు పంజాబ్ కింగ్స్ జట్టు ప్రకటించింది. ఆస్ట్రేలియాకు చెందిన ఓవెన్.. ప్రస్తుతం పాకిస్థాన్ సూపర్ లీగ్‌లో పెషావర్ జల్మి జట్టు తరఫున ఆడుతున్నాడు. ఈనెల 9న ఆ జట్టు చివరి గ్రూప్ మ్యాచ్ ఆడాక ఓవెన్ ఐపీఎల్‌లో భాగం కానున్నాడు. 23 ఏళ్ల ఓవెన్ గతేడాది బిగ్‌బాష్ లీగ్‌లో 452 పరుగులతో టాప్‌లో నిలిచాడు.

లక్ష్యం.. ఒలింపిక్స్ ఆతిథ్యం

- ప్రధాని మోదీ
- ఖేలో ఇండియా యూత్ గేమ్స్ ప్రారంభం

పట్నా: 2036 ఒలింపిక్స్ ఆతిథ్యమే లక్ష్యంగా దేశంలో క్రీడా మౌలిక సదుపాయాలను ఆధునీకీకరిస్తున్నామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెల్లడించారు. దేశంలో క్రీడా సంస్కృతి పెరిగితే, అంతర్జాతీయంగా భారత్ పరపతి ఇనుమడిస్తుందని.. ఆదివారం ఖేలో ఇండియా యూత్ గేమ్స్ ప్రారంభం సందర్భంగా మోదీ అన్నారు. బిహార్ రాజధాని పట్నా వేదికగా జరుగుతున్న ఈ పోటీలను మోదీ ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు.



వైభవ్ సూర్యవంశీకి ప్రశంస: ఈ సందర్భంగా తన ప్రసంగంలో మోదీ.. 14 ఏళ్ల బిహార్‌కు చెందిన టీనేజ్ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ గురించి ప్రస్తావించారు. 'బిహార్ బిడ్డ వైభవ్ సూర్యవంశీ అద్భుత ప్రతిభను ఐపీఎల్ మ్యాచ్‌లో తిలకించా. ఇంత చిన్న వయస్సులో అంత గొప్ప రికార్డు సాధించడం ఆషామాషీ కాదు. వైభవ్ ప్రతిభ వెనుక ఎంతో కష్టం దాగి ఉంది' అని ప్రధాని కొనియాడారు. ఇటీవల గుజరాత్ టైటాన్స్‌తో ఐపీఎల్ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ 'చిన్నో'డు సూర్యవంశీ కేవలం 35 బంతుల్లోనే సెంచరీ చేసి సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే.



పంజాబ్ దూకుడు

37 రన్స్ తేడాతో లఖ్‌నవూ ఓటమి

ప్రభ్‌సిమ్రన్ సూపర్ ఇన్నింగ్స్ ● అర్ష్‌దీప్‌నకు మూడు వికెట్లు

ధర్మశాల: అన్ని విభాగాల్లో రాణిస్తూ అత్యంత పటిష్ఠంగా కనిపిస్తున్న పంజాబ్ కింగ్స్ నుంచి మరో అద్భుత ప్రదర్శన. యువ ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ (48 బంతుల్లో 6 ఫోర్లు, 7 సిక్సర్లతో 91) తుఫాన్ ఆటతీరుతో విరుచుకుపడగా.. పేసర్ అర్ష్‌దీప్ (4-0-16-3) పొదుపైన బౌలింగ్‌కు లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ బెంబేలెత్తింది. ఫలితంగా ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో శ్రేయాస్ సేన 37 పరుగులతో ఘనవిజయం అందుకుంది. దీంతో ఏడు విజయాలు, 15 పాయింట్లతో రెండో స్థానానికి ఎగబాకింది. తమకు మిగిలిన మూడు మ్యాచుల్లో ఒక్కటి నెగ్గినా.. పంజాబ్ ప్లేఆఫ్స్‌కు చాన్స్ ఉంటుంది. అటు లఖ్‌నవూ రాబోయే మూడు మ్యాచ్‌ల్లో కచ్చితంగా గెలిచి తీరాల్సిందే. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 236 పరుగులు చేసింది. కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ (25 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 45), శశాంక్ (15 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్‌తో 33 నాటౌట్) రాణించారు. ఆకాశ్, దిగ్వేష్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో లఖ్‌నవూ 20 ఓవర్లలో 7 వికెట్లకు 199 పరుగులకే పరిమితమైంది. ఆయుష్ బదోని (40 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్సర్లతో 74), అబ్దుల్ సమద్ (24 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సర్లతో 45) మాత్రమే ఆకట్టుకున్నారు. అర్ష్‌దీప్‌నకు 3, అజ్మతుల్లాకు 2 వికెట్లు దక్కాయి. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా ప్రభ్‌సిమ్రన్ నిలిచాడు.

బదోని-సమద్ పోరాటం: భారీ ఛేదనలో లఖ్‌నవూ ఆరంభంలోనే చతికిలపడింది. టాపార్డర్ పేలవ ఆటతీరుతో జట్టు ఏ దశలోనూ లక్ష్యం వైపు సాగలేకపోయింది. చివర్లో బదోని, సమద్ పోరాటం ఏమాత్రం సరిపోలేదు. కెప్టెన్ రిషభ్ పంత్ (18) నిరాశాజనక ప్రదర్శన ఈ మ్యాచ్‌లోనూ కొనసాగింది. ఓపెనర్లు మార్ష్ (0), మార్క్రమ్ (13)లను పేసర్ అర్ష్‌దీప్ మూడో ఓవర్‌లోనే అవుట్ చేయడంతో జట్టుకు గట్టి ఝలక్ తగిలింది. తన మరుసటి ఓవర్‌లోనే ప్రమాదకర పూరన్ (6)ను కూడా అర్ష్‌దీప్ వెనక్కిపంపడంతో 27/3 స్కోరుతో లఖ్‌నవూ కష్టాల్లో పడింది. దీనికి తోడు పేసర్ అజ్మతుల్లా పంత్, మిల్లర్ (11)లకు చెక్ పెట్టాడు. పది ఓవర్లలోనే సగం వికెట్లు కోల్పోయిన వేళ యువ ఆటగాళ్లు బదోని, సమద్ తెగువ చూపారు. 12వ ఓవర్‌లో బదోని 6,4,4.. సమద్ 6తో 21 పరుగులు వచ్చాయి. చాహల్ ఓవర్‌లో రెండు సిక్సర్లు బాదిన సమద్.. స్టొయినిస్ ఓవర్‌లో 4,6తో సత్తా చాటాడు. చివరకు జాన్సన్ రిటర్న్ క్యాచ్‌తో సమద్ వెనుదిరగ్గా ఆరో వికెట్‌కు 81 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. బదోని మాత్రం ధాటిని కొనసాగిస్తూ 18వ ఓవర్‌లో 6,6,4తో 18 రన్స్ అందించాడు. కానీ చివరి ఓవర్‌లో 49 రన్స్ కావాల్సిన వేళ.. తొలి బంతికే బదోని అద్భుత ఇన్నింగ్స్ ముగియడంతో లఖ్‌నవూ చేసేదేమీ లేకపోయింది.

చెలరేగిన ప్రభ్‌సిమ్రన్: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ ఇన్నింగ్స్‌ను ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ అంతా తానై కదం తొక్కించాడు. ఆరంభంలో ఇన్‌గ్లిస్, మిడిలార్డర్‌లో శ్రేయాస్ అతడికి సహకారం అందించారు. ఇక చివర్లో శశాంక్ జత కలవడంతో స్కోరు అవలీలగా 220 దాటేసింది. మరో ఓపెనర్ ప్రియాన్ష్ ఆర్య (1) తొలి ఓవర్‌లోనే అవుటైనా.. ఇన్‌గ్లిస్ వచ్చీ రావడంతోనే 4,6,6,6తో ధాటిని చూపాడు. నాలుగో ఓవర్‌లో ప్రభ్‌సిమ్రన్ 6,6,4తో స్కోరు రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. ఇన్‌గ్లిస్‌ను ఆకాశ్ అవుట్ చేయగా, ఆరో ఓవర్‌లో ప్రభ్‌సిమ్రన్ క్యాచ్‌ను పూరన్ వదిలేశాడు. అయితే పవర్‌ప్లేలో జట్టు 66/2తో పటిష్ఠ స్థితిలోనే నిలిచింది. అలాగే మధ్య ఓవర్లలో అడపాదడపా బౌండరీలతో ప్రభ్‌సిమ్రన్-శ్రేయాస్ జోడీ జోరు కనబర్చింది. అటు 30 బంతుల్లో ప్రభ్‌సిమ్రన్ ఈ సీజన్‌లో హ్యాట్రిక్ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అయితే శ్రేయాస్‌ను స్పిన్నర్ దిగ్వేష్ వెనక్కి పంపడంతో మూడో వికెట్‌కు 78 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. నేహల్ వధేరా (16) నిరాశపర్చగా.. శశాంక్ ఆఖర్లో వేగం చూపాడు. అవేశ్ వేసిన ఇన్నింగ్స్ 18వ ఓవర్‌లో శశాంక్ 4,4.. ప్రభ్‌సిమ్రన్ 6,4,6తో 26 పరుగులు సమకూరాయి. కానీ సెంచరీకి చేరువలో ప్రభ్‌సిమ్రన్‌ను దిగ్వేష్ క్యాచవుట్ చేశాడు. దీంతో ఐదో వికెట్‌కు 54 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. చివరి ఓవర్‌లో 18 రన్స్‌తో పంజాబ్ స్కోరు 230 దాటింది.



ప్రభ్‌సిమ్రన్ (48 బంతుల్లో 6 ఫోర్లు, 7 సిక్సర్లతో 91)

వేదిక: హైదరాబాద్
నేటి మ్యాచ్
సన్‌రైజర్స్ x ఢిల్లీ — రా.7.30 నుంచి

స్కోరుబోర్డు

పంజాబ్: ప్రియాన్ష్ (సి) మయాంక్ (బి) ఆకాశ్ 1, ప్రభ్‌సిమ్రన్ (సి) పూరన్ (బి) దిగ్వేష్ రాఠి 91, ఇన్‌గ్లిస్ (సి) మిల్లర్ (బి) ఆకాశ్ 30, శ్రేయాస్ (సి) మయాంక్ (బి) దిగ్వేష్ రాఠి 45, నేహల్ (బి) ప్రిన్స్ 16, శశాంక్ (నాటౌట్) 33, స్టొయినిస్ (నాటౌట్) 15, **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 20 ఓవర్లలో 236/5; వికెట్ల పతనం:** 1-2, 2-50, 3-128, 4-162, 5-216; **బౌలింగ్:** ఆకాశ్ సింగ్ 4-0-30-2, మయాంక్ 4-0-60-0, అవేశ్ ఖాన్ 4-0-57-0, దిగ్వేష్ రాఠి 4-0-46-2, ప్రిన్స్ యాదవ్ 4-0-43-1.

లఖ్‌నవూ: మార్క్రమ్ (బి) అర్ష్‌దీప్ 13, మార్ష్ (సి) నేహల్ (బి) అర్ష్‌దీప్ 0, పూరన్ (ఎల్బీ) అర్ష్‌దీప్ 6, పంత్ (సి) శశాంక్ (బి) అజ్మతుల్లా 18, బదోని (సి) అర్ష్‌దీప్ (బి) చాహల్ 74, మిల్లర్ (సి) శశాంక్ (బి) అజ్మతుల్లా 11, అబ్దుల్ (సి అండ్ బి) జాన్సెన్ 45, అవేశ్ (నాటౌట్) 19, ప్రిన్స్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 12; మొత్తం: 20 ఓవర్లలో 199/7; వికెట్ల పతనం:** 1-15, 2-16, 3-27, 4-58, 5-73, 6-154, 7-188; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-16-3, జాన్సెన్ 4-0-31-1, అజ్మతుల్లా 4-0-33-2, చాహల్ 4-0-50-1, వైశాఖ్ 3-0-49-0, స్టొయినిస్ 1-0-17-0.



పరాగ్ భయపెట్టినా.. గట్టెక్కిన కోల్‌కతా

- రస్సెల్ మెరుపులు
- పోరాడి ఓడిన రాజస్థాన్



రస్సెల్ (25 బంతుల్లో 4 ఫోర్లు, 6 సిక్సర్లతో 57 నాటౌట్)

కోల్‌కతా: ఆఖరి బంతి వరకూ ఉత్కంఠగా సాగిన పోరులో కోల్‌కతా నైట్‌రైడర్స్ గట్టెక్కింది. ప్లేఆఫ్స్ ఆశలను సజీవంగా నిలబెట్టుకొంది. ఆదివారం హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో కోల్‌కతా ఒక్క పరుగు తేడాతో రాజస్థాన్ రాయల్స్‌పై గెలిచింది. తొలుత కోల్‌కతా 20 ఓవర్లలో 4 వికెట్లకు 206 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఆండ్రీ రస్సెల్ (25 బంతుల్లో 4 ఫోర్లు, 6 సిక్సర్లతో 57 నాటౌట్), రఘువంశీ (44), రహ్మనుల్లా గుర్బాజ్ (35), కెప్టెన్ అజింక్యా రహానె (30) రాణించారు. ఛేదనలో ఓవర్లన్నీ ఆడి 205/8 స్కోరు చేసిన రాజస్థాన్ విజయానికి పరుగు దూరంలో నిలిచిపోయింది. సారథి రియాన్ పరాగ్ (45 బంతుల్లో 6 ఫోర్లు, 8 సిక్స్‌లతో 95), యశస్వీ జైస్వాల్ (34), హెట్‌మయర్ (29) పోరాటం సరిపోలేదు. హర్షిత్, వరుణ్, మొయిన్ అలీ తలో రెండు వికెట్లు పడగొట్టారు.

ఆశలు రేపి..: ఛేదనలో రాజస్థాన్ 71/5తో కష్టాల్లో పడింది. ఈ దశలో పరాగ్, హెట్‌మయర్ ఆరో వికెట్‌కు 92 పరుగుల భాగస్వామ్యంతో ఆశలు రేకెత్తించారు. ముఖ్యంగా పరాగ్ ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపించాడు. 13వ ఓవర్‌లో అలీ బౌలింగ్‌లో పరాగ్ ఏకంగా ఐదు సిక్స్‌లతో 32 పరుగులు పిండుకోవడంతో.. రాజస్థాన్ ఒక్కసారిగా మ్యాచ్‌లోకి వచ్చింది. అయితే, హెట్‌మయర్‌ను అవుట్ చేసిన హర్షిత్ జట్టుకు కావాల్సిన బ్రేక్‌ను అందించాడు. చివరి 3 ఓవర్లలో 38 పరుగులు కావాల్సి ఉండగా.. పరాగ్‌ను కూడా హర్షిత్ వెనక్కిపంపాడు. ఆఖరి 6 బంతుల్లో రాజస్థాన్ విజయానికి 22 పరుగులు అవసరమవగా.. వైభవ్ అరోరా బౌలింగ్‌లో శుభం దూబె (14 బంతుల్లో ఫోర్, 2 సిక్స్‌లతో 25 నాటౌట్) 6,4,6 బాదడంతో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. చివరి బంతికి మూడు పరుగులు కావాల్సి ఉండగా.. దూబే సింగిల్ మాత్రమే తీశాడు. రెండో పరుగు కోసం వచ్చిన ఆర్చర్ (12) రనౌటయ్యాడు. అంతకుముందు ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ (4) నిరాశపర్చగా.. కునాల్ సింగ్ (0), జైస్వాల్‌ను అలీ పెవిలియన్ చేర్చాడు. ధ్రువ్ జురెల్ (0), హసరంగ (0)ను వరుణ్ అవుట్ చేశాడు.

దంచేసిన రస్సెల్..: టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా.. ఓపెనర్ నరైన్ (11) వికెట్‌ను వేగంగా కోల్పోయింది. కానీ, గుర్బాజ్, రహానె రెండో వికెట్‌కు 56 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొన్నారు. గుర్బాజ్‌ను తీక్షణ అవుట్ చేసినా.. రఘువంశీతో కలిసి రహానె స్కోరు బోర్డును నడిపించాడు. దీంతో జట్టు స్కోరు 12వ ఓవర్‌లో సెంచరీ మార్క్ దాటింది. కానీ, కీలక సమయంలో రహానెను పరాగ్ అవుట్ చేశాడు. ఈ దశలో క్రీజులోకి వచ్చిన రస్సెల్.. రాజస్థాన్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. రఘువంశీ జతగా నాలుగో వికెట్‌కు 33 బంతుల్లోనే 61 పరుగులు జోడించాడు. రఘువంశీని ఆర్చర్ వెనక్కి పంపగా.. ఆ స్థానంలో వచ్చిన రింకూ సింగ్ (6 బంతుల్లో ఫోర్, 2 సిక్స్‌లతో 19 నాటౌట్) 4,6,6తో ఫినిషింగ్ టచ్ ఇవ్వడంతో కోల్‌కతా స్కోరు డబుల్ సెంచరీ దాటింది.

స్కోరుబోర్డు

కోల్‌కతా: గుర్బాజ్ (సి) హెట్‌మయర్ (బి) తీక్షణ 35, నరైన్ (బి) యుధ్‌వీర్ 11, రహానె (సి) జురెల్ (బి) పరాగ్ 30, రఘువంశీ (సి/సబ్) అశోక్ (బి) ఆర్చర్ 44, రస్సెల్ (నాటౌట్) 57, రింకూ (నాటౌట్) 19; **ఎక్స్‌ట్రాలు: 10; మొత్తం: 20 ఓవర్లలో 206/4; వికెట్ల పతనం:** 1-13, 2-69, 3-111, 4-172; **బౌలింగ్:** ఆర్చర్ 4-0-30-1, యుధ్‌వీర్ 2-0-26-1, తీక్షణ 4-0-41-1, ఆకాశ్ 3-0-50-0, హసరంగ 4-0-35-0, పరాగ్ 3-0-21-1.

రాజస్థాన్: జైస్వాల్ (సి) రింకూ (బి) అలీ 34, వైభవ్ సూర్యవంశీ (సి) రహానె (బి) అరోరా 4, కునాల్ (సి) రస్సెల్ (బి) అలీ 0, పరాగ్ (సి) అరోరా (బి) హర్షిత్ 95, జురెల్ (బి) వరుణ్ 0, హసరంగ (బి) వరుణ్ 0, హెట్‌మయర్ (సి) నరైన్ (బి) హర్షిత్ 29, శుభమ్ దూబె (నాటౌట్) 25, ఆర్చర్ (రనౌట్) 12; **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 20 ఓవర్లలో 205/8; వికెట్ల పతనం:** 1-5, 2-8, 3-66, 4-71, 5-71, 6-163, 7-173, 8-205; **బౌలింగ్:** వైభవ్ అరోరా 4-0-50-1, మొయిన్ అలీ 3-0-43-2, హర్షిత్ 4-0-41-2, వరుణ్ 4-0-32-2, నరైన్ 4-0-27-0, రస్సెల్ 1-0-11-0.

హాకీ అమ్మాయిలకు ఓ విజయం

పెర్త్: ఆస్ట్రేలియా పర్యటనలో భారత మహిళల హాకీ జట్టు ఎట్టకేలకు ఓ విజయాన్ని నమోదు చేసింది. ఆదివారం జరిగిన ఆఖరి పోరులో భారత్ 1-0తో ఆస్ట్రేలియా సీనియర్ జట్టును చిత్తుచేసి గెలుపుతో టూర్‌ను ముగించింది. మ్యాచ్‌లో ఏకైక గోల్‌ను నవ్‌నీత్ కౌర్ (21వ) సాధించింది. కాగా, ఈ టూర్‌లో భాగంగా ఆరంభంలో ఆస్ట్రేలియా 'ఏ' జట్టుతో వరుసగా రెండు మ్యాచ్‌లు ఓడిన భారత జట్టు.. ఆ తర్వాత సీనియర్ జట్టుతోనూ రెండు మ్యాచ్‌లను చేజార్చుకున్న సంగతి తెలిసిందే.

లంక.. ఏడేళ్లలో తొలిసారి

- భారత్‌పై గెలుపు
- మహిళల ముక్కోణపు సిరీస్

కొలంబో: ఆల్‌రౌండర్ నీలాక్షికా సిల్వా (33 బంతుల్లో 56) దూకుడైన బ్యాటింగ్‌తో ఏడు సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత వన్డేలలో భారత్‌పై శ్రీలంక మహిళలు తొలి విజయం అందుకున్నారు. ముక్కోణపు వన్డే సిరీస్‌లో భాగంగా ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ఆతిథ్య జట్టు 3 వికెట్లతో హర్మన్ సేనను ఓడించింది. టోర్నీలో రెండో విజయం సాధించిన శ్రీలంక ఫైనల్‌కు చేరువైంది. ఇక సిరీస్‌లో భారత్‌కిది తొలి పరాజయం. అయితే ఇప్పటికే రెండు మ్యాచ్‌ల్లో నెగ్గినందున ఈ ఓటమి హర్మన్ సేన ఫైనల్ చేరికపై ప్రభావం చూపే అవకాశం లేదు. టాస్ కోల్పోయి మొదట బ్యాటింగ్ చేసిన భారత్ 50 ఓవర్లలో 275/9 స్కోరు సాధించింది. కీపర్ రిచా ఘోష్ (48 బంతుల్లో 58) మెరుపు ఇన్నింగ్స్ ఆడింది. జెమీమా (37), ప్రతికా రావల్ (35) పర్లేదనిపించారు. అనంతరం శ్రీలంక 49.1 ఓవర్లలో 278/7 స్కోరు చేసి నెగ్గింది.

సంక్షిప్తస్కోర్లు: భారత్: 50 ఓవర్లలో 275/9 (రిచా 58, జెమీమా 37, ప్రతికా రావల్ 35, హర్మన్ 30, చమరి అటపట్టు 3/43, సుగందికా కుమారి 3/44). **శ్రీలంక:** 49.1 ఓవర్లలో 278/7 (నీలాక్షిక 56, హర్షిత 53, కవిష 35, స్నేహ్ రాణా 3/45).




నీలాక్షికా సిల్వా (56)

సుప్రీంకోర్టు ఎలాంటి తప్పు చేయలేదు

» బిల్లుల ఆమోదంపై కాలపరిమితి సబబే: జస్టిస్ కేఎం జోసెఫ్

కోచి, మే 4: రాష్ట్ర అసెంబ్లీలు ఆమోదించిన బిల్లులపై సంతకాలు చేసేందుకు రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు విధించడం సబబేనని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కె.ఎం.జోసెఫ్ అన్నారు. ఇందుకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు ఎలాంటి తప్పు చేయలేదన్నారు. ప్రజాస్వామ్యం, సమాఖ్య వ్యవస్థ ప్రయోజనాల దృష్ట్యా ఇలాంటి నిర్ణయం అవసరమని తెలిపారు. కోచిలో శనివారం ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో 'గవర్నర్ల అధికారాల్లో న్యాయ వ్యవస్థ' పాత్ర అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన ప్రసంగించారు. బిల్లుల ఆమోదంలో గవర్నర్ల పాత్ర పరిమితంగా ఉంటుందని తెలిపారు. కాగా, వక్ఫ్ సవరణ చట్టం-2025 రాజ్యాంగ చెల్లుబాటును సవాల్ చేస్తూ దాఖలైన పలు పిటిషన్లను సుప్రీంకోర్టు సోమవారం విచారించనుంది. ఇదిలా ఉండగా, అరెస్టులు, ఆస్తుల జప్తు విషయమై ఈడీకి ఉన్న అధికారాలను సమర్థిస్తూ 2022లో ఇచ్చిన తీర్పు సమీక్షించాలా.. వద్దా అన్నదానిపై నిర్ణయించేందుకు సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనాన్ని ఏర్పాటు చేసింది.

యోగా గురువు శివానంద బాబా కన్నుమూత



వారణాసి, మే 4: ప్రముఖ యోగా గురువు, ఆధ్యాత్మిక వేత్త శివానంద బాబా వారణాసిలో తుదిశ్వాస విడిచారు. కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న బాబా శనివారం రాత్రి కన్నుమూసినట్లు ఆయన అనుచరులు ప్రకటించారు. బాబా మరణంపై ప్రధాని మోదీ, ఉత్తరప్రదేశ్ సీఎం యోగి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆధ్యాత్మిక సాధనకు, యోగా రంగానికి శివానంద చేసిన కృషిని ఈ సందర్భంగా కొనియాడారు. ప్రస్తుత బంగ్లాదేశ్‌లోని సిల్హెట్ జిల్లాలో 1896వ సంవత్సరంలో ఓ నిరుపేద కుటుంబంలో శివానంద బాబా జన్మించారు. తల్లిదండ్రులు తన చిన్నతనంలోనే మరణించడంతో గురువు ఓంకార నంద సంరక్షణలో పెరిగారు. గురువు దగ్గరే యోగా, ఆధ్యాత్మికతకు సంబంధించిన విషయాలను నేర్చుకున్నారు. యోగా రంగంలో శివానంద బాబా చేసిన సేవలను గుర్తిస్తూ కేంద్ర ప్రభుత్వం 2022లో ఆయనను పద్మశ్రీతో సత్కరించింది.

కులగణనపై కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం

ప్రతి నియోజకవర్గంలో సంవిధాన్ బచావో ర్యాలీలు.. సోషల్ మీడియా వేదికగా పెద్దఎత్తున ప్రచారం

- » పర్యవేక్షణకు పీసీసీలో కంట్రోల్ రూం ఏర్పాటు
- » జిల్లా స్థాయిలో పరిశీలకులు
- » పీసీసీల అధ్యక్షులకు అధిష్ఠానం దిశానిర్దేశం
- » తెలంగాణలో కులగణనను సమర్థంగా పూర్తిచేసిన విషయాన్ని దేశవ్యాప్తంగా వివరించనున్న కాంగ్రెస్



తెలంగాణలో కులగణన నిర్వహిస్తున్నప్పటి చిత్రం(ఫైల్)

న్యూఢిల్లీ, మే 4 (ఆంధ్రజ్యోతి): కులగణనపై ఇంటింటి ప్రచారం చేయాలని కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయించింది. రాహుల్ గాంధీ ఒత్తిడి మేరకే కేంద్ర ప్రభుత్వం కులగణన చేపడతామని ప్రకటించిందనే విషయాన్ని గ్రామస్థాయిలో వివరించేందుకు సిద్ధమవుతోంది. రాహుల్ హామీ మేరకు ఇప్పటికే తెలంగాణలో కులగణనను సమర్థవంతంగా పూర్తిచేశామనే విషయాన్ని దేశవ్యాప్తంగా వివరించాలని భావిస్తోంది. ఈ మేరకు ఇటీవల కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రత్యేక కార్యాచరణను ప్రకటించింది. కులగణనపై కాంగ్రెస్ వైఖరిని, బీజేపీ మొదటి నుంచీ వ్యతిరేకించిన తీరును దేశవ్యాప్తంగా ఇంటింటికీ చేరవేయాలని పీసీసీ అధ్యక్షులకు మార్గదర్శకాలు జారీ చేసింది. ఇందులో భాగంగా మే 30 వరకు ప్రత్యేక కార్యాచరణను ప్రకటించింది. కులగణనపై ఇంటింటి ప్రచారం నిర్వహించాలని, ప్రతి నియోజకవర్గంలో సంవిధాన్ బచావో ర్యాలీలు చేపట్టాలని, సోషల్ మీడియా వేదికగా పెద్దఎత్తున ప్రచారం చేయాలని కాంగ్రెస్ అధిష్ఠానం సర్క్యులర్ జారీ చేసింది. ఈ కార్యక్రమాల పర్యవేక్షణకు పీసీసీల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా కంట్రోల్ రూములు ఏర్పాటు చేయాలని, జిల్లాస్థాయిలో పరిశీలకులను నియమించాలని అన్ని రాష్ట్రాల పీసీసీ అధ్యక్షులు, సీఎల్పీ నేతలకు సూచించింది. పాటిబూత్ ప్రధాన కార్యదర్శులు, రాష్ట్రాల ఇన్‌చార్జులు, సంఘాల బాధ్యులు, ఏఐసీసీ కార్యదర్శులు, డీసీసీ అధ్యక్షులకు సైతం సర్క్యులర్ కాపీలను పంపింది. కులగణన చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తే.. మోదీ ప్రభుత్వం ఎగతాళి చేసిందని, చివరికి ప్రజాస్వామ్య నిర్ణయానికి తలొగ్గి కులగణన ప్రకటన చేసిందని సర్క్యులర్‌లో తెలిపింది. ప్రైవేట్ విద్యా సంస్థల్లోనూ ఓబీసీలు, దళితులు, ఆదివాసీలకు రిజర్వేషన్లు కల్పించడానికి రాజ్యాంగంలోని ఆర్టికల్ 15(5) అమలు చేయాలన్న డిమాండ్‌ను సంవిధాన్ బచావో ర్యాలీల్లో హైలెట్ చేయాలని తెలిపింది. ఈ ర్యాలీలు, ఇంటింటి ప్రచారాలను పీసీసీ అధ్యక్షులు ప్రత్యక్షంగా పర్యవేక్షించాలని ఆదేశించింది. సామాజిక కార్యకర్తలు, పౌర సమాజ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, న్యాయవాదులు, దుకాణదారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, బహుజన వర్గాల క్రియాశీల భాగస్వామ్యంతో చౌపాల్ సమావేశాలు నిర్వహించాలని సూచించింది. రాహుల్ గాంధీ పోషించిన నాయకత్వ పాత్రతో సహా, కాంగ్రెస్ పార్టీ చరిత్రాత్మక నిర్ణయాన్ని క్షేత్రస్థాయిలో వివరించాలని పేర్కొంది. బీజేపీ బహుజన వ్యతిరేక భావజాలాన్ని బహిర్గతం చేయాలని తెలిపింది. కాగా, ఏవో సాకులు చూపుతూ కులగణనను ఆలస్యం చేయొద్దని కేంద్రానికి కాంగ్రెస్ సూచించింది. పార్లమెంటులో చర్చించి పూర్తిస్థాయిలో బడ్జెట్ కేటాయించాలని, నిర్దిష్ట కాల పరిమితిని ప్రకటించాలని డిమాండ్ చేసింది. కులగణన సర్వే కోసం సమగ్ర నివేదికతో కూడిన ప్రొఫార్మా రూపొందించాలని కోరింది.



క్షిపణి దాడిలో ధ్వంసమైన రోడ్డు

టెల్‌అవీవ్ విమానాశ్రయ సమీపంలో క్షిపణి దాడి

» ఢిల్లీ నుంచి టెల్‌అవీవ్ వెళ్తున్న విమానాన్ని అబుదాబికి మళ్లించిన ఎయిర్‌ఇండియా

న్యూఢిల్లీ, మే 4: ఇజ్రాయెల్ నగరం టెల్‌అవీవ్‌లోని ఓ విమానాశ్రయానికి సమీపంలో ఆదివారం ఉదయం క్షిపణి దాడి జరగడంతో ఢిల్లీ నుంచి టెల్ అవీవ్‌కు వెళ్తున్న తన విమానాన్ని ఎయిర్ ఇండియా అబుదాబికి మళ్లించింది. టెల్ అవీవ్‌లో ఎయిర్ ఇండియా బోయింగ్ 787 విమానం ఏఐ139 దిగడానికి అరగంట ముందు ఈ క్షిపణి దాడి ఘటన జరిగింది. ఈ నేపథ్యంలో ఎయిర్ ఇండియా అధికారులు అప్రమత్తమయ్యారు. మే 6 వరకు టెల్‌అవీవ్‌కు విమానాల రాకపోకలను తక్షణమే నిలిపివేసినట్టు ఎయిర్ ఇండియా తెలిపింది. టెల్‌అవీవ్ నుంచి ఢిల్లీకి ఆదివారం రావాల్సిన ఎయిర్ ఇండియా విమానాన్ని కూడా రద్దు చేశారు. యెమెన్ నుంచి హౌతీ రెబెల్స్ ప్రయోగించిన బాలిస్టిక్ క్షిపణి టెల్‌అవీవ్‌లోని బెన్‌గురియన్ విమానాశ్రయం మూడో టెర్మినల్‌కు 75 మీటర్ల దూరంలో పడింది. దీంతో 25 మీటర్ల లోతు గొయ్యి ఏర్పడింది. కాగా క్షిపణిని అడ్డుకోవడానికి పలు ప్రయత్నాలు చేసినప్పటికీ విఫలమైనట్టు ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ పేర్కొంది. క్షిపణి దాడి నేపథ్యంలో ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కట్జ్ తీవ్ర హెచ్చరిక చేశారు. విమానాశ్రయదాడికి ప్రతీకారం తీర్చుకుంటామన్నారు.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 23
సంచిక (Issue) : 36

హైకోర్టు న్యాయమూర్తి గిరిజా ప్రియదర్శిని మృతి

కొంతకాలంగా అనారోగ్యం.. చికిత్స పొందుతూ కన్నుమూత

చీఫ్ జస్టిస్ సుజయ్ పాల్ సహా పలువురి నివాళి

జస్టిస్ గిరిజ స్వస్థలం ఏపీలోని విశాఖపట్నం

పదేళ్లకు పైగా న్యాయవాదిగా సేవలు.. 2008లో జిల్లా జడ్జి

2022లో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిగా నియామకం

12



సోమవారం | 5-5-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 |
శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, శుక్లపక్షం; తిథి: అష్టమి ఉ.7.36 తదుపరి నవమి; నక్షత్రం: ఆశ్లేష మ.2.01 తదుపరి మఖ;
వర్జ్యం: రా.2.56-4.39; దుర్ముహూర్తం: మ.12.37-1.28, మ.3.09-4.00; అమృతఘడియలు: మ.12.20-2.01; రాహుకాలం: 7.30-9.00; సూర్యోదయం: 5.50; సూర్యాస్తమయం: 6.33
వరంగల్
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



హైదరాబాద్‌లో ఓ నీట్ పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

ఘాటుగా నీట్

- విద్యార్థుల్ని బెంబేలెత్తించిన ఫిజిక్స్ ప్రశ్నలు
- 45 ప్రశ్నలకుగాను 25 రాస్తే గొప్పే
- మిగతా సబ్జెక్టుల్లోనూ కష్టమైన ప్రశ్నలే
- 450 స్కోర్ వస్తే జనరల్ కేటగిరీలో సీటు!
- గడియారాలు లేక.. సమయం తెలియక ఇబ్బందిపడ్డ విద్యార్థులు.. 95% హాజరు
- జూన్ 14న ఫలితాలు.. నెలాఖరులోగా కీ

హైదరాబాద్, కరీంనగర్, కీసర, పహాడీషరీఫ్, మే 4 (ఆంధ్రజ్యోతి): భౌతిక శాస్త్రంలో 16 ప్రశ్నలు బెంబేలెత్తించాయి! రసాయన శాస్త్రంలో 15 ప్రశ్నలు బెదరగొట్టాయి!! బోటనీలో 14, జువాలజీలో ఆరు ప్రశ్నలు చాలా కష్టంగా వచ్చాయి! ఒక్కమాటలో చెప్పాలంటే.. వైద్య విద్యలో ప్రవేశాల నిమిత్తం ఆదివారం దేశవ్యాప్తంగా నిర్వహించిన జాతీయ అర్హత పరీక్ష (నీట్-యూజీ 2025) ప్రశ్నపత్రం ఘాటుగా, అత్యంత కఠినంగా ఉంది! రాష్ట్రంలో 190 పరీక్ష కేంద్రాల్లో జరిగిన నీట్ పరీక్షకు 95 శాతం మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. పరీక్షా కేంద్రాల లోపలికి అనుమతించే సమయంలో అభ్యర్థులను సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. గడియారాలు, ఇతర గాడ్జెట్లను తీసివేయించారు. ఎప్పటిలాగానే.. ఒక్క నిమిషం ఆలస్యం నిబంధనను కచ్చితంగా

మిగతా 11వ పేజీలో...

- నీట్ రాసేందుకు వెళితే.. జంధ్యం తీయించారు
  కర్ణాటకలోని కలబుర్గిలో నిరసన 2
- నీట్ పరీక్ష రాసిన తల్లీకూతుళ్లు 11

త్రివిధ దళాలతో ప్రధాని సమావేశాలు

త్రిముఖ దాడులకు సిద్ధం.. బ్లూప్రింట్ రెడీ

వారంలో కార్యాచరణ, నిర్దిష్ట చర్యలు!



కొట్టేది గట్టిగానే!

పాక్‌పై భారీ దాడికి సంకేతాలు.. వేగంగా పరిణామాలు

ప్రపంచానికి తెలిసేలా దాడి.. అరేబియా సముద్రంలో నేవీ సర్వసన్నద్ధం

ఎల్‌వోసీ సమీపంలో యుద్ధ విమానాలు.. సరిహద్దు వెంబడి 'ఎయిర్ డిఫెన్స్'

పెద్ద ఎత్తున ఆర్మీ కదలికలు కూడా.. రష్యా నుంచి ఇగ్లా-ఎస్ క్షిపణుల కొనుగోళ్లు

పంజాబ్‌లో ఇద్దరు పాక్ గూఢచారులు అరెస్టు.. సరిహద్దుల్లో 8 చోట్ల పాక్ కవ్వింపు

బాగ్లిహార్ డ్యామ్ నుంచి నీటి నిలిపివేత.. పాకిస్థాన్‌లో మొదలైన యుద్ధ భయం

యుద్ధం మొదలైతే బ్రిటన్‌కు పారిపోతానన్న ఆ దేశ ఎంపీ అఫ్జల్ ఖాన్

4 రోజులకే ఖాళీ కానున్న పాక్ శతఘ్ని గుండ్లు.. ఉక్రెయిన్‌కు విక్రయాల వల్లే..

పాక్ గొప్పలన్నీ తప్పులే!.. పీఎల్15 క్షిపణులపై ఆర్భాటపు ప్రచారం

వాటి వాస్తవ రేంజ్ 120 కిలోమీటర్లే కానీ 300 కి.మీ.లు అంటూ డంబాలు

న్యూఢిల్లీ, మే 4 (ఆంధ్రజ్యోతి): సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ.. ఉగ్రవాదుల స్వర్గధామంగా మారిన దాయాది దేశం పాకిస్థాన్‌పై భారత్ భారీ దాడికి సిద్ధమైందా? ప్రపంచ దేశాలకు తమ చర్య కనిపించేలా పెద్ద దెబ్బ కొట్టనుందా? బాలాకోట్ తరహా ప్రతీకారమైతే ఇప్పటికే జరిగి ఉండేదా? అలా కాకుండా.. నష్టాన్ని ప్రపంచానికి కనిపించేలా భారత ప్రభుత్వం సిద్ధమైందా? త్రివిధ దళాలతో.. త్రిముఖ వ్యూహంతో పాక్ నడ్డి విరచనుందా? వేగంగా మారుతున్న పరిణామాలు ఈ ప్రశ్నలకు అవుననే సమాధానం చెబుతున్నాయి. ఆదివారం తాజాగా నియంత్రణ రేఖ(ఎల్‌వోసీ) వెంబడి ఎనిమిది చోట్ల పాక్ సైన్యం కవ్వింపు చర్యలకు పాల్పడగా.. భారత్ దీటుగా బదులిచ్చింది. సరిహద్దుల్లో భారత్ భారీ సైన్యాన్ని, 'ఎయిర్ డిఫెన్స్' వ్యవస్థలను మోహరించింది. ఆర్మీ కదలికల సమాచారాన్ని శత్రుదేశానికి పంపుతున్న ఇద్దరు గూఢచారులను పంజాబ్‌లో అరెస్టు చేసింది. అరేబియా సముద్రంలో యుద్ధ విమాన వాహక నౌకను మోహరించడంతోపాటు.. పాకిస్థాన్ తీరానికి 85 నాటికల్ మైళ్ల దూరంలో.. గుజరాత్ తీరప్రాంతంలో నౌకాదళ విన్యాసాలను నిర్వహిస్తోంది. లద్ధాఖ్, జమ్మూకశ్మీర్ బేస్‌లలో భారత

మిగతా 2వ పేజీలో...

పహల్గాం ఉగ్రదాడి పాక్-చైనాల ఉమ్మడి కుట్ర

బహుళజాతి కంపెనీలు చైనా నుంచి భారత్‌కు తరలిపోకుండా అడ్డుకునేందుకే దాడి 2

యుద్ధం మొదలైతే భారత్‌కు కంపెనీలు పోవని యోచన

పాక్ రిటైర్డ్ ఆర్మీ మేజర్ ఆదిల్ రజా సంచలన ఆరోపణ

అకాల వర్షం.. తీరని నష్టం

పలు జిల్లాల్లో వాన, ఈదురుగాలుల బీభత్సం

కొనుగోలు కేంద్రాల వద్ద తడిసిన ధాన్యం

కూలిన చెట్లు, స్తంభాలు.. నేలరాలిన మామిడి

సిద్దిపేటలో టోల్‌ప్లాజా పైకప్పు రేకులు కూలి

కౌంటర్లు ధ్వంసం.. గంటపైగా ట్రాఫిక్ జామ్



సిద్దిపేటలో కూలిన టోల్‌ప్లాజా పైకప్పు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రంలో విభిన్న వాతావరణం కొనసాగుతోంది. ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా ఎండలు దంచికొట్టగా.. కొన్ని జిల్లాల్లో మధ్యాహ్నం తర్వాత వర్షం బీభత్సం సృష్టించింది. ఉరుములు, మెరుపులకు తోడు ఈదురుగాలులతో కురిసిన అకాల వర్షం అన్నదాతలకు తీరని నష్టాన్ని మిగిల్చింది. పలు జిల్లాల్లో పంట నష్టం వాటిల్లగా

మిగతా 3వ పేజీలో...

ఏపీలో గాలివాన బీభత్సం

పిడుగులు పడి ఆరుగురు మృత్యువాత 3

వేలాది ఎకరాల్లో మామిడి, వరి పంటకి నష్టం

10 నుంచి మెట్రో చార్జీల పెంపు!

25-30% పెంచేందుకు ఎల్అండ్‌టీ నిర్ణయం 12

ఒక్కరోజే 90 మంది

అందగత్తెల రాక

మిస్ వరల్డ్‌లో పాల్గొనేందుకు నగరానికి చేరుకుంటున్న పలు దేశాల సుందరీమణులు 12

నేడు రానున్న మరికొందరు



శంషాబాద్ విమానాశ్రయంలో మిస్ దక్షిణాఫ్రికా జోలిక్ రెస్బర్గ్

గతంలో కాంగ్రెస్ తప్పులు చేసింది

అప్పట్లో నేను లేను.. అయినా పార్టీ చరిత్రలో జరిగిన తప్పులన్నింటికీ సంతోషంగా బాధ్యత వహిస్తా

సిక్కు వ్యతిరేక అల్లర్లపై ఓ సిక్కు విద్యార్థి ప్రశ్నకు రాహుల్ జవాబు

గత నెల అమెరికాలో బ్రౌన్‌వర్సిటీలో విద్యార్థులతో ముఖాముఖి

1980లలో జరిగింది తప్పు అని ఇప్పటికే పలుమార్లు బహిరంగంగా చెప్పానని రాహుల్ వెల్లడి 2



ఫోరెన్సిక్ ల్యాబ్‌ల్లో సిబ్బంది కొరత!

అందుబాటులో లేని సైంటిస్టులు.. పెండింగ్‌లో వేలాది కేసులు 9

దేశమంతటా ఇదే పరిస్థితి.. తెలంగాణలో మరీ దారుణం

రాష్ట్రంలో 91% మేర ఖాళీలు

బాధ్యతలకు డైరెక్టర్లు దూరం

ఐపీఎస్ పర్యవేక్షణలో విభాగాలు

ఫోరెన్సిక్ సైన్స్‌కు విద్యార్థుల కొరత



కర్రెగుట్టల్లో చిక్కని

నక్సల్స్ జాడ!

రోజులు గడుస్తున్నా దొరకని ఆచూకీ

రెండో రోజే తప్పించుకున్న మావోయిస్టులు?

ఇంకా 30కి పైగా గుట్టల్లో గాలింపు పెండింగ్

ప్రతికూల వాతావరణంలో చతికిలపడిపోతున్న పారామిలిటరీ బలగాలు.. పలువురికి డీహైడ్రేషన్

3 వేల మందికి పైగా నక్సల్స్ ఉన్నారని తొలుత ప్రచారం.. ఇప్పటికి ఆరుగురి ఎన్‌కౌంటర్



హైదరాబాద్, మే 4 (ఆంధ్రజ్యోతి): తొలుత 'బచావో కర్రెగుట్టలు'.. ఆ తర్వాత 'ఆపరేషన్ కర్రెగుట్టలు'.. పేరు ఏదైనా కేంద్ర బలగాలు ఈ ఆపరేషన్‌లో మావోయిస్టులను గుర్తించలేకపోయారా? 3 వేల మందికిపైగా నక్సల్స్ ఉన్నారంటూ.. విడతల వారీగా 24 వేల బలగాలను మోహరించిన పోలీసులు.. ఆరుగురు పీఎల్‌జీఏ సభ్యుల ఎన్‌కౌంటర్ మినహా.. పెద్దగా పురోగతి సాధించలేదా? అత్యంత క్లిష్టమైన గుట్టల్లోంచి మావోయిస్టులు మహారాష్ట్ర, తెలంగాణ వైపు తప్పించుకున్నారా? ఈ ప్రశ్నలకు

మిగతా 11వ పేజీలో...

మావోయిస్టులతో చర్చల ప్రసక్తేలేదు

తుపాకీ వీడాల్సిందే.. పోలీసులకు లొంగిపోవాల్సిందే

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ 11

ఎన్నికల సేవలన్నీ ఒకే వేదికపైకి

త్వరలోనే అన్ని అంశాలతో 'ఈసీనెట్'

కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో.. సిద్ధమవుతున్న సరికొత్త డిజిటల్ వేదిక

ఒకే గొడుగు కిందకు 40 అప్లికేషన్లు 2



పాక్‌కు సైనిక రహస్యాలు.. ఇద్దరి అరెస్టు

చండీగఢ్, మే 4: భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న వేళ పంజాబ్‌లో సైనిక కంటోన్మెంట్లు, వైమానిక ఎయిర్ బేస్‌ల సమాచారం, చిత్రాలు పాక్‌కు చేరవేస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు పంజాబ్ పోలీసులు ఆదివారం తెలిపారు. అధికార రహస్యాల చట్టం కింద పాలక్ షేర్ మాసి, సూరజ్ మాసి అనే ఇద్దరు వ్యక్తులను అమృత్‌సర్ రూరల్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ప్రాథమిక విచారణలో పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ వర్గాలతో వారికి సంబంధాలు ఉన్నాయని గుర్తించినట్లు పంజాబ్ డీజీపీ గౌరవ్ యాదవ్ 'ఎక్స్'లో పోస్టు చేశారు. అమృత్‌సర్ సెంట్రల్ జైలులో ఉన్న హర్‌ప్రీత్ సింగ్ అలియాస్ పిట్టు ద్వారా వీరు పాక్ ఇంటెలిజెన్స్ వర్గాలతో సంబంధాలు ఏర్పరచుకున్నారని తెలుసుకున్నారు. మరోవైపు, జమ్ము, కశ్మీర్‌లోని రంబన్ జిల్లాలో ఆదివారం ట్రక్కు లోయలో పడి ముగ్గురు సైనికులు మృతి చెందారు. 44వ నెంబరు జాతీయ రహదారిపై ఉదయం 11.30 గంటలకు ఈ ఘటన చోటు చేసుకుంది. జమ్ము నుంచి శ్రీనగర్ వెళుతోన్న సైనిక కాన్వాయ్‌లోని ఈ ట్రక్కు అదుపు తప్పి ఈ ప్రమాదం జరిగింది.

యుద్ధం వస్తే ఇంగ్లండ్ వెళ్లిపోతా: పాక్ ఎంపీ



న్యూఢిల్లీ, మే 4: పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధం జరుగుతుందేమోనని భయాందోళనల నేపథ్యంలో పాక్ ఎంపీ షేర్ అఫ్జల్ ఖాన్ మర్వాత్ చేసిన వ్యాఖ్యలు ఆ దేశ పరిస్థితిని చెబుతున్నాయి. భారత్‌తో యుద్ధం మొదలైతే దేశం వదిలి ఇంగ్లండ్ వెళ్లిపోతానని అఫ్జల్ ఖాన్ అన్నారు. ఒక వేళ భారత్‌తో యుద్ధం ప్రారంభమైతే తుపాకీ తీసుకుని మీరు కూడా సరిహద్దుకు వెళతారా ? అని విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన ఈ విధంగా బదులిచ్చి షాకిచ్చారు. అంతేకాక, ఉద్రిక్తతలను తగ్గించేందుకు భారత ప్రధాని మోదీ యుద్ధం విషయంలో వెనక్కి తగ్గే అవకాశముందా ? అని విలేకరులు అడిగిన ప్రశ్నకు కూడా వింత సమాధానం ఇచ్చారు. 'మోదీ ఏమైనా మా అత్త కొడుకా ? నేను చెబితే వెనక్కి తగ్గడానికి' అంటూ వెటకారం చేశారు.

పహల్గాం ఉగ్రదాడి పాక్-చైనాల ఉమ్మడి కుట్ర

» పాక్ రిటైర్డ్ ఆర్మీ అధికారి మేజర్ అదిల్ రజా ఆరోపణ

ఇస్లామాబాద్, మే 4: పహల్గాం ఉగ్రదాడి పాక్-చైనాల ఉమ్మడి కుట్ర అని పాక్ రిటైర్డ్ ఆర్మీ అధికారి మేజర్ అదిల్ రజా ఆరోపించారు. చైనా నుంచి కంపెనీలు భారత్‌కు తరలిపోకుండా అడ్డుకునేందుకే ఈ దాడి జరిపించాయన్నారు. అమెరికా-చైనాల మధ్య వాణిజ్య యుద్ధం వల్ల కంపెనీలు చైనాను వీడి భారత్‌కు పోతుండటమే దాడికి ప్రధాన కారణంగా ఆయన చెప్పారు. అతిపెద్ద తయారీ దారు దేశంగా ఉన్న పేరు ప్రతిష్ఠలు దెబ్బతింటుండటంతో కలవరపడిన చైనా.. పాక్ ఆర్మీ చీఫ్ మునీర్‌తో కలిసి ఈ దాడికి కుట్ర పన్నిందని అదిల్ రజా వెల్లడించారు. పాక్‌తో యుద్ధానికి దిగితే భారత్‌లో కల్లోలం ఏర్పడి కంపెనీలు తరలింపు యోచన విరమించుకుంటాయనేది చైనా యోచన అన్నారు.

ఎల్వోసీ వెంట 8 చోట్ల పాక్ కాల్పులు

న్యూఢిల్లీ, మే 4: పాకిస్థాన్ సైన్యం కాల్పుల విరమణను ఉల్లంఘిస్తూనే ఉంది. వరుసగా పదో రోజూ నియంత్రణ రేఖ (ఎల్వోసీ) వెంట కాల్పులు జరిపింది. శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు జమ్మూకశ్మీర్‌లోని కుప్వారా, బారాముల్లా, పూంఛ్, రాజౌరీ, మెంధర్, నౌషేరా, సుందర్‌బని, అఖ్నూర్ ప్రాంతాల్లో చిన్నస్థాయి ఆయుధాలతో కాల్పులకు పాల్పడినట్టు రక్షణ వర్గాలు వెల్లడించాయి. భారత సైన్యం కూడా దీటుగా బదులిచ్చిందని తెలిపాయి. భారత పోర్టుల్లోకి పాక్ నౌకలు రాకుండా నిషేధించిన నేపథ్యంలో.. పాకిస్థాన్ కూడా ఇదే తరహా నిర్ణయాన్ని ప్రకటించింది. భారత్‌కు చెందిన, భారత జెండా ఉన్న నౌకలేవీ పాక్ పోర్టుల్లోకి రాకుండా నిషేధించింది. పాక్ నౌకలేవీ భారత పోర్టులకు వెళ్లవద్దంటూ ఆదేశించింది.

ఫిరోజ్‌పూర్ కంటోన్మెంట్‌లో బ్లాకౌట్ రిహార్సల్

» యుద్ధ సన్నద్ధతలో భాగంగా పరిశీలన

ఫిరోజ్‌పూర్, మే 4: పాక్‌తో యుద్ధం మొదలైతే ఎలా వ్యవహరించాలన్న దానిపై పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్ కంటోన్మెంట్‌లో బ్లాక్ అవుట్ రిహార్సల్ నిర్వహించారు. ఆదివారం రాత్రి 9 గంటల నుంచి 9.30 వరకు అరగంట పాటు ఈ డ్రిల్ చేశారు. సాధారణంగా యుద్ధ సమయాల్లో రాత్రిపూట అకస్మాత్తుగా వైమానిక దాడులు చేస్తుంటారు. ఎక్కువ నష్టం కలిగించడం కోసం నగర, పట్టణ ప్రాంతాలనే లక్ష్యాలుగా ఎంచుకుంటారు. యుద్ధ విమానాల పైలట్లు విద్యుద్దీపాల కాంతిని బట్టి పట్టణాలను గుర్తిస్తారు. అదే మొత్తంగా అన్ని లైట్లు ఆర్పేస్తే.. పట్టణాలను గుర్తించడం కష్టం. దీన్నే బ్లాకౌట్‌గా చెబుతారు.

పాక్‌లో ప్రభుత్వ ఆఫీసులకు బీఎల్‌ఏ నిప్పు

ఇస్లామాబాద్, మే 4: భారత్‌తో ఉద్రిక్తతల వేళ పాకిస్థాన్‌లో బలోచ్ లిబరేషన్ ఆర్మీ మిలిటెంట్ల దాడులు దాయాది దేశాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. బలూచిస్థాన్‌లోని కలాత్ జిల్లా మంగోచర్ ప్రాంతంలో మిలిటెంట్లు పలు ప్రభుత్వ భవనాలకు నిప్పు పెట్టారు. జ్యుడీషియల్ కాంప్లెక్స్, పాక్ జాతీయ బ్యాంక్‌లకు నిప్పుపెట్టారు. తుపాకులతో వచ్చిన 40 మంది బీఎల్‌ఏ మిలిటెంట్లు క్వెట్టా-కరాచీ హైవేపై రాకపోకలను అడ్డుకున్నారు. మరో ఘటనలో ఖైదీలను తీసుకెళ్తున్న పోలీసు వాహనాన్ని అడ్డుకున్నారు. ఖైదీలను విడిచిపెట్టి పోలీసులను కిడ్నాప్ చేశారు. అనంతరం పాక్ భద్రతా బలగాలు జరిపిన ఆపరేషన్‌లో ఇద్దరు పోలీసులను విడిచిపెట్టినట్లు తెలిసింది.

కొట్టేది గట్టిగానే!



(మొదటిపేజీ తరువాయి)

వాయుసేన మోహరించింది. అంతేకాదు.. రక్షణ వ్యవస్థలైన ఇగ్లా-ఎస్‌లను అత్యవసరంగా పెద్దమొత్తంలో కొనుగోలు చేస్తోంది. ఇప్పటికే అందుబాటులో ఉన్న ఇగ్లా-ఎస్, ఇతర క్షిపణి రక్షణ వ్యవస్థలను సరిహద్దులకు తరలించింది. స్ట్రాటోస్ఫిరిక్ ఎయిర్‌షిప్ ప్లాట్‌ఫామ్ తొలి విమాన పరీక్షను విజయవంతంగా పూర్తిచేసింది. అటు ప్రధాని మోదీ వరుసగా త్రివిధ దళాధిపతులను భేటీ అవుతూ.. సర్వసన్నద్ధతపై ఆరా తీస్తున్నారు. మరోవైపు పాకిస్థాన్‌లో యుద్ధ భయం నెలకొంది. రోజూ ఏదో ఒక ప్రకటన చేస్తున్న ఆ దేశ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ గగనతల యుద్ధం తప్పదని తాజాగా వ్యాఖ్యానించారు. యుద్ధం వస్తే బ్రిటన్‌కు పారిపోతానని ఏకంగా ఓ ఎంపీ ప్రకటన చేయగా.. అణుబాంబులు వేస్తామంటూ రష్యాలోని పాక్ రాయబారి భారత్‌ను హెచ్చరించారు. అయితే.. భారత్‌తో యుద్ధమే వస్తే.. ఆయుధాల పరంగా పాకిస్థాన్ చావుదెబ్బ తినే ప్రమాదాలున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. శతఘ్నుల్లో వినియోగించే 155 ఎంఎం గుండ్ల నిల్వలు భారీగా పడిపోయాయని, నాలుగు రోజులకు మాత్రమే సరిపోతాయని పాక్ సైన్యాధికారులే చెబుతున్నారు. ఇప్పటికిప్పుడు వాటి తయారీ అసాధ్యమని పాకిస్థాన్ కోర్ కమాండర్ల సమావేశంలో ఆందోళన వ్యక్తం కావడం గమనార్హం.! ఈ అంశంపై పాక్ ఆర్మీ మాజీ చీఫ్ ఆసిమ్ భాజ్వా తీవ్ర ఆందోళన వ్యక్తం చేయగా.. మరో విశ్రాంత సైన్యాధికారి ఏకంగా పహల్గాం దాడి వెనక పాక్-చైనా కుట్ర ఉందని ఆరోపించారు. భారత ప్రభుత్వం సన్నద్ధతను బట్టి.. ఈ వారంలో యుద్ధ కార్యాచరణ పూర్తవుతుందని, పాక్‌పై నిర్దిష్ట చర్యలకు ప్రకటన చేసే అవకాశాలున్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి.

త్రివిధ దళాల బ్లూప్రింట్ సిద్ధం!

భారత త్రివిధ దళాలు పాక్‌తో యుద్ధానికి సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆదివారం ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ ప్రధాని మోదీ కీలక సమాలోచనలు జరిపారు. ఈ భేటీతో త్రివిధ దళాధిపతులతో మోదీ వేర్వేరు భేటీలు పూర్తయినట్లయింది. గతనెల 30న ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేదీతో విస్తృత చర్చలు జరిపారు. శనివారం నేవీ చీఫ్ అడ్మిరల్ దినేశ్.కె.త్రిపాఠీతో చర్చించారు. త్రివిధ దళాధిపతులు ముగ్గురూ పాకిస్థాన్‌పై త్రిముఖ దాడి చేసేందుకు తాము సర్వసన్నద్ధంగా ఉన్నామని మోదీకి వివరించినట్లు సమాచారం. అదే సమయంలో పాకిస్థాన్ ఎదురు దాడి చేస్తే తిప్పిగొట్టేందుకు చేస్తున్న సన్నాహాలను కూడా వారు వివరించారు. వ్యూహ-ప్రతివ్యూహాలు ఎలా ఉండనున్నాయో వెల్లడించారు. దీంతో.. ఈ సారి త్రివిధ దళాలూ ఏదో రూపంలో పాకిస్థాన్‌ను చుట్టుముట్టి, కోలుకోలేని విధంగా దెబ్బ కొట్టేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాయనే చర్చ జరుగుతోంది. ఒకవైపు సరిహద్దుల్లో నియంత్రణ రేఖ దాటి దూసుకువెళ్లేందుకు సైన్యం ఉరకలు వేస్తుండగా, ఆక్రమిత కశ్మీర్‌లోని నిర్దిష్ట ఉగ్రవాద శిబిరాలపై దాడులు చేసేందుకు వైమానిక దళం క్షిపణి దాడులకు సిద్ధమైనట్లు చర్చ జరుగుతోంది. అరేబియా సముద్రంలో మోహరించిన యుద్ధ నౌకలు కూడా దీర్ఘశ్రేణి క్షిపణి దాడులకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. త్రివిధ దళాలు నిర్దిష్ట కార్యాచరణ, బ్లూప్రింట్‌తో సిద్ధంగా ఉండగా.. మోదీ సర్కారు గ్రీన్‌సిగ్నలివ్వడమే ఆలస్యమని రక్షణ శాఖ వర్గాలు చెబుతున్నాయి. అందుకే.. ఈ నెల 9న జరగనున్న 'రష్యా విక్టరీ డే'కు భారత్ తరఫున వెళ్లాల్సిన ప్రతినిధి పేరు మారుతూ వస్తోంది. తొలుత ప్రధాని మోదీ ఈ కార్యక్రమానికి వెళ్లాల్సి ఉండేది. ఆయన స్థానంలో రాజ్‌నాథ్ సింగ్ వెళ్తారని కేంద్రం చెప్పింది. తాజాగా రక్షణశాఖ సహాయ మంత్రి సేథ్ వెళ్తారని ప్రకటించింది. యుద్ధం మొదలైతే.. ప్రధాని, రక్షణ మంత్రి భారత్‌లో ఉండడం అనివార్యమని, అందుకే వారు ఆ కార్యక్రమానికి వెళ్లడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

వేగంగా పరిణామాలు..

భారత్ ఏదో చేయనుందనడానికి వేగంగా మారుతున్న పరిణామాలు సంకేతాలనిస్తున్నాయి. గత నెల 29న ప్రధాని మోదీ ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్‌తో భేటీ అయ్యారు. ఇప్పటికే రెండు సార్లు భద్రతావ్యవహారాల క్యాబినెట్ భేటీ జరగ్గా.. ఈ వారం మరోమారు సమావేశం కానున్నట్లు తెలుస్తోంది. విదేశాంగ మంత్రి జైశంకర్‌తో పాటు.. మన దేశ రాయబారులు ఇప్పటికే అన్ని ముఖ్యమైన, మిత్రపక్ష దేశాలకు పరిస్థితిని వివరించారు. దాదాపు అన్ని దేశాలు పెద్దఎత్తున మద్దతు ప్రకటించాయని విదేశాంగ శాఖ ప్రతినిధి జైస్వాల్ ప్రకటించారు. మరోవైపు, ఇప్పటికే పాకిస్థాన్ తన మిత్ర దేశాలతో సంప్రదింపులు జరుపుతోంది. ముఖ్యంగా ఆర్గనైజేషన్ ఆఫ్ ఇస్లామిక్ కోఆపరేషన్(ఓఐసీ)తో భారత్‌పై ఒత్తిడి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తోంది. ఐక్య రాజ్య సమితి(ఐరాస) భద్రతామండలిలో భారత్ చర్యలపై(సింధు జలాల ఒప్పందం నిలిపివేత, సరిహద్దు వెంబడి ఉద్రిక్తత) సోమవారం ఫిర్యాదు చేయనున్నట్లు సమాచారం. అదే సమయంలో బలూచిస్థాన్‌లో వేర్పాటు వాదులకు.. సైన్యానికి మధ్య జరుగుతున్న ఘర్షణలు మరింత తీవ్రమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. తుర్కియే, సౌదీఅరేబియా, మలేసియా.. ఇతర ఇస్లామిక్ దేశాలతో పాకిస్థాన్ చర్చలు జరుపుతున్నా.. భారత్‌కు వ్యతిరేకంగా మద్దతును కూడగట్టుకోవడంలో సఫలం కావడం లేదని తెలుస్తోంది. భారత్‌తో ఘర్షణల నేపథ్యంలో నిర్వహించే అఖిలపక్షానికి హాజరయ్యేది లేదని పాక్‌లో ఇమ్రాన్ నేతృత్వంలోని ప్రతిపక్ష పార్టీ పీటీఐ స్పష్టం చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో మోదీ సర్కారు తన యాక్షన్ ప్లాన్‌ను అమలు చేస్తే..పాక్‌కు చావు దెబ్బ తప్పదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.


ప్రజలు కోరేది తప్పక జరుగుతుంది

భారత్‌పై దాడులకు ప్రయత్నించేవారికి తగిన రీతిలో సమాధానం చెబుతామని రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ హెచ్చరించారు. "సరిహద్దుల్లో రక్షణతోపాటు.. సైనికులను, భారత పౌరులను కాపాడడం రక్షణ మంత్రిగా నా బాధ్యత. ప్రధాని మోదీ పనితీరు, ఆయనకు ఉన్న పట్టుదల గురించి అందరికీ తెలుసు. ఆయన నాయకత్వంలో ప్రజలు కోరుకున్నది కచ్చితంగా జరిగి, తీరుతుందని నేను హామీ ఇస్తున్నా" అని వ్యాఖ్యానించారు. ఢిల్లీలో ఆదివారం జరిగిన సంస్కృతి జాగరణ్ మహోత్సవ్‌లో ఈ వ్యాఖ్యలు చేశారు.

యుద్ధం వస్తే 4 రోజులకే పాక్ శతఘ్ని గుండ్లు ఖాళీ!

న్యూఢిల్లీ, మే 4: భారత్‌తో యుద్ధం వస్తే.. పాకిస్థాన్ వద్ద ఉన్న శతఘ్ని గుండ్ల నిల్వలు 4రోజులకే ఖాళీ అయిపోతాయని, ఆ దేశం ఇబ్బందుల్లో పడుతుందని సమాచారం. రష్యాతో యుద్ధం సందర్భంగా ఉక్రెయిన్‌కు పాకిస్థాన్ భారీగా ఈ గుండ్లను విక్రయించడంతో.. నిల్వలు తగ్గిపోయాయి. నిజానికి ఏ దేశమైనా భూతల దాడులకు దిగాలన్నా.. శత్రువు దాడులను ఎదుర్కోవాలన్నా.. శతఘ్నులు, ఎం-109 హవిట్జర్లకు 155 ఎంఎం శతఘ్ని గుండ్లు, బీఎం-21 వ్యవస్థలకు సంబంధించిన 122 ఎంఎం రాకెట్లు చాలా అవసరం. వీటిల్లో పాక్ చాలా వరకు 155 ఎంఎంలను ఉక్రెయిన్‌కు విక్రయించింది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు పెరగడంతో.. ఈ నెల 2న జరిగిన పాకిస్థాన్ కోర్ కమాండర్ల సమావేశంలో 155 ఎంఎం శతఘ్ని గుండ్ల విషయంలో ఆందోళనలు వ్యక్తమైనట్లు సమాచారం. "96 గంటల్లోనే(నాలుగు రోజులు) మన వద్ద ఉన్న శతఘ్ని గుండ్ల నిల్వలు ఖాళీ అయిపోతాయి. ఇప్పటికిప్పుడు వాటిని తయారు చేయడం కూడా అంత సులభమేమీకాదు" అని అధికారులు అభిప్రాయపడ్డారని తెలిసింది. ఇప్పటికిప్పుడు భారత్ దాడి చేస్తే.. పాక్‌కు ఇబ్బందులు తప్పవని రక్షణ నిపుణులు చెబుతున్నారు.

లోకం తీరు



భారత సైన్యానికి 'ఇగ్లా'

» రష్యా నుంచి అధునాతన క్షిపణుల దిగుమతి

న్యూఢిల్లీ, మే 4: పహల్గాం ఉగ్రదాడి తర్వాత దాయాది పాకిస్థాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో భారత్ తన వైమానిక రక్షణ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేస్తోంది. రష్యా నుంచి రూ.250 కోట్ల విలువైన అధునాతన ఇగ్లా-ఎస్ మిసైల్స్ దిగుమతి చేసుకుంది. సైనిక దళాల క్షిపణి సామర్థ్యాన్ని పెంచడానికి కేంద్ర ప్రభుత్వం సైన్యానికి ఇచ్చిన అత్యవసర అధికారాలను ఉపయోగించి వీటిని కొనుగోలు చేశారు. కొన్ని వారాల క్రితమే ఇవి భారత్‌కు చేరుకున్నట్టు రక్షణ వర్గాలు తెలిపాయి. తాజా పరిస్థితుల్లో ఇగ్లా-ఎస్ మిసైల్స్‌ను సరిహద్దుల్లో సిద్ధం చేస్తున్నారు. అంతేగాక భారత సైన్యం మరో 48కి పైగా లాంచర్లు, 90 ఇగ్లా-ఎస్ మిసైల్స్ కొనుగోలుకు టెండర్ జారీ చేసింది. భారత సైన్యం 1990 నుంచే ఇగ్లా-ఎస్ మిసైల్స్‌ను ఉపయోగిస్తోంది. తాజాగా రష్యా నుంచి దిగుమతి చేసుకున్నవి అధునాతనమైనవి. ఈ స్వల్ప శ్రేణి క్షిపణులతో శత్రు విమానాలు, డ్రోన్లు, హెలికాప్టర్లను ధ్వంసం చేయవచ్చు. 3.5 కిలోమీటర్లు ఎత్తు, 6 కిలో మీటర్ల దూరంలో ఉన్న లక్ష్యాలను ఛేదించే సామర్థ్యం ఉంది. నిర్దేశిత ప్రాంతాలకు సులభంగా తీసుకెళ్లడానికి, భుజంపై నుంచి గగనతలంలో లక్ష్యాలను కూల్చడానికి అనువుగా ఉంటాయి.

స్ట్రాటోస్పిరిక్ ఎయిర్‌షిప్ పరీక్ష విజయవంతం

సైన్యం నిఘా సామర్థ్యాన్ని పెంచేందుకు అభివృద్ధి చేస్తున్న స్ట్రాటోస్పిరిక్ ఎయిర్‌షిప్ ప్లాట్‌ఫామ్ తొలి విమాన పరీక్షను భారత్ విజయవంతంగా నిర్వహించింది. మధ్యప్రదేశ్‌లోని షియోపూర్‌లో డీఆర్‌డీవో శనివారం ఈ పరీక్షను చేపట్టింది. 62 నిమిషాలపాటు నిర్వహించిన ఈ పరీక్షకు సంబంధించిన దృశ్యాలను డీఆర్‌డీవో 'ఎక్స్'లో షేర్ చేసింది. స్ట్రాటో ఆవరణం ఎత్తులో చాలాకాలం పాటు గాలిలో ఎగరగలిగేలా ఈ ఎయిర్‌షిప్‌ను రూపొందించినట్టు డీఆర్‌డీవో అధికారులు తెలిపారు. గాలికంటే తేలికైన ప్లాట్‌ఫామ్ వ్యవస్థల సాక్షాత్కారానికి ఈ ప్రొటోటైప్ విమానం ఒక మైలురాయి అని వారు పేర్కొన్నారు.



బాగ్లిహార్ డ్యాం..

పాక్‌పై జలఖడ్గం!

» బాగ్లిహార్ డ్యాం నుంచి నీళ్ల నిలిపివేత

న్యూఢిల్లీ, మే 4: పాకిస్థాన్‌పై భారత్ జలఖడ్గాన్ని ప్రయోగించింది. జమ్మూకశ్మీరులోని రాంబాన్ జిల్లాలో బాగ్లిహార్ డ్యాం నుంచి చీనాబ్ నదీ జలాల విడుదలను నిలిపివేసింది. జీలం నదిపై నిర్మించిన కిషన్‌గంగా డ్యాం నుంచి కూడా నీటి విడుదలను ఆపేయాలని యోచిస్తోందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈ రెండూ హైడ్రో-ఎలక్ట్రిక్ డ్యాంలు. అవసరమైనప్పుడు నీటి విడుదలను నియంత్రించేందుకు భారత్‌కు ఇవి వీలు కల్పిస్తున్నాయి. ప్రధానంగా బాగ్లిహార్ డ్యాంపై ఇరు దేశాల మధ్య మొదటి నుంచీ వివాదం ఉంది. దీని పరిష్కారానికి ప్రపంచ బ్యాంకు మధ్యవర్తిత్వాన్ని కూడా పాక్ గతంలో కోరింది. జీలం నదికి ఉపనది అయిన నీలం నదిపై కిషన్‌గంగా డ్యాం నిర్మించారు. ఈ మూడు నదులూ పాక్‌కు జీవనాడి వంటివి. సాగునీటికే కాదు.. తాగునీటికి కూడా ఇవే ఆధారం. దీంతో ఆ దేశం విలవిలలాడుతోంది. భారత్‌ను ఎలా ఎదుర్కోవాలో అర్థం గాక పాక్ మంత్రులు రెచ్చగొట్టే ప్రకటనలు చేస్తున్నారు. భారత్‌పై అణుదాడి చేస్తామని బెదిరిస్తున్నారు. పాక్‌కు ప్రవహించే నదులపై ఇండియా ఎలాంటి కట్టడాలు కట్టినా ధ్వంసం చేస్తామని పాక్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ శనివారం హెచ్చరించారు.

పాక్ గొప్పలన్నీ తప్పులే!

పీఎల్15 క్షిపణులపై దాయాదిదేశం ఆర్భాటపు ప్రచారం



» వాటి రేంజ్ 200-300 కిలోమీటర్లు ఉంటుందని, భారత్ వైమానిక దాడులను తిప్పికొట్టగలమని డంబాలు

» వాటి వాస్తవ రేంజ్ 120 కిలోమీటర్లే అంటున్న నిపుణులు

పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో.. 'భారత్ మాపై దాడి చేయడం తథ్యం' అని పాకిస్థాన్ భావిస్తున్న సంగతి తెలిసిందే! పుల్వామా దాడి అనంతరం భారత్ చేపట్టిన బాలాకోట్ వైమానిక దాడులను పరిగణనలోకి తీసుకుంటే.. ఈసారి కూడా ప్రధానంగా వైమానిక దాడులు చేసే అవకాశమే ఎక్కువని అంచనా. పాక్ రక్షణ మంత్రి ఖవాజా సైతం.. భారత వాయుసేనతో ఘర్షణ జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వ్యాఖ్యానించారు. అయితే గతానికీ ఇప్పటికీ తేడా ఏమిటంటే.. ఇప్పుడు భారత్ వద్ద అత్యంత అధునాతనమైన రాఫెల్ విమానాలు ఉన్నాయి. వీటి ద్వారా మిటియార్ క్షిపణులను ప్రయోగించవచ్చు. వీటి రేంజ్ దాదాపు 150 కిలోమీటర్లు. ఈ దాడులను ఎదుర్కోవడానికి సిద్ధమవుతున్న పాకిస్థాన్.. చైనీస్ పీఎల్-15 క్షిపణులను పెద్ద సంఖ్యలో సమకూర్చుకుంటోంది. ఇప్పటికే దాదాపు 100 మిస్సైల్స్ దాకా కొన్నట్టు సమాచారం. ఇవి ఎయిర్ టు ఎయిర్ మిస్సైళ్లు. అంటే విమానం నుంచి విమానాలపైకి ప్రయోగించే క్షిపణులు. వీటి రేంజ్ 200 నుంచి 300 కిలోమీటర్ల దాకా ఉంటుందని అంచనా. ఈ మిస్సైల్స్‌ను పాక్ వద్ద ఉన్న రెండు విమానాల ద్వారా ప్రయోగించవచ్చు. ఒకటి.. జే10సి. ఇది కొంతవరకూ రాఫెల్‌తో పోటీపడగలిగిన విమానం. రెండు.. చైనా, పాకిస్థాన్ కలిసి తయారుచేసిన జేఎఫ్ 17 జెట్లు. పాక్ వద్ద జే10సీ విమానాలు 20 నుంచి 25 దాకా ఉన్నట్టు సమాచారం. జేఎఫ్-17 యుద్ధవిమానాలైతే పెద్ద సంఖ్యలోనే ఉన్నాయి (పీఎల్-15 క్షిపణిని డిస్ప్లే చేసిన జేఎఫ్17 యుద్ధవిమానంతో సహా పలు ఫైటర్ జెట్లతో కూడిన 3 నిమిషాల వీడియోను పాక్ వాయుసేన ఇటీవల విడుదల చేసింది). ఒకవేళ రాఫెల్‌తో భారత్ వైమానిక దాడులు చేస్తే.. మన విమానాలను పాకిస్థాన్ పీఎల్-15 క్షిపణులతో చాలా ముందుగానే కొట్టేయవచ్చనే ప్రచారాన్ని పాకిస్థాన్‌లో విస్తృతంగా చేస్తున్నారు. కానీ.. ఇక్కడ రెండు సమస్యలున్నాయి. ఒకటి యుద్ధవిమానాల రాడార్ డిటెక్షన్ రేంజ్. క్షిపణుల రేంజ్ ఎక్కువగా ఉన్నంత మాత్రాన సరిపోదని.. ఆ క్షిపణులను ప్రయోగించడానికి వాడే విమానాల్లోని రాడార్ల డిటెక్షన్ రేంజ్ కూడా ఎక్కువగా ఉండాలని రక్షణ రంగ నిపుణులు చెబుతున్నారు. జే10సీ విమానాల్లో ఆ రేంజ్ ఎక్కువే గానీ.. జేఎఫ్17 విమానాల్లో తక్కువగా ఉంటుందని వారు వివరిస్తున్నారు. ఈ జేఎఫ్17 విమానాల్లో కూడా.. బ్లాక్ 1, బ్లాక్ 2, బ్లాక్ 3 అనే మూడు రకాలుంటాయి. వాటిలో బ్లాక్ 1, బ్లాక్ 2 అసలు ఈ క్షిపణులను ప్రయోగించలేవు. బ్లాక్ 3 రాడార్ డిటెక్షన్ రేంజ్ 140-150 కిలోమీటర్ల దాకా ఉంటుందని అంచనా. అంటే ప్రత్యర్థి విమానం అంత దగ్గర్లోకి వస్తే తప్ప దాన్ని గుర్తించి, మిస్సైల్‌ను ప్రయోగించలేవు. ఇక రెండో సమస్య.. పాకిస్థాన్ కొంటున్న పీఎల్-15 క్షిపణులు 'ఒరిజినల్ చైనీస్' రకం కావు. అవి వేరే దేశాలకు ఎగుమతి చేయడానికి చైనా ప్రత్యేకంగా తయారుచేసే ఎక్స్‌పోర్ట్ రకం (పీఎల్15 ఈ) క్షిపణులు. ఒరిజినల్ చైనీస్ క్షిపణుల కన్నా వీటి రేంజ్ తక్కువ. ఈ రెండు అంశాలనూ పరిగణనలోకి తీసుకుంటే.. జేఎఫ్17 ద్వారా ప్రయోగించే పీఎల్-15 మిస్సైళ్ల వాస్తవ రేంజ్ 120 కిలోమీటర్లు మాత్రమే ఉంటుందని.. అంతకు మించి ఉండదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అదేసమయంలో.. మన మిటియార్ క్షిపణుల 'నో ఎస్కేప్ జోన్' చాలా ఎక్కువని కూడా వారు గుర్తుచేస్తున్నారు. అంటే.. మిటియార్‌కి దొరికిన ప్రత్యర్థి విమానం తప్పించుకోవడం చాలా చాలా కష్టం. దీనికితోడు.. మన వద్ద ఉన్న ఎస్‌యు30 ఎంకేల ద్వారా అస్త్ర 1, అస్త్ర 2 క్షిపణులు ప్రయోగించి పాకిస్థాన్ విమానాలను సులభంగా ఎదుర్కోవచ్చని.. గగనతల యుద్ధంలో భారత్‌దే పైచేయి అవుతుందని వారు స్పష్టం చేస్తున్నారు.

– 'ఆంధ్రజ్యోతి' రక్షణ ప్రత్యేక ప్రతినిధి

గతంలో కాంగ్రెస్ తప్పులు చేసింది

» అప్పట్లో నేను లేను..కానీ బాధ్యత వహిస్తా

» సిక్కు వ్యతిరేక అల్లర్లపై అమెరికాలో ఓ విద్యార్థి ప్రశ్నకు రాహుల్ గాంధీ జవాబు



న్యూఢిల్లీ, మే 4: కాంగ్రెస్ పార్టీ అనేక తప్పులు చేసిందని, అయితే, అప్పుడు తాను లేనని, అయినప్పటికీ కాంగ్రెస్ చరిత్రలో జరిగిన తప్పులన్నింటికీ తాను సంతోషంగా బాధ్యత వహిస్తానని ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ చెప్పారు. 1984 సిక్కు వ్యతిరేక అల్లర్లు, సిక్కులతో కాంగ్రెస్ పార్టీ సంబంధాలపై అడిగిన ప్రశ్నకు రాహుల్ ఈ విధంగా సమాధానం ఇచ్చారు. 1980లలో జరిగినది 'తప్పు' అని తాను బహిరంగంగానే చెప్పానన్నారు. గతనెల 21న అమెరికాలోని బ్రౌన్ యూనివర్సిటీలో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆ వీడియోను తాజాగా వాట్సన్ ఇనిస్టిట్యూట్ ఫర్ ఇంటర్నేషనల్ అండ్ పబ్లిక్ అఫైర్స్ శనివారం యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసింది. ఈ ముఖాముఖిలో 1984 నాటి సిక్కు వ్యతిరేక అల్లర్లను ఒక సిక్కు విద్యార్థి ప్రస్తావించాడు. సిక్కులతో సయోధ్య కోసం ఏం ప్రయత్నాలు చేస్తున్నారని రాహుల్‌ను ప్రశ్నించాడు. భారత్‌లో సిక్కులను తలపాగా ధరించనివ్వాలా? వద్దా? అనే అంశంపై తాను పోరాడుతున్నానని గతంలో అమెరికాకు వచ్చినప్పుడు రాహుల్ చెప్పారని కూడా ఆ విద్యార్థి గుర్తుచేశాడు. దీనిపై రాహుల్ స్పందిస్తూ.. 'ఏదైనా సిక్కులను భయపెడుతుందని నేను అనుకోవడం లేదు. అప్పుడు నేను చేసిన ప్రకటన ఏమిటంటే.. ప్రజలు తమ మతాన్ని వ్యక్తం చేయడంలో అసౌకర్యానికి గురవుతున్న భారతదేశం మనకు కావాలా? అని. కాంగ్రెస్ పార్టీ చేసిన తప్పుల విషయానికి వస్తే.. నేను లేనప్పుడు ఎన్నో తప్పులు జరిగాయి. అయినా, చరిత్రలో కాంగ్రెస్ పార్టీ చేసిన తప్పులన్నింటికీ నేను సంతోషంగా బాధ్యత వహిస్తాను. నేను ఎన్నోసార్లు స్వర్ణ దేవాలయానికి వెళ్లాను. భారతదేశంలో సిక్కులతో నాకు చాలా మంచి, ప్రేమపూర్వక సంబంధాలు ఉన్నాయి' అన్నారు.

పశ్చాత్తాపం పూర్తిగా ఉండాలి:బీజేపీ

1984లో జరిగిన సిక్కుల వ్యతిరేక అల్లర్లు తప్పేనని రాహుల్‌గాంధీ నిజంగా భావిస్తున్నట్లైతే, అందుకు బాధ్యత వహించేందుకు ఆయన సిద్ధంగా ఉన్నట్లైతే జగదీశ్ టైట్లర్, కమల్‌నాథ్, శ్యామ్ పిట్రోడాలను కాంగ్రెస్ పార్టీ నుంచి బహిష్కరించాలని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ఆర్‌పీ సింగ్ డిమాండ్ చేశారు. పశ్చాత్తాపం ప్రదర్శించాలంటే పూర్తిగా ప్రదర్శించాలని హితవు పలికారు. 'తప్పు జరిగిందని మీరు నిజంగా భావిస్తున్నట్లైతే ఆ ముగ్గురినీ పార్టీ నుంచి బహిష్కరించి సరిచేసుకోండి' అని సూచించారు. కాగా, రాహుల్‌గాంధీ భారతదేశంలోనే కాకుండా ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా పరిహాసానికి గురవుతున్నారని బీజేపీ ఐటీ విభాగం అధ్యక్షుడు అమిత్ మాలవీయ ఎద్దేవా చేశారు. అదే ముఖాముఖి కార్యక్రమంలో రాముడిని కల్పిత పాత్రగా రాహుల్ అభివర్ణించారంటూ అమిత్ మాలవీయ మండిపడ్డారు. రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువుల విశ్వాసాలను పరిహసించడం మానుకోవాలన్నారు.



నీట్ కేంద్రం వద్ద నిరసన తెలుపుతున్న దృశ్యం

నీట్ రాసేందుకు వెళితే.. జంధ్యం తీయించారు

» కలబురగిలో నిరసన

బెంగళూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): నీట్ పరీక్ష రాసేందుకు వెళ్లిన విద్యార్థి జంధ్యం తొలగించిన ఘటన ఆందోళనకు దారితీసింది. కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లా బసవకల్యాణ తాలూకా బెటబలగుంద గ్రామానికి చెందిన శ్రీపాదపాటిల్ కలబురగిలోని సెయింట్ మేరీ పాఠశాలలో ఆదివారం నీట్ పరీక్షకు వెళ్లాడు. పరీక్ష కేంద్రంలో ప్రవేశించే సమయంలో జంధ్యం తొలగించాలని సూచించారు. దీంతో పరీక్షను కోల్పోవాల్సి వస్తుందని వెంటనే ఆ విద్యార్థి జంధ్యాన్ని తొలగించి, కేంద్రం వద్ద వేచివున్న తండ్రికి ఇచ్చి లోపలికి వెళ్లాడు. విషయం కాసేపటికే వైరల్ కావడంతో కలబురగిలోని బ్రాహ్మణులు ఆందోళనకు దిగారు. జంధ్యం తొలగించాలని సూచించిన అధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల సేవలన్నీ ఒకే వేదికపైకి

» త్వరలోనే అన్ని అంశాలతో 'ఈసీఐనెట్' డిజిటల్ వేదిక

న్యూఢిల్లీ, మే 4 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఎన్నికలకు సంబంధించిన ప్రకటనలు, నిర్వహణ, ఫలితాల వెల్లడి, అభ్యర్థుల వివరాలు, ఓటర్ల నమోదు, సందేహాల నివృత్తి.. ఇలా ఎన్నికల సేవలకు సంబంధించిన సమస్త సమాచారాన్ని ఒకే చోట అందుబాటులోకి తెచ్చేందుకు సరికొత్త డిజిటల్ వేదికను రూపొందించింది కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీఐ). ఇప్పటి వరకు ఉన్న సుమారు 40 మొబైల్, వెబ్ అప్లికేషన్లను అనుసంధానం చేస్తూ త్వరలోనే 'ఈసీఐనెట్'ను అందుబాటులోకి తీసుకువస్తున్నామని ఈసీఐ ఆదివారం ప్రకటించింది. ఇది అందుబాటులోకి వస్తే ఇకపై ఎన్నికల సంఘానికి సంబంధించిన వేర్వేరు యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాల్సిన అవసరం ఉండదని వివరించింది.

40 యాప్‌లతో అనుసంధానం..

ఎన్నికల సంఘం సమాచారం కోసం ఇప్పటి వరకు ఉపయోగిస్తున్న 40 వెబ్ సైట్లు, మొబైల్ యాప్‌ల అనుసంధానంతో 'ఈసీఐనెట్'ను రూపొందించినట్టు ఈసీఐ తెలిపింది. అఫిడవిట్ పోర్టల్, ఇండియా ఎ వెబ్, రిజల్ట్ వెబ్‌సైట్, ఎలక్షన్ 24(ఆర్కైవ్), ఈసీఐ స్వీప్, ఈసీఐ వెబ్‌సైట్, ఫెంటోసా, వాయిస్‌నెట్, మిత్ వర్సెస్ రియాలిటీ, ఎలక్షన్ ట్రెండ్స్ టీవీ, సీ విజిల్ పోర్టల్, ఈఎంఎస్, ఆర్టీఐ పోర్టల్, ఎన్కోర్, మీడియా వోచర్, సువిధ పోర్టల్, అబ్జర్వర్ పోర్టల్, ఎలక్షన్ ప్లానింగ్ ఐఈఎంఎస్, పీపీఆర్ టీఎంఎస్, ఏరోనెట్ 2.0, ఓటర్స్ సర్వీస్ పోర్టల్, సర్వీస్ ఓటర్ పోర్టల్, ఈటీపీఎంటీఎస్, ఎన్వీఎస్పీ, ఎలక్టోరల్ సెర్చ్ వెబ్ సైట్లతో పాటు ఎరోనెట్ యాప్, బీఎల్‌వో యాప్, సీవిజిల్, డిసైడర్, ఎన్కోర్ నోడల్, ఈఎస్‌ఎంఎస్, ఇన్వెస్టిగేటర్, కేవైసీ, మానిటర్, అబ్జర్వర్, సాక్ష్యం, సువిధ, ఓటర్ టర్నౌట్ తదితర అప్లికేషన్లన్నీ ఒకే గొడుగు కిందకు రానున్నాయని ఈసీఐ వివరించింది.

ఏపీ నీటి దోపిడీకి బీఆర్ఎస్ మద్దతు

- కృష్ణా నది నుంచి 512 టీఎంసీలు తరలించుకోపోతున్నా పట్టించుకోలేదు
- న్యాయమైన వాటాకు సర్కారు పోరాటం
- ఎస్ఎల్‌బీసీ పనులపై నిపుణుల కమిటీ
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



మిర్యాలగూడ/తిరుమలగిరిరూరల్/హుజూర్‌నగర్/కోదాడ, మే 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నీటి దోపిడీకి బీఆర్ఎస్ ప్రభుత్వమే మద్దతు పలికిందని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మండిపడ్డారు. 2014 నుంచి 2023 వరకు కృష్ణానది నుంచి ఏపీ ఏటా 512 టీఎంసీల నీటిని తరలించుకుపోతుంటే బీఆర్ఎస్ సర్కారు చోద్యం చూసిందన్నారు. ఆదివారం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మంత్రి ఉత్తమ్ పర్యటించి నీటిపారుదల, పౌరసరఫరాల శాఖలపై సమీక్షలు నిర్వహించడంతో పాటు కోదాడ, హుజూర్‌నగర్, తుంగతుర్తి నియోజకవర్గాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాగార్జునసాగర్, మిర్యాలగూడ, హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లోని 80 శాతం భూములకు సాగర్ ఎడమ కాల్వ ద్వారా సాగు నీరు అందుతుండగా బ్రిజేష్ ట్రిబ్యునల్ సూచనల మేరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కృష్ణా జలాలను 811 టీఎంసీలు వినియోగించుకోవాల్సి ఉందన్నారు. మూడింట రెండొంతుల నీటిని ఏపీ తరలిస్తుంటే బీఆర్ఎస్ నేతల్లో కనీస స్పందన కూడా లేకుండా పోయిందని విమర్శించారు. కాంగ్రెస్ సర్కారు కృష్ణా నీటిలో తెలంగాణ న్యాయమైన వాటా కోసం పోరాడుతోందన్నారు. 811 టీఎంసీల్లో 70 శాతం తెలంగాణకు, 30 శాతం ఏపీకి కేటాయించాలని కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ) దృష్టికి తీసుకెళ్లడంతో పాటు ప్రభుత్వం బలంగా వాదనలు వినిపిస్తోందని చెప్పారు.

ప్రతి ఎకరాకు నీరు ఇవ్వడమే లక్ష్యం

ప్రతి ఎకరాకు నీరు అందించటమే ప్రభుత్వ లక్ష్యమని ఉత్తమ్ అన్నారు. అన్ని ప్రాజెక్టుల్లో పూడికతీత పనులు చేపట్టినట్లు వెల్లడించారు. ఎస్ఎల్‌బీసీ పనులను కొనసాగించడానికి నిపుణుల కమిటీని వేసి వారి సూచనల మేరకు టన్నెల్ పనులు పూర్తి చేస్తామని చెప్పారు. డిండి ప్రాజెక్టు పనులకు టెండర్లు పూర్తి చేసి పనులు మొదలుపెట్టామన్నారు. గత సీజన్‌లో 153.58 లక్షల మెట్రిక్ టన్నులు.. ఈ యాసంగిలో 127 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతులు పండించారని, మొత్తం ఏడాదిలో 280 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పండించి దేశంలోనే అత్యధిక ధాన్యం పండించిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు. పేదల కడుపు నింపేందుకే కాంగ్రెస్ సర్కారు సన్నబియ్యం పంపిణీని చేపట్టిందని చెప్పారు.

జన్మనిచ్చిన తాటిపాములను మరిచిపోను..

తనకు జన్మనిచ్చిన గ్రామం తాటిపాములను ఏనాడూ మర్చిపోనని మంత్రి ఉత్తమ్ అన్నారు. తాటిపాములలో రూ.20 కోట్లతో నిర్మించే యశ్వంతాపూర్ వాగుపై చెక్‌డ్యాం, ఇతర అభివృద్ధి పనుల శంకుస్థాపనకు మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావులతో కలిసి హాజరయ్యారు. దేవాదుల చివరి ప్యాకేజీ నుంచి చెన్నూరు రిజర్వాయర్ నుంచి తాటిపాముల మీదుగా తిరుమలగిరికి సాగునీటిని తరలిస్తామని ఉత్తమ్ తెలిపారు. తన చిన్నతనంలో ఆ వాగుపై ఆడుకున్నానని గుర్తుచేసుకున్నారు. గ్రామంలో ఉన్నత పాఠశాల భవన నిర్మాణానికి రూ.కోటి, ప్రాథమిక పాఠశాలకు రూ.కోటి నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. ఎస్ఎల్‌బీసీ పూర్తయితే నల్లగొండ జిల్లా సస్యశ్యామలం అవుతుందని చెప్పారు. కార్యక్రమాల్లో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎంపీలు రఘువీర్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీలు శంకర్‌నాయక్, నెల్లికంటి సత్యం, ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, జైవీర్ రెడ్డి, బాలునాయక్, రాజగోపాల్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ ప్రధాన కార్యదర్శి డీఎస్ చౌహాన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



కామారెడ్డిలోని గాంధీగంజ్‌లో వర్షానికి కొట్టుకుపోయిన ధాన్యాన్ని దగ్గరికి చేరుస్తున్న రైతులు

అకాల వర్షం.. తీరని నష్టం

(మొదటి పేజీ తరువాయి)

రహదారులపైన, ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఆరబోసిన ధాన్యం తడిచిపోయింది. కొన్ని ప్రాంతాల్లో రోడ్డుకి ఇరువైపులా ఉన్న చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, కరీంనగర్, జగిత్యాల తదితర జిల్లాల రైతులను అకాల వర్షం దెబ్బ తీసింది. సిద్దిపేట జిల్లాలో ఆదివారం సాయంత్రం గంటన్నరకు పైగా కురిసిన వర్షానికి మార్కెట్ యార్డులోని ధాన్యం నీళ్లలో కొట్టుకుపోయింది. జిల్లాలోని చిన్నకోడూర్ మండలంలో పిడుగుపాటుకు రెండు ఎద్దులు మరణించాయి. అలాగే, సిద్దిపేట జిల్లా కొండపాక మండలం దుద్దెడ శివారులో ఉన్న టోల్‌ప్లాజా పైకప్పు రేకులు ఈదురుగాలుల దెబ్బకు కూలి నాలుగు కౌంటర్లు ధ్వంసమయ్యాయి. దీంతో దాదాపు గంటసేపు వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని పలు మండలాల్లో వడగండ్ల వాన కురిసింది. మెదక్ జిల్లాలోని చేగుంట, నిజాంపేట, రామాయం పేట, అల్లాదుర్గం మండలాల్లో మామిడి కాయలు నేలరాలగా, కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిచింది. కామారెడ్డి జిల్లాలో భారీ వర్షానికి దోమకొండ, బీబీపేట, నిజాంసాగర్, ఎల్లారెడ్డి, తాడ్వాయి, సదాశివనగర్, భిక్కనూర్, రాజంపేటలోని కల్లాల్లోని ధాన్యం తడిచిపోయింది. ధాన్యం కొనుగోలు కేంద్రాలవద్ద ఆరబోసిన ధాన్యం నీళ్లపాలైంది. కామారెడ్డి జిల్లా బీబీపేట మండలం తుజాల్‌పూర్‌లో పిడుగుపడి ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. వాన బీభత్సానికి కరీంనగర్ జిల్లా ఇందుర్తిలో ఇల్లు కూలిపోగా, గునుకులపల్లిలో మామిడి చెట్లు విరిగిపడ్డాయి. జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలంలో కురిసిన వడగండ్ల వాన దెబ్బకు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిచిపోగా, పలు గ్రామాల్లో మామిడి కాయలు నేలరాలాయి. మరోపక్క, నిజామాబాద్ జిల్లా వేంపల్లిలో ఆదివారం 45.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. కామారెడ్డి జిల్లాలో 44.7, నిర్మల్ జిల్లాలో 41.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. వడదెబ్బ వల్ల మహబూబాబాద్ జిల్లా అప్పరాజుపల్లికి చెందిన మండల సర్వయ్య(55) అనే ఉపాధి కూలి, ఖమ్మం జిల్లా ముత్తగూడెం గ్రామానికి చెందిన పాపయ్య(70) ఆదివారం ప్రాణాలు కోల్పోయారు. కాగా, రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో 4 రోజులతో పోలిస్తే ఆదివారం వాతావరణం కాస్త చల్లబడింది. హైదరాబాద్‌లో ఆదివారం 38 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదవ్వగా.. రాబోయే 3 రోజులు వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు.



టర్మినల్ ప్రవేశ ద్వారానికి మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

చర్లపల్లి టర్మినల్ ప్రవేశద్వారానికి మరమ్మతులు

కుషాయిగూడ, మే 4 (ఆంధ్రజ్యోతి): చర్లపల్లి రైల్వే శాటిలైట్ టర్మినల్ ప్రవేశ ద్వారానికి ఇరువైపులా ఊడిపడ్డ పైకప్పునకు ఆదివారం మరమ్మతులు నిర్వహించారు. శనివారం సాయంత్రం ఈదురు గాలులకు పైకప్పు ఊడిపడ్డ విషయం తెలిసిందే. కాగా, దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ ఉన్నతాధికారులతో కలిసి టర్మినల్‌ను ఆదివారం పరిశీలించారు. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



విజయవాడలో కురిసిన భారీ వర్షానికి జలమయమైన బందర్ రోడ్డు

ఏపీలో గాలివాన బీభత్సం

మండువేసవిలో భారీవర్షంతో అతలాకుతలం

- వడగండ్లు, పిడుగులు, ఈదురుగాలుల హోరు
- పిడుగులు పడి ఆరుగురి మృతి
- చెట్టు కూలి బాలుడు, విద్యుద్ఘాతంతో మరొకరు
- వేలాది ఎకరాల్లో మామిడి, వరి పంటలకు నష్టం

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

మండువేసవిలో ఆంధ్రప్రదేశ్‌ను అకాలవర్షం అతలాకుతలం చేసింది. ఉరుములు, మెరుపులు, వడగళ్లు, పిడుగులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం పలు ప్రాంతాల్లో బీభత్సం సృష్టించింది. పిడుగులు పడి ఆరుగురు, గాలివాన ధాటికి చెట్టు కూలి ఓ బాలుడు, విద్యుద్ఘాతంతో మరొకరు మరణించారు. పెనుగాలులు, భారీ వర్షానికి వేలాది ఎకరాల్లో మామిడి, వరి, బొప్పాయి, మొక్కజొన్న, అరటి పంటలు దెబ్బతిన్నాయి. ముఖ్యంగా మామిడి, వరి రైతులకు భారీ నష్టం వాటిల్లింది. ఈదురుగాలులకు చాలా చోట్ల భారీ వృక్షాలు, చెట్లు, విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షపు నీరు భారీగా రోడ్లపై నిలవడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో భారీవర్షం పడింది. కాకినాడ, ఏలూరు, కోనసీమ జిల్లాల్లో వాన దంచి కొట్టింది. కాకినాడ జిల్లా కాజులూరులో అత్యధికంగా 105 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. 130 చోట్ల 20 మిల్లీమీటర్ల కన్నా అధికంగా వానపడింది. గోదావరి జిల్లాల్లో వేలాది ఎకరాల్లో అరటి, కొబ్బరి, బొప్పాయి తోటలు దెబ్బతిన్నాయి. కృష్ణా, గోదావరి డెల్టా ప్రాంతాల్లో రోడ్లపై ఆరబోసిన ధాన్యం తడిసింది. ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల్లో మామిడి పంటకు అపార నష్టం వాటిల్లింది. ఏలూరు, కాకినాడ, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో చాలా చోట్ల చెట్లు విరిగిపడ్డాయి. హోర్డింగ్‌లు పడిపోయాయి. విజయవాడ సహా పలు నగరాల్లో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి.

మృత్యువాత..

తిరుపతి జిల్లాలో మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో ఈదురుగాలులతో పాటు మెరుపులు, ఉరుములతో భారీ వర్షం కురిసింది. నాయుడుపేట మండలం వద్దిగుంట కండ్రిగ గ్రామానికి చెందిన భాస్కర్ (50), ఓజిలి మండలం గ్రద్దగుంట పంచాయతీ గొల్లపాలెం వద్ద కార్తీక్ అనే బాలుడు, నెల్లూరు జిల్లా రాపూరు మండలం రావిగుంటపల్లికి చెందిన తాటి బోయిన చిన్నయ్య (50)పిడుగు పాటుకు గురై మృతి చెందారు. బాపట్ల జిల్లా కొల్లూరు మండలం పరిధిలోని గాజుల్లంక గాలు మార్గంలో పిడుగుపడి మాతంగి సుప్రదీప్(23) దుర్మరణం పాలయ్యాడు. మరో వ్యక్తి స్వల్పగాయాలతో బయటపడ్డాడు. పర్చూరు నియోజకవర్గం చిన్నగంజాంలోని కొమ్మమూరు కాలువ వద్ద గొర్రెల కాపరి గడ్డం బ్రహ్మయ్య (47)పై పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఏలూరు జిల్లా ముసునూరు మండలం చెక్కపల్లిలో ఇంటిపై వెలగచెట్టు విరిగిపడడంతో మామిడి బాలగోవింద్ (12) అనే బాలుడు మృతి చెందగా, అతని తండ్రి మారేశు తీవ్రంగా గాయపడ్డాడు. దెందులూరులో ఇంటిముందు విద్యుత్ సర్వీస్ వైరు తెగి పడటంతో విద్యుద్ఘాతానికి గురై తానికొండ జార్జి (53) మృతి చెందాడు. మండవల్లి మండలం దెయ్యంపాడులో సైదు గిరిబాబు (33) రొయ్యల చెరువు వద్ద మేత మేస్తుండగా పిడుగు పడి మృతి చెందాడు. ఏపీలో రెండు రోజులపాటు భిన్న వాతావరణం ఉంటుందని.. కొన్ని చోట్ల 41-42 డిగ్రీల ఉష్ణోగ్రతలు, మరికొన్ని చోట్ల ఈదురు గాలులతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.



విజయవాడలోని టిక్కిల్ రోడ్డు కూలిపోయిన భారీ వృక్షం



విజయవాడలో భారీ వర్షం ధాటికి రోడ్డుపై పడిపోయిన బారికేడ్లు



తమకు న్యాయం చేయాలని ప్లకార్డులు ప్రదర్శిస్తున్న బాధితులు

వైసీపీ నేత బంధువు భూ'ఆగడాలు

- పేట్‌బషీరాబాద్‌లో పినిపె బంధువు కబ్జా యత్నాలు
- శివోమ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు హరిబాబు ఆవేదన

పంజాగుట్ట, మే 4 (ఆంధ్రజ్యోతి): పైసాపైసా కూడబెట్టి కొనుగోలుచేసిన ప్లాట్లను లేఔట్ వేసి అభివృద్ధి చేసుకోకుండా తమను వైసీపీ సీనియర్ నేత, ఏపీ మాజీ మంత్రి పినిపె విశ్వరూప్ బావమరిది ఇసుకపాట్ల సాంబమూర్తి ఇబ్బందుల పాల్జేస్తున్నారని పలువురు శివోమ్ ప్రాజెక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ బాధితులు ఆరోపించారు. శివోమ్ ప్రాజెక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్లు వీఎస్ఎన్ రాజు, పి.బోసురాజు, చిలుకూరి నరేశ్‌లు జీడిమెట్ల మండలం కుత్బుల్లాపూర్ గ్రామం పేట్ బషీరాబాద్‌లోని 18,19 సర్వే నంబర్ల పరిధిలో గల 3 ఎకరాల 35 గుంటల భూమిని 45 ప్లాట్లుగా విభజించి లే ఔట్ వేశారని శివోమ్ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.హరిబాబు, సభ్యులు రాధాకృష్ణ, మార్టిన్, అనిత, రజనీ తదితరులు ఆదివారం మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. తాము పైసాపైసా కూడబెట్టి రూ.50 కోట్లు చెల్లించి సేల్ డీడ్ ద్వారా 40 ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు తెలిపారు. విగతా ఐదు ప్లాట్లను జీహెచ్ఎంసీకి మార్టగేజ్ చేసిన ప్లాట్లను పలువురికి విక్రయించిన శివోమ్ ప్రాజెక్ట్ ఎండీ, డైరెక్టర్లు.. వారి వద్ద డబ్బు తీసుకుని కూడా రిజిస్ట్రేషన్ చేయలేదని హరిబాబు తదితరులు తెలిపారు. ఇసుకపాట్ల సాంబమూర్తి, ఏపీకి చెందిన పి.బోసురాజు భూ కబ్జాకు యత్నిస్తూ.. దౌర్జన్యానికి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తుది లేఔట్ ఖరారు కాక ఇళ్ల నిర్మాణానికి అధికారులు అనుమతించడం లేదని శివోమ్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

అన్నప్రసాదం ట్రస్టుకు 1.50 కోట్ల విరాళం

తిరుమల, మే4(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం అన్నప్రసాదం ట్రస్టుకు ఆదివారం రూ.1.50 కోట్లు విరాళంగా అందాయి. బెంగళూరుకు చెందిన సుయుగ్ వెంచర్స్ ఎల్ఎల్‌పీ సంస్థ చైర్మన్ యతీష్ సూరినేని ఈ విరాళాన్ని ఇచ్చారు. విరాళం చెక్‌ను తిరుమలలో టీటీడీ ధర్మకర్తల మండలి చైర్మన్ బీఆర్ నాయుడికి దాత అందజేశారు.

గురుకుల సెట్ రెండో విడత ఫలితాలు విడుదల

హైదరాబాద్, మే 4 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో 5వ తరగతిలో ప్రవేశం కోసం ఫిబ్రవరిలో నిర్వహించిన పరీక్ష ఫలితాలు ఆదివారం విడుదల చేశారు. ఇప్పటికే మొదటి విడత ఫలితాలు విడుదల చేశామని, వివిధ కేటగిరీల్లో మరో 13,130 సీట్లకు రెండో విడత ఫలితాలు విడుదల చేసినట్టు టీజీ సెట్ చీఫ్ కన్వీనర్ అలగు వర్షిణి తెలిపారు. అర్హులైన విద్యార్థుల జాబితాను గురుకుల అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచామని, అర్హత పొందిన విద్యార్థులు ఈ నెల 20వ తేదీలోపు సంబంధిత ఇన్‌స్టిట్యూట్‌లో రిపోర్ట్ చేయాలన్నారు.

టీడీపీ మహానాడుకు శ్రీకారం

- ఈ నెల 27-29 వరకు పసుపు పండుగ
- కడప జిల్లా చింతకొమ్మదిన్నెలో ఏర్పాట్లు ప్రారంభం

సీకేదిన్నె, మే 4(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే 'మహానాడు'కు ఆ పార్టీ నాయకులు శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది మహానాడును కడప జిల్లా, కమలాపురం నియోజకవర్గంలోని చింతకొమ్మదిన్నె పరిధిలో నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో మహానాడు ప్రాంగణంలో కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్. శ్రీనివాసరెడ్డిల ఆధ్వర్యంలో ఆదివారం పనులను ప్రారంభించారు. మహానాడుకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి లక్షలాదిగా కార్యకర్తలు తరలివచ్చే అవకాశం ఉంది. దానిని దృష్టిలో ఉంచుకుని సభా ప్రాంగణం, ఇతర ఏర్పాట్లను దాదాపు 20 రోజుల ముందుగానే ప్రారంభించారు. చింతకొమ్మదిన్నె మండలంలోని చెర్లోపల్లె పొలంలో రింగ్ రోడ్డుకు ఆనుకుని ఉన్న 120 ఎకరాల్లో స్థలాన్ని చదును చేసే పనులు మొదలుపెట్టారు. ఈ నెల 27, 28, 29 తేదీల్లో మహానాడు నిర్వహించేందుకు సీఎం చంద్రబాబు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఇంతవరకు స్థల పరిశీలన కోసం ఎదురుచూస్తున్నారు. అయితే, స్థలం ఎంపిక పూర్తి కావడంతో సభావేదిక, భోజనశాలలు తదితర అవసరాల నిమిత్తం 120 ఎకరాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక నాయకుల సహకారంతో పనులు వేగవంతంగా పూర్తి చేసేందుకు ఎమ్మెల్యే చైతన్యరెడ్డి రంగంలోకి దిగారు. కడప జిల్లాలో తొలిసారి నిర్వహిస్తున్న మహానాడును దిగ్విజయం చేసేందుకు నాయకులు కలసికట్టుగా ముందుకు సాగుతున్నారు.



పనులను ప్రారంభిస్తున్న పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి

35 లక్షల క్వింటాళ్లు.. రూ. 175 కోట్లు

క్వింటాలుకు రూ.500 చొప్పున లాభం.. ఎమ్మెస్పీతో లబ్ధిపొందిన జిన్నింగ్ మిల్లర్లు

- తాత్కాలిక ధ్రువపత్రాలతో మాయాజాలం
- సీసీఐ కేంద్రాల్లో పత్తి కొను'గోల్‌మాల్'
- నేడు ఆదిలాబాద్ జిల్లాకు విజిలెన్స్ బృందం

హైదరాబాద్, మే 4 (ఆంధ్రజ్యోతి): పత్తి క్వింటాకు కనీస మద్దతు ధర రూ.7,521. కానీ రైతుల నుంచి జిన్నింగ్ మిల్లర్లు కొనుగోలు చేసింది రూ.7 వేలకే. అదే పత్తిని జిన్నింగ్ మిల్లర్లు సీసీఐ(కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా)కి అమ్మితే పడిన రేటు రూ.7,521. అంటే క్వింటా పత్తి మీద రూ.500 లాభం. పత్తి రైతులకు మస్కా కొట్టి.. సీసీఐ, వ్యవసాయ శాఖ అధికారులతో కుమ్మక్కై, మార్కెటింగ్ అధికారులను మచ్చిక చేసుకొని తాత్కాలిక ధ్రువపత్రాలతో జిన్నింగ్ మిల్లర్లు పొందిన లబ్ధి అక్షరాలా రూ.175 కోట్లు. రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఆదేశాల మేరకు విజిలెన్స్ అధికారులు జరుపుతున్న విచారణలో కళ్లు బైర్లు కమ్మే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి.

కౌలు రైతులు, పోడు రైతులు, పట్టాదారు పాస్‌పుస్తకాలు లేని పత్తి రైతులు సీసీఐకి పత్తి అమ్ముకోవటానికి వ్యవసాయశాఖ 60 వేల తాత్కాలిక ధ్రువపత్రాలు జారీచేసిన విషయం విదితమే. ఈ 'టీఆర్'లను రైతుల కంటే ఎక్కువగా జిన్నింగ్ మిల్లర్లు, ట్రేడర్లు, దళారులు వినియోగించుకొని సొమ్ము చేసుకున్నారు. పట్టాదారు పాస్ పుస్తకాలు లేకుండా కేవలం తాత్కాలిక సాగు ధ్రువీకరణ పత్రాలతో సీసీఐ కొనుగోలు చేసిన పత్తి 35 లక్షల క్వింటాళ్లుగా లెక్క తేలింది. అయితే ఈ పత్తిని సీసీఐ కనీస మద్దతు ధర(ఎమ్మెస్పీ) క్వింటాకు రూ.7,521 చొప్పున కొనుగోలు చేసింది. కానీ కొనుగోలు చేసింది మాత్రం పత్తి రైతుల నుంచి కాదు. రైతుల పేర్లతో జిన్నింగ్ మిల్లర్లు సీసీఐకి ఈ 35 లక్షల క్వింటాళ్ల పత్తిని అమ్ముకొని లబ్ధిపొందారు. రైతుల నుంచి క్వింటాకు రూ.6,800 నుంచి రూ.7 వేల చొప్పున జిన్నింగ్ మిల్లర్లు, దళారులు, ట్రేడర్లు పత్తి కొనుగోలు చేశారు. సగటున క్వింటాకు రూ.7 వేల చొప్పున కొనుగోలు చేయటంతో.. ఎమ్మెస్పీ కంటే రూ.500 తక్కువకు మిల్లర్లకు పత్తి దొరికింది. ఇలా 60 వేల టీఆర్‌లపై 35 లక్షల క్వింటాళ్ల పత్తిని సీసీఐకి అమ్మి రూ.175 కోట్ల లాభాన్ని జిన్నింగ్ మిల్లర్లు పొందారు. పట్టాదారుల పేర్ల మీద కూడా అక్రమ కొనుగోళ్లు జరిగినప్పటికీ.. ప్రస్తుతానికి టీఆర్‌ల ద్వారా జరిగిన అక్రమ లావాదేవీలపైనే విజిలెన్స్ అధికారులు విచారణ చేస్తున్నారు. వ్యవసాయ శాఖలో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఏఈవోలు, ఏవోలు, మార్కెటింగ్ శాఖ కార్యదర్శులు, సీసీఐ అధికారులు, వారి ప్రైవేటు సిబ్బంది, జిన్నింగ్ మిల్లర్లు, బ్రోకర్లు, ట్రేడర్ల ప్రమేయంపై విచారణ జరుపుతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం, నల్లగొండ, కరీంనగర్, మెదక్ జిల్లాల్లోని సీసీఐ కొనుగోలు కేంద్రాలను అధికారులు తనిఖీ చేస్తున్నారు. రికార్డులను పరిశీలిస్తున్నారు. ఏఈవోలు, ఏవోలు, మార్కెట్ కార్యదర్శులను వ్యక్తిగతంగా విచారిస్తూ, లిఖిత పూర్వకంగా వివరణ తీసుకుంటున్నారు. టీఆర్‌లలో పేర్లు ఉన్న రైతులను కలిసి పత్తి సాగు చేశారా..? లేదా..? ఏఈవోల నుంచి సాగు ధ్రువీకరణ పత్రాలు తీసుకున్నారా..? లేదా..? సీసీఐకి పత్తి అమ్మారా..? లేదా..? రైతులకు తెలిసి జరిగిందా..? తెలియకుండా జరిగిందా..? రైతులు ఫొటోలు దిగారా..? టీఆర్‌లలో పేర్కొన్న ఫోన్ నంబర్లు, బ్యాంకు ఖాతా నంబర్లు రైతులవేనా..? ఓటీపీలు ఏ నంబర్లకు వచ్చాయి..? అనే అంశాలపై విజిలెన్స్ అధికారులు విచారణ చేస్తున్నారు.



ఆదిలాబాద్ జిల్లాలో అత్యధికం..

సీసీఐ పత్తి కొనుగోళ్లు ఎక్కువగా జరిగిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాపై విజిలెన్స్ అధికారులు ప్రత్యేక దృష్టిసారించారు. ఇక్కడ అత్యధికంగా 85 జిన్నింగ్ మిల్లులు ఉన్నాయి. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్ ప్రాంతాల్లోని జిన్నింగ్ మిల్లుల్లో ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రాల్లో అక్రమ కొనుగోళ్లు పెద్దఎత్తున జరిగినట్లు ఫిర్యాదులు వచ్చాయి. ఆదిలాబాద్ బీ-సీసీఐ కేంద్రంలో 2 లక్షల క్వింటాళ్ల పత్తిని పరమాత్మ జిన్నింగ్ మిల్లు యజమానులే విక్రయించారని లిఖిత పూర్వక ఫిర్యాదులు వచ్చినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఆదిలాబాద్- ఏ సెంటర్‌లో రజిత కాటన్ మిల్స్ యజమానులు 70 వేల క్వింటాళ్ల పత్తిని సీసీఐకి విక్రయించినట్లు విజిలెన్స్ ప్రధాన కార్యాలయానికి ఫిర్యాదులు వచ్చాయి. ఇప్పటికే జరిపిన ప్రాథమిక విచారణలో ఆదిలాబాద్ మార్కెట్ కార్యదర్శి మధుకర్‌పై సస్పెన్షన్ వేటువేశారు. ఆదిలాబాద్‌లోని ఏ, బీ జోన్లలో తాత్కాలిక ధ్రువపత్రాలతో జరిగిన కొనుగోళ్లలో అక్రమాలు జరిగిన తీరుపై నేడు విజిలెన్స్ అధికారులు క్షేత్రస్థాయి విచారణ జరపనున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.

వివిధ

vividha@andhrajyothy.com
సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

అంగడి అందాలు



దునియా దేశాల మహిళామణుల్ని
అందాల బందిఖానాలేసి
హద్దు పొద్దెరుగకుంటా
ఆడదేహాలతో ఆడే జూదాలు.
లోకంల ఆడయినా, మగయినా,
సెట్టయినా పిట్టయినా అందమంటే
సూసే సూపు సుతారమే
గానీ, రూపు గాదనే లెక్కున్నది.
అందాలంటే ఆడోళ్లకే పేటెంట్స్
అంటగట్టి, గంటకొట్టింది
పేట్రియార్కీ పెత్తనమే.
ఆడపిల్లలను అంగట్లమ్మి తక్కెట్ల జోకనీకి
యేసీ యెనట్లేసి సాపలను
ఎండబెట్టినట్టు, యేడా గింత
కండ కానరాకుంట ఎండబెట్టి
పారం కోళ్లోలే పడతుల
తనువుల్ని తాకట్టు పెట్టే యాపార
సోపాన సామ్రాజ్యాలకు,
కార్పోరేట్ కాస్మెటిక్స్‌ల
కరిగిచ్చి కమిరిచ్చి మరిగిచ్చి
కొలతల కొలిమిల్లో
కోతలు పడే ఫాన్సీ ప్లాస్టిక్
అంద సందాల విందులకు,
మహిళా మాంసం కొట్టులు బెట్టి
సరుకు సౌదలు అమ్ముకునే సంతలకు,
స్పాల, సర్జరీల, సూదులు గుచ్చి
మాలిష్‌ల మర్దనల్ల
లైపోసక్షండ్ల పిక్సింగ్‌ల కుదిచ్చి కుదిలింపుల్ల
కుదబడ్డ హంసలను హింసల బెట్టే
మల్టీ కంపెనీ అంగడి గద్దలకు
గీ మట్టికాళ్ళ మైసమ్మల గడ్డమీదనే
గద్దేసి అందాల మీద కాసే పందాల పండుగైంది.
మా కళల కాంతుల్ని కండ్లకద్దుకొని,
నాగరిక వైభవ వారసత్వ సంపదను
సంకనేసుకొనేదంతా,
గీ గడ్డ మీది వనరుల్ని
బైటి దేశాల పెట్టుబడి
పెయిని నింపుకొని పెంపు జేస్కోనీకే.
రామప్ప రాగిణీ సరాగాల సంగతుల్ని
సముద్రాల్ని సవ్వాల్ జేసే సెరువు బరువుల్ని
సెరిగి పోని సేనేత పోత సెంగావి హంగుల్ని
నెత్తురు చుక్క నేలరాలని విప్లవం విరాజిల్లిన
బౌద్ధ ఆనవాళ్లను అద్దుకున్న
బుద్ధవనాన్నీ ముద్దాడబోయే బ్యూటీలూ
మీ రూరల్ టూరిజం దారుల, హెరిటేజ్ వాక్‌ల
ఎదురయ్యే ఉపాధి పనులను
ఉప్పుసకన్నా సూడుండ్రి
తట్ట తలకెత్తుకోకున్నా
నీడ లేని కాడ నిమిషం నిలుసోండ్రి
ముక్కులు మూసుకోకుంట
మున్సిపాల్టీ మురుగు సెత్తకాడ
సీపురు సేత బట్టుండ్రి...
మిలమిలలన్నీ మలమల మాడ్తయి.
గీడ ఆడోల్ల అందాలంటే,
తంగేడు, గునుగులు,
తీరుగోరంటల నూరొక్క తియ్యటి పదాల
సెమట సెరువు సెంపల బత్కమ్మ పాట.
మన్ను వాసనల
బొడ్డాడని బోనంకొండ ఆట.
గీడ యింకా
మట్టితనాలు మాసిపోలే
యెట్టితనాలు యెలిసిపోలే
తెల్లారని తెలంగాణ తెప్ప
వచ్చే వచ్చే పాయె పాయె.
పూదు కాలింది లేదు, పప్పుడికింది లేదు
శిశిరాలు శిథిలమ్ కాలే.
అంతా, ధోకా, దగా.
దోఖా దొర్లిపోలే
దగా దాగిపోలే
మోసపోయిన మొకమ్మీద
గీ మిస్ వరల్డ్ అహో మహోదయాలు.
బందూకులు బరిసెలు
ఎక్కుబెట్టి నిలబడి కలెబడే అందం,
కొంగు నడుముకు సుట్టి కొడువండ్లు బట్టి
సుక్కల్ని తెంపి కొప్పున ముడిసిన
తాటి ముంజల తీపులు
యీ గడ్డమీది ఆడబిడ్డలు.
మాకు సందమామను
అందుకొనే సదువుల సక్కదనాలు,
ఉద్యోగాలు, పూల్లేలే ఉగాదులు,
భూమి జాగల మీద,
ఇండ్లు వాకిండ్ల మీద మా పేర్లకు
పెద్దిర్కాల జెండాలు,
ఆకాశమంత ఆత్మగౌరవ రాజ్యాలు,
కులాలు కూలిపోయే
మతాలు మట్టయే
అందాల బందాలు,
దాడులు, దండనలు, హత్యాచారాలు, ఔమానాలు
తొంగి సూడని తొవ్వల
ఆడిపాడే వెన్నెల అందాలు,
ఖగార్‌లను ఖలాస్ జేసే
ఆకు బట్టిన అడివి అందాలు,
పొరుగు దేశాల్ని పచ్చినెత్తుటి ముద్దను జేసే
యుద్ధాలను పొలిమేర్లకు తరిమే
పొద్దుల అందాలు కావాలే.
మల్టీ కంపినీ మార్కెట్‌లూ,
మిస్ వరల్డ్ వనితలూ,
గీ మా అందాలన్నీటిని దునియంతా
దున్నిపోయుండ్రి
లేకుంటే,
గీ మీ పోటీల ఖేల్ ఖతం, దుకునమ్ బందు.

■ జూపాక సుభద్ర

'సుమతీ శతకం'లో చేరని పద్యాలు

ఇప్పుడు మనకి దొరికే 'సుమతీశతకం' పుస్తకం లోని 100 లేక 107 పద్యాలను పంతొమ్మిదవ శతాబ్దం పూర్వార్ధంలో నాటి పండితులు తాళపత్రాలలో దొరికిన 150 పైచిలుకు పద్యాలలోంచి ఏరి ఒకచోట కూర్చారు. ఇందులో చేరని పద్యాలు కొన్ని ఇప్పటికీ ఆ తాళపత్ర గ్రంథాలలోనే ఉండిపోయాయి. చెన్నైలోని 'ప్రభుత్వ ప్రాచ్య లిఖిత భాండాగారం'లో 'సుమతీశతకం' పూర్వ ప్రతులు మూడు ఉన్నాయి. వాటిల్లో ఒకటి తాళపత్ర ప్రతి. మిగతావి రెండు రాత ప్రతులు. ఈ రెండు రాతప్రతులు సిపి బ్రౌన్ తయారు చేయించినవి. ఇందులోని ఒక ప్రతిలో 'సుమతీశతకం' పద్యాలకు బ్రౌను ఆంగ్లానువాదం కూడా ఉంది. రెండవది 'సుమతీశతకం' పద్యాల పద సూచి (word index).

ప్రమోదూత నామ సంవత్సరం, ఫాల్గుణమాసం, బహుళ పంచమీ శుక్రవారం వరకు కరుటూరి అచ్చన రాయడం పూర్తి చేసిన తాళపత్ర ప్రతిలో 115 పద్యాలు ఉన్నాయి (ప్రమోదూత సంవత్సరాలు మనకు 1990–91, 1930–31, 1870–71, 1810–11, 1750–51... ఇలా వచ్చాయి. వాటిల్లో ఫాల్గుణమాసం, బహుళ పంచమి శుక్రవారానికి 1811 ఫిబ్రవరి 15వ తేదీ సరిపోతుంది). బ్రౌను తయారు చేయించిన 'సుమతీశతకం' రాత ప్రతికి ఆధారమైన మూల ప్రతి ఏదో తెలియదు. బ్రౌను 'సుమతీశతకం' రాత ప్రతిలో 150 పద్యాలు ఉన్నాయి. ఈ రెండు ప్రతులలోని పద్యాలను పోల్చి చూసుకుంటే బ్రౌను రాతప్రతిలో లేని పద్యాలు కొన్ని అచ్చన రాసిన తాళపత్ర ప్రతిలో ఉన్నాయి. అలాగే అచ్చన తాళపత్ర ప్రతిలో లేని పద్యాలు కొన్ని బ్రౌను రాతప్రతిలో ఉన్నాయి. అయితే, ప్రస్తుతానికి బ్రౌను తయారు చేయించిన 'సుమతీ శతకం' రాత ప్రతిలో లేకుండా, కరుటూరి అచ్చన 1811 ఫిబ్రవరిలో రాసిన తాళపత్ర ప్రతిలో ఉన్న పద్యాలను ఎంచి చూపించడం ముఖ్యమని నాకు అనిపించింది. కారణం– ఆ పద్యాలు ఇప్పటి దాకా ఆ తాళపత్ర ప్రతిలోనే ఉండిపోయాయి. ఆ పద్యాల్లో కూడా కొన్ని పద్యాలు పరిష్కరణకు వీలుకాకుండా ఉన్నాయి. కారణం ఏమిటంటే, తాళపత్ర ప్రతిలో రెండు పత్రాలు పద్యం అంతమయ్యే వైపు మూలల్లో పురుగుపట్టి, పద్యంలో చివరి పాదం మూడు వంతులు కనపడకుండా అయిపోయాయి. అలా కొన్ని పద్యాలు పోగా, పూర్తిగా కొత్తవైన పది పద్యాలను స్వల్ప భావ వివరణతో ఇక్కడ ఇస్తున్నాను. ప్రతి పద్యం నాల్గవపాదం చివరన బ్రాకెట్లలో ఉన్నది తాళపత్ర ప్రతిలోని పద్య సంఖ్య.



కం. భూమీశు చిత్త మెరుగక
ప్రేమముతో మనవి జెప్ప బెడగుట లెల్లం
పాముకు వాకట్టెరుగక
సాముని చెయిచాచినట్టి చందము సుమతీ! (104)

'వాకట్టు' అంటే పాము విషానికి విరుగుడైన 'వాకట్టువేరు'. రాజు సంతోష చిత్తుడై ఉన్నాడో లేదో గ్రహించకుండా ఉల్లాస పరిచే సంగతులు చెబుతూ మధ్యలో తన కోరికను వెళ్ళబుచ్చడం ఎలాంటిదంటే– ఆ వాకట్టువేరు దగ్గర లేకుండా పాము ముందు సాహసంతో చేయి చాచడం వంటిది, అని భావం.

కం. తప్పునకు తగిన దండన
యప్పుడు శాయంగవలయు నవనీశుకున్
నిప్పనసుచీర జుట్టిన
యాపగిదిని శాయవలయు నారను సుమతీ! (112)

కట్టుకున్న చీరకు నిప్పు అంటుకుంటే ఆర్పడానికి ఎంత తొందరగా పూనుకుంటామో, అంతే తొందరను తప్పు చేసిన వ్యక్తిని దండించడంలోనూ చూపించాలి అని భావం.

కం. నగజాతకు హరుమేనను
సగబాలిప్పించె మరుడు; చచ్చిన పిదపన్
పగసాధింపని మనుజుడు
మగవాడా మగువగాక
మహిలో సుమతీ! (105)

శివపార్వతులకు జన్మించిన పుత్రుడి వలనే తారకాసురుడి బాధ తొలగుతుందని తెలిసిన ఇంద్రుడు, మన్మథుడిని శివపార్వతుల వద్దకు పంపాడు. కఠోర తపస్సులో ఉన్న శివుడు మూడవకన్ను తెరిస్తే మన్మథుడు భస్మం అయ్యాడు. చివరకు పార్వతి అభ్యర్థనతో మన్మథుడు అనంగుడవగా, పార్వతి శివుడిని చేరింది. వారి పుత్రుడు కుమారస్వామి తారకాసురుడి బాధను తొలగించాడు. ఈ కథ ఆధారంగా– మన్మథుడు మరణించి అనంగుడైనప్పటికీ పార్వతిని శివుడిలో సగ భాగం చేసి తన పగ తీర్చుకున్నాడు కదా! అని ఈ పద్యం చమత్కరిస్తుంది. మరణించినప్పటికీ పగసాధించడమే పురుష లక్షణం అని ఇందులో భావం.

కం. అరమాడజీతమైనను
ధరణీశుడు తగవరైన దగ్గిరవచ్చున్
సురరాజ్యమిచ్చె నేనియు
తరమెరుగని రాజు కొల్వు తగదుర సుమతీ! (107)

'తగవరి' అంటే రాజ్యపాలనలో తగినంత సమర్థత కనబరిచే వాడు అని అర్థం. 'దగ్గిరవచ్చున్' అనగా సమీపించవచ్చు, ఆ రాజు కొలువులో చేరవచ్చు అనే అర్థంలో ఉపయోగించబడింది. జీతం అత్యల్పమైనప్పటికీ సమర్థుడైన ప్రభువు కొలువులో పని చేయవచ్చు. కానీ తన అధీనంలోని ఒక రాజ్యానికి రాజును చేస్తాను అన్నప్పటికీ, 'తరమెరుగని' రాజు – సమర్థత లేని రాజు కొలువులో ఉద్యోగం పనికి రాదు అని భావం.

కం. యెడ్డెడు సతివలపెరుగని
జడ్డలబడి తిరుగువాడు జాణుండగునా
యడ్డముదిడ్డము దిరిగితె
తెడ్డెరుగునె పాలతీపి తెలియర సుమతీ! (106)

రాత సరిగా లేక చదవడానికి కష్టంగా ఉన్న పద్యాలు పది వరకూ ఈ తాళపత్ర ప్రతిలో ఉన్నాయి. అటువంటి పద్యాలలో ఇది ఒకటి. రాతలో మూడవ పాదంలో అక్షరాలు 'యడ్డముడిగటము దిరిగితె' అని ఉన్నాయి. పద్యం భావానికి సరిపోయేట్లుగా మూడో పాదం సవరించి రాయబడింది. సరసత తెలియని వ్యక్తులతో చేసే స్నేహం వలన ఇంట్లోని భార్య పిల్లలకు కష్టమే కలుగుతుంది తప్ప ప్రయోజనం ఉండదని చెప్పడం ఇందులో భావం.

కం. చెపలత లాభము చెరుచును
నెపమున పగవారి గూడి నేరము లెంచున్
అపవాదించును నమ్మిక
కపటాత్మునితోడి పొందు కాదుర సుమతీ! (91)

సుమతీశతకంలోని పద్యాల ముద్ర పూర్తిగా ఉన్న పద్యాలలో ఇది ఒకటి. మూడవ పాదంలో 'ఆపలాచించ్చును నంమ్మిక' అని రాతలో అక్షరాలను బట్టి 'నమ్మకం అతిగా వాదించేలా చేస్తుంది' అన్న భావం గ్రహించి, దానికి దగ్గరగా సరిచేయబడింది.

కం. పగవాడు తనకు జిక్కిన
పగచంపుట మేలు చేసి పంపుట ధరలో
పగవానికదియె చంపుట
తగువానికి అదియె నీతి తథ్యము సుమతీ! (52)

శత్రువు నిస్సహాయుడై చిక్కిన తరువాత కూడా అతడిని పగవానిగా చూడడం మానవత్వంతో కూడుకున్న పని కాదని, కరుణించి వదిలి వేయడమే సరైనది అని ఇందులో భావం.

కం. కుటిలాత్ముని నొనగూడకు
పటువై సభలోన వెడల బల్కకు మతి దు
ర్ఘటమగు కార్యము శాయకు
నిటలాక్షుని మీద భక్తి నిల్పుము సుమతీ! (57)

కుటిలస్వభావుడైన వ్యక్తితో స్నేహం చేయడం, సభలో అందరి ఎదుట అవసరాన్ని మించిన గొప్పదనపు మాటలను మాట్లాడడం, నలుగురికి హాని చేసే పనులను చేయడం వంటివి తగని పనులని, నిటలాక్షుడైన శివుడిని నిరతం ధ్యానించడం శ్రేయస్సును కలుగజేస్తుందని చెబుతుంది పై పద్యం.

కం. కనరానిది పరతత్వము
వినరానిది గురువు నింద, వినికనియైనన్
అనరానిది పరుషత్వము
మనరాదవివేకి తోడ మతమురు సుమతీ! (73)

మనిషి చూపు దైవత్వానికి సంబంధించిన సంగతులను చూడలేదు. అలాగే సత్పురుషుడు గురువును చేసే నిందను వినలేదు. ఒకరిని గురించి చెడుగా విన్నప్పటికీ, చూసినప్పటికీ కూడా పరుషంగా మాట్లాడకూడదు. అలాగే, అవివేకితో స్నేహం ఎక్కువ కాలం కొనసాగించకూడదు అని భావం.

కం. తెరవున యేనుగు పొడగని
మొరయించుకు వెర్రిగండు మొరగిన భంగిన్
దొర నల్పుడెరుగ కాడిన
సరిసేయగ వలదు వాని సహజము సుమతీ! (74)

ఏనుగు దారిలో నడుస్తున్నప్పుడు అల్ప జంతువులు భయంతోనూ, ఆశ్చర్యంతోనూ అనవసరమైన ఆర్భాటం చేసి అభాసుపాలైనట్లుగా, అల్పుడైన వ్యక్తి విజ్ఞత కోల్పోయి మాటాడే మాటలను గురించి ఉత్తముడైన వ్యక్తి పట్టించుకోనవసరం లేదని, ఒకవేళ సరిచేసే ప్రయత్నం చేస్తే, ఆ ప్రయత్నం వలన కూడా ప్రయోజనం ఉండదని భావం.

■ భట్టు వెంకటరావు

ఉద్యమంతో కలిసి నడిచే 'జూలూరు పథం'

తెలుగు సాహిత్య రంగంలో ముఖ్యంగా తెలంగాణ సాహిత్య రంగంలో వెలుడిన దీర్ఘ కావ్యాల చరిత్ర కూడ సుదీర్ఘమైందే. 1930లలో సురవరం నుంచి మొదలుపెడితే కాళోజీ, సినారె, కవిరాజమూర్తి, చెరబండరాజు, వరవరరావు, ఎన్కే, గద్దర్, సిధారెడ్డి వరకు ఈ పరంపర సుదీర్ఘం. 1980లలో మినీకవిత పేరుతో కోస్తా కేంద్రంగా రూపవాదం తెలుగు సాహిత్య రంగాన్ని చుట్టుముట్టినప్పుడు దానిని తిరస్కరిస్తూ తెలంగాణ కేంద్రంగా విప్లవసాహిత్యంలో భాగంగా వరవరరావు 'సముద్రం', ఎన్కే 'లాల్ బనో గులామి చోడో', నందిని సిధారెడ్డి 'పదఘటన ప్రతిఘటన' వంటి దీర్ఘ కావ్యాలు రాసి దానిని తిరస్కరించారు. ఈ ప్రతిఘటన క్రమంలో తెలంగాణ నుంచి దీర్ఘకావ్యాలు వెలువడుతూనే వచ్చాయి.

ఈ క్రమంలో వెలువడిన దీర్ఘకవిత 'జూలూరు పథం'. ఈ కవిత నిడివి 230 పేజీలు. దీర్ఘకవిత అని కవి భావిస్తున్నా ఇది కావ్యమే. ఆ లక్షణాలు ఉన్నాయి. ఈ కావ్యరచన చేసిన కవి జూలూరు గౌరీశంకర్. ఈ కావ్యం ఇతివృత్తం మలిదశ తెలంగాణ రాష్ట్ర ఉద్యమం. ఇది జూలూరు పథం మాత్రమే కాదు, వందేళ్ళ తెలంగాణ రాజకీయ, సామాజిక, సాంస్కృతిక ప్రస్థానం కూడా. సారాంశంలో చెప్పాలంటే ఇది తెలంగాణ ఆత్మకు అక్షరరూపం. అక్కడక్కడ ఉద్వేగం, ఆలోచనతోపాటు ఆధిపత్యం, దోపిడీలపై ధిక్కారం సమ్మిళితమై వెలువడిన కావ్యమిది. ఈ తరహా కావ్యాలు రాయడానికి బలమైన సామాజిక, రాజకీయ సందర్భం ఉండాలి. రాయపూనుకున్న కవికి సరైన రాజకీయ దృక్పథం ఉంటే ఆ కావ్యం పాఠకులకు చేరుతుంది. దీనిని కాళోజి కావ్యాలలో చూడవచ్చు. 'జూలూరు పథం' కావ్యానికి కూడ ఇది ఉన్నది.

తెలంగాణ సాంస్కృతిక రంగ యోధులు– సురవరం, చందాల కేశవదాసు, సుద్దాల హనుమంతు, దాశరథి, వట్టికోట ఆళ్వారుస్వామి, తెలంగాణ సాయుధ పోరాటంపై చిత్రాలు వేసిన చిత్ర ప్రసాద్‌లు ఈ కావ్యంలో పాఠకులకు తారసపడతారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి ఊపిరిని ఊదిన జయశంకర్‌పై ప్రత్యేకమైన అధ్యాయమే ఉన్నది. భిన్న భావ జాలాలకు చెందిన రాజకీయ బృందాలు ఒకే వేదిక పైకి వచ్చి తెలంగాణ రాష్ట్ర సిద్ధికి ఉద్యమించడాన్ని గుర్తించడం ద్వారా కవి స్థానికంగా ఉన్న ప్రజాస్వామిక విలువలకు పట్టం కట్టాడు. చరిత్ర గతిలో తెలంగాణ పొదివి పట్టుకున్న బహుళ సంస్కృతుల స్వభావాన్ని వివరించాడు. శతాబ్దాలుగా తెలంగాణ పోరాటాల ప్రస్థానాన్ని చెబుతూ పాలస్తీనా, క్యూబాలతో పోల్చి అంతర్జాతీయతను ప్రతిపాదిస్తాడు. హైదరాబాద్ సహజీవన సంస్కృతిని విపులంగా చర్చించాడు.

సమీప కాలానిదే అయినా తెలంగాణ గత చరిత్రను అనుసంధానించడం వల్ల 'జూలూరు పథం' దీర్ఘ కావ్యం ఇతిహాస లక్షణాలను సంతరించుకున్నది. ఆంధ్ర మహాసభ, సురవరం ప్రస్తావనలతో పాటు తెలంగాణ సాయుధ పోరాటం, 1969 తెలంగాణ తిరుగుబాటు, జగిత్యాల జైత్రయాత్రను చాటుతూ తెలంగాణ రాష్ట్ర ఉద్యమ విస్తృతిని, న్యాయబద్ధతను విశ్లేషించాడు కవి. ఇవి కవికి ఉన్న చారిత్రక దృష్టిని పట్టి చూపుతాయి. అన్యాయంపై తెలంగాణ సమాజానికి ఉన్న తిరుగుబాటును, పోరాట స్వభావాన్ని పట్టుకోవడంలో ఈ కావ్యం సఫలమైంది. ఇంతేగాక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో తారసిల్లిన ప్రతిమలుపును వ్యక్తీకరించడం ఈ కావ్యం ప్రత్యేకత. ఈ తరహా వైఖరి కాళోజి కవిత్వంలో కనిపిస్తుంది. మొత్తంగా చూస్తే ఈ కావ్యం ప్రత్యేకత– స్థానికత, జాతీయత, అంతర్జాతీయత వ్యక్తం కావడం.

జూలూరు ఈ కావ్యం వెలువరించడానికి నేపథ్యం ఆయన పుట్టి పెరిగిన ఊరు నడిగూడెం. ఇది మునగాల సంస్థానానికి రాజధాని కేంద్రం. తెలంగాణ సాయుధ పోరాటానికి అండగా నిలిచిన ప్రాంతమిది. 1969 ఉద్యమం కూడ ఇక్కడ పెద్ద ఎత్తున జరిగింది. ఇటు తెలంగాణ అటు ఆంధ్ర ప్రాంతాల ఆధునిక వికాసానికి పూనుకున్న ప్రజాస్వామికవాది, స్వయంగా రచయిత అయిన నాయని వెంకట రంగారావు ఈ సంస్థానాధీశుడే. హైదరాబాద్ నగరంలో శ్రీకృష్ణదేవరాయ నిలయం, తెలుగు వారి ఆధునిక వికాసానికి ఎంతగానో కృషి చేసిన విజ్ఞాన చంద్రికా గ్రంథ మండలుల స్థాపనలో ప్రముఖ పాత్ర ఆయనదే. ఈ నడిగూడెం పక్కన ఉన్న రేపాల గ్రామం తెలంగాణ నాటకరంగానికి చేసిన సేవ ఎంతో ఉన్నతమైంది. ఈ వాతావరణంలో పుట్టిన గౌరీశంకర్ అక్షరాలతో ఆడుకుని దీర్ఘ కవితా పథాన్ని రాజేయడంలో ఆశ్చర్యమేమీ లేదు. మూడు కవితా ఉద్యమాలలో కీలక పాత్ర వహించిన కవి గౌరీ శంకర్. ఆ మూడు ఉద్యమాలలో ఒకటి దళిత కవితా ఉద్యమం. ఆయన తొలికావ్యం 'పాద ముద్ర' ఈ ఉద్యమ ఆరంభంలోనే వెలువడింది. రెండవది– బహుజన కవితా ఉద్యమం. ఈ ఉద్యమ ఆరంభంలో వెలువడిన కావ్యం 'వెనుక బడిన కులాలు, వెంటాడే కలాలు'. మూడవది తెలంగాణ కవితా ఉద్యమం. ఈ ఉద్యమం ఆరంభంలో వెలువరించిన సంకలనం 'పొక్కిలి'. మొత్తం 15 దీర్ఘ కావ్యాలు, మూడు వచన కవితా సంపుటాలు వెలువరించి 'పొక్కిలి' తెలంగాణ ఉద్యమ కవితా సంకలనానికి సంపాదకత్వం వహించాడు. ఇప్పుడు 'జూలూరి పథం' ఆయన 16వ దీర్ఘ కావ్యం. కాళోజి వలే తెలంగాణ రాష్ట్ర ఉద్యమం తిరిగిన ప్రతి మలుపును కవిత్వీకరించడం ఈ కావ్యంలో కనిపిస్తుంది. తనను కదిలించిన ఏ దుస్సంఘటనకైనా, అన్యాయానికైనా వెంటనే స్పందించి రాయడం కాళోజీ విధానం; గౌరీ శంకర్ కూడ అంతే. కాళోజీ మొత్తం కవితా రచనను అధ్యయనం చేస్తే తెలంగాణ సామాజిక చరిత్రను నిర్మించవచ్చు. మొత్తంగా చూస్తే గౌరీశంకర్ కూడ అంతే. 1991 నుంచి ప్రతి రాజకీయ, సామాజిక సందర్భంపైనా దీర్ఘకావ్యం వెవలువరించాడు. ఈ నేపథ్యంలో చూస్తే ఈ కవి కాళోజికి అచ్చమైన వారసుడని చెప్పక తప్పదు.

సమీప కాలానిదే అయినా తెలంగాణ గత చరిత్రను అనుసంధానించడం వల్ల 'జూలూరు పథం' దీర్ఘ కావ్యం ఇతిహాస లక్షణాలను సంతరించుకున్నది. అన్యాయంపై తెలంగాణ సమాజానికి ఉన్న తిరుగుబాటును, పోరాట స్వభావాన్ని పట్టుకోవడంలో ఈ కావ్యం సఫలమైంది. ఇంతేగాక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో తారసిల్లిన ప్రతిమలుపును వ్యక్తీకరించడం ఈ కావ్యం ప్రత్యేకత.



■ సామిడి జగన్ రెడ్డి
✆ 85006 32551

రక్తం చుక్కల పొద్దు



హిమ హితులారా మీదొక పెదవి
మాదొక పెదవి విప్పి
శాంతిని గురించి మాట్లాడుదాం

రాజ్యం ఆయుధం పట్టుకొనే శాంతి అంటున్నది
అయినా సరే మనం కన్నీళ్ల దోసిట్లో పట్టుకొని మాట్లాడుదాం

రక్తం చుక్కల పొద్దును ఎవరు కోరుకుంటారు
యత్రికులైన, వ్యాపారులైన
సుందరమైన మధ్యాహ్నం కొండచరియ విరిగినట్టు
మనుషులు శవాలై రాలుతారని ఎవరు ఊహించగలరు
దుఃఖం ఎవరిదైనా దుఃఖమే
చంపిన చేతుల వెనక కుట్రను పసిగట్టి నిలదీయాల్సిందే

జీలంతో ముడిపడ్డ జీవితాలు
రోజూ చెమట చుక్కల నిశ్శబ్దాన్ని ప్రేమిస్తాయి
తూటాల శబ్దాన్ని కాదు

ఒరిగిన దేహాల సాక్షిగా మనమందరం
నిర్లిప్త మానవ రూపాలమై సంచరిస్తున్నందుకు
సిగ్గుపడుతూనే
ఆ మట్టిపొరల్లో దాక్కున్న పురా దుఃఖాన్ని
విందామా ఇప్పుడైనా

కరగడం బాగా తెలిసిన నేల అది
కన్నీటిని దేవదారు బెరళ్లకింద దాచి
నవ్వుతున్నట్టు కొమ్మల్ని కదుపుతున్నది
చూడండి

నదంత సృజనశీలి ఉందా ఈ ప్రపంచం మీద
పారే రక్తం ఎవరిదైనా రెండు చేతులతో
దశాబ్దాలుగా శుభ్రపరుస్తూనే ఉన్నది
శవాలని భుజంమీద మోస్తూనే ఉన్నది

ఆరిపోయిన వెలుతుర్లో
శవాలైన జంటలు కుంకుంపువ్వు రహస్యాల్ని
విప్పిచెబుతున్నాయి
కొంచెం చెవుల్ని తడిచేసుకొని విందాం

■ వేముగంటి మురళి

లైఫ్ డ్రామా', 'భూమి నవ్వడం చూశాను' ఆవిష్కరణ

రాధకృష్ణ కర్రి 'లైఫ్ డ్రామా', అమూల్య చందు 'భూమి నవ్వడం చూశాను' కవితా సంపుటాల ఆవిష్కరణ మే 11 ఉ.10 గంటలకు విజయవాడలోని ఎంబీవీకే బాలోత్సవ్ భవన్‌లో జరుగుతాయి. ఆవిష్కర్త నగ్నముని. సభలో వసీరా, శాంతిశ్రీ, వాణిశ్రీ, సుధామురళి మాట్లాడతారు.

లలిత పబ్లికేషన్స్

రెండుతరాల కవిసంగమం

రెండు తరాల కవి సంగమం, సీజన్ 2, సిరీస్ 40 కార్యక్రమం మే 10, సా.6గంటలకు సౌజన్య వేదిక, నిజాం కాలేజి ప్రాంగణం, బషీర్ బాగ్, హైదరాబాద్‌లో జరుగుతుంది. పాల్గొను కవులు: ప్రసేన్, చిగురాల్ పల్లి ప్రసాద్, కల్యాణి కుంజ, బాలు అగ్నివేష్, మేనావత్ రఘు (నిజాం కాలేజి విద్యార్థి).

కవిసంగమం

పీచర సునీతారావు పురస్కారాలు

పీచర సునీతారావు చతుర్థ వార్షిక పురస్కారాల కోసం కవిత్వంలో తండా హరీశ్ గౌడ్ ('గాలి లేని చోట'); విమర్శలో ఎం. దేవేంద్ర ('తెలంగాణ కథ వర్తమాన జీవన చిత్రణ'); కథా విభాగంలో పిన్నంశెట్టి కిషన్ ('లేంబాళ వాటిక కథలు'), జడా సుబ్బారావు ('మంచు కింద ఉక్క పోత') ఎంపిక అయ్యారు. పురస్కార ప్రదానం మే 10 ఉ.10గంటలకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది.

కాంచనపల్లి గోవర్ధన్ రాజు

'కవితాదర్పణం', 'సీతాశతకం' ఆవిష్కరణ

దర్పణం సాహిత్య వేదిక నిర్వహణలో చీదెళ్ళ సీతాలక్ష్మి రచించిన 'కవితాదర్పణం', శంకర నారాయణ రచించిన 'సీతాశతకం' గ్రంథాల ఆవిష్కరణ సభ మే 5 సా.5.30 ని.లకు రవీంద్రభారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. అధ్యక్షత రాయారావు సూర్యప్రకాశ్ రావు, ముఖ్య అతిథి ఏనుగు నరసింహారెడ్డి. దాస్యం సేనాధిపతి, మామిడి హరికృష్ణ, నామోజు బాలాచారి, రామకృష్ణ చంద్రమౌళి తదితరులు పాల్గొంటారు.

రాయారావు సూర్యప్రకాశ్ రావు



డీలర్లకు కుచ్చుటోపీ

రేషన్ షాపులకు 3కిలోల తక్కువతో బస్తాల సరఫరా

- మిల్లర్లు, గోదాముల నిర్వాహకుల మాయాజాలం
- నెలకు రూ.70 లక్షలకు పైగా దోపిడీపర్వం
- అక్రమార్కులకు వరంగా మారిన సన్న బియ్యం
- అన్నీ తెలిసి ఏమీ ఎరుగనట్లు అధికారుల తనిఖీలు
- లబ్దిదారులకు సరఫరా చేయడంలో డీలర్ల అగచాట్లు

హనుమకొండ సిటీ, మే 4(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం తూకంలో గోల్‌మాల్ జరుగుతోంది. తక్కువ బియ్యంతో రేషన్ షాపులకు బియ్యం సరఫరా అవుతున్నాయి. ఈ అక్రమాల్లో మిలర్ల నుంచి గోదాము ఇన్‌చార్జిల వరకు భాగస్వామ్యం ఉంది. అప్పనంగా బియ్యాన్ని బుక్కేస్తూ నెలకు రూ.70 లక్షలకు పైగానే అక్రమార్కులు స్వాహా చేస్తున్నారు. విచిత్రమేమింటే.. కొందరు స్వాహా అధికారులే ఏమీ ఎరుగనట్లు రేషన్ షాపులపై తనిఖీలు చేస్తూ బస్తాల్లో బియ్యం తక్కువపై డీలర్లనే బాధ్యతలను చేసే కుట్రలు చేస్తున్నారు. ఈ తరహాలో కూడా డీలర్ల నుంచి డబ్బులు లాగుతున్నారు. కేసులు లేకుండా చూస్తామంటూ మోసగిస్తున్నారు.

వరంగా మారిన సన్న బియ్యం

దొడ్డు బియ్యం సరఫరా సమయంలోనూ ఇదే దోపిడీ జరిగింది. ప్రభుత్వం ఇప్పుడుసన్న బియ్యం సరఫరా చేస్తుండడం అక్రమదారులకు మరింత వరంగా మారింది. సన్నబియ్యం మార్కెట్లో రూ.5 వేలవరకు ధర పలుకుతోంది. ఈ క్రమంలో దోపిడీ దారుల దందాకు కూడా డిమాండ్ పెరిగింది.

రూ.70లక్షల వరకు అక్రమ సంపాదన

జిల్లాలో 424 రేషన్ షాపులు ఉన్నాయి. ఒక్కో షాపునకు సమారుగా 100క్వింటాళ్ల బియ్యం సరఫరా అవుతున్నాయి. ఇలా ఒక్కో బస్తా నుంచి 2 నుంచి 3కిలోలు స్వాహా చేస్తే సుమారుగా 1,272 క్వింటాళ్ల బియ్యంస్వాహాఅవుతోంది. సన్న బియ్యం ధర డిమాండ్ మేరకు రూ.70 లక్షలకు పైగానే దోపిడీదారులు అడ్డదారిలో కాజేస్తున్నారు.

మిల్లర్లు, అధికారుల కుమ్మక్కు

అక్రమ దందాలో మిల్లర్లు నుంచి గోదాముల ఇన్‌చార్జ్‌ల వరకు భాగస్వాములవుతున్నారు. మిలర్ల నుంచి బియ్యం బస్తాలు తక్కువ తూకంతో రావడం, గోదాము ఇన్‌చార్జ్‌లు చూసీచూడనట్లు వ్యవహరించడం, దొంగ తూకం బిల్లుల సృష్టించి రేషన్ షాపులకు లారీల్లో బస్తాలను సరఫరా చేస్తున్నారు. ఇలా మిలర్ల నుంచి పౌర సరఫరాల శాఖ అధికారుల వరకు దోపిడీ సొమ్ము వాటాలు అందుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.

ఏమీ ఎరుగనట్లు తనిఖీలు

బియ్యం స్వాహాదారులే రేషన్ షాపులపై తనిఖీలు చేస్తున్నారు. బస్తాలు తూకం తక్కువగా ఉందంటూ ఏమి ఎరుగనట్లు ప్రశ్నిస్తున్నారు. ఈ రకంగా కూడా బెదిరింపులకు గురిచేసి డీలర్ల నుంచి కొందరు అధికారులు పుచ్చుకుంటున్నారు.

డీలర్ల బెంబేలు

బియ్యం తక్కువగా రావడంతో డీలర్లు బెంబేలెత్తుతున్నారు. లబ్ధిదారుల నుంచి సమస్యలు ఎదుర్కొంటున్నారు. అధికారులను ప్రశ్నించే ధైర్యం లేదు. ఫిర్యాదు చేస్తే ఏదో రకంగా వేధింపులు. బస్తాకు రెండు నుంచి మూడు కిలోలు తక్కువగా రావడం డీలర్లకు ఇబ్బందిగా పరిణమించింది. వంద క్వింటాళ్ల డిమాండ్ ఉంటే బస్తాకు మూడు కిలోలు తక్కువగా వస్తుంటే మొత్తంగా సుమారు మూడు బస్తాల బియ్యం తక్కువగా డీలర్లు భరించాల్సి వస్తోంది.

3కిలోల తక్కువతో..

ప్రభుత్వం రేషన్ షాపులకు సరఫరా చేస్తున్న సన్న బియ్యం బస్తాలు 50 కిలోలుగా రావడం లేదు. బస్తా తూకం 500 గ్రాములు. 50 కిలోలతో బియ్యం బస్తా ఉంటోంది. ఈ లెక్కన బస్తా తూకంతో కలిపి మొత్తంగా రూ.50.500 కిలోలు ఉండాలి. కానీ బస్తాకు 2 నుంచి 3 కిలోల వరకు తక్కువగా సరఫరా బియ్యం సరఫరా అవుతున్నాయి.



అమ్మవారి సన్నిధిలో పూజలు నిర్వహిస్తున్న మాజీ స్పీకర్, ఎమ్మెల్సీలు, విశ్వ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

శేష వాహనంపై ఊరేగిన అమ్మవారు

- ఆరో రోజుకు చేరిన కల్యాణ బ్రహ్మోత్సవాలు
- ఉభయదాత సేవలో విశ్వ బ్రాహ్మణులు

వరంగల్ కల్చరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): చారిత్రక ఓరుగల్లు నగరంలో కొలువుదీరిన భద్రకాళి అమ్మవారి కల్యాణ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం ఆరోరోజు ఉదయం 4 గంటలకు అమ్మవారికి నిత్య పూజ, అర్చన, అభిషేకాలు, హోమాలు నిర్వహించిన అనంతరం విద్యారణ్య స్వామి జయంతి సందర్భంగా ప్రత్యేక పూజ చేశారు. విశ్వబ్రాహ్మణ సంఘం వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం శేష వాహనంపై అమ్మవారిని ఊరేగించారు. విద్యారణ్యస్వామి జయంతిని పురస్కరించుకొని అమ్మవారి ఆర్చి వద్ద విద్యారణ్య స్వామి విగ్రహానికి పూల మాలలు సమర్పించి ఉత్సవాలు ప్రారంభించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం, తెలంగాణ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృసంఘం ఆధ్వర్యంలో చేపట్టిన పూజా కార్యక్రమాల్లో మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్‌తో పాటు లాలుకోట వెంకటాచారి, రాగిఫణి రవీంద్రాచారి, చొల్లేటి కృష్ణమాచార్యులు, శశిధర్ శిల్పి, కొలాన రమేష్, పెండోట చక్రపాణి, కట్టా ఈశ్వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈవో శేషు భారతి, సూపరింటెండెంట్ అద్దంకి విజయ్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



శేష వాహనంపై ఊరేగుతున్న భద్రకాళి అమ్మవారు



ఆర్ట్స్ కళాశాల వద్ద అభ్యర్థుల సందడి



పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

ప్రశాంతంగా, పగడ్బందీగా నీట్

- 97.73 శాతం మంది అభ్యర్థులు హాజరు
- పరీక్షా కేంద్రాల వద్ద భారీ బందోబస్తు
- స్వయంగా పర్యవేక్షించిన కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ, మే 4 (ఆంధ్రజ్యోతి): వైద్యకళాశాలల్లో (ఎంబీబీఎస్, బీడీఎస్) ప్రవేశాల కోసం ఆదివారం హనుమకొండ, వరంగల్‌లో నిర్వహించిన జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష-2025 (నీట్) ప్రశాంతంగా జరిగింది. పరీక్ష నిర్వహణకు హనుమకొండలో 10, వరంగల్ జిల్లా కేంద్రంలో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ పదకొండు కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు మొత్తం 4,680 మందికిగాను 4,574 మంది (97.73 శాతం) హాజరయ్యారు. వివిధ కారణాలవల్ల 106 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. పరీక్షను అత్యంత పగడ్బందీగా నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగింది. దివ్యాంగులకు ఒక గంట అదనపు సమయం ఇచ్చారు. ఉదయం 11 గంటల నుంచే పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులను అనుమతించారు. మధ్యాహ్నం 1.30 గంట తర్వాత ఎట్టిపరిస్థితుల్లో ఎవరిని అనుమతించలేదు. విద్యార్థులతో పాటు ఆయా పరీక్షాకేంద్రాల బయట వారి తల్లిదండ్రులు పరీక్ష జరుగుతున్నంత సేపు ఉత్కంఠగా వేచిచూడడం, పరీక్ష పూర్తయిన తర్వాత పరీక్ష ఎలా రాసింది తమ పిల్లలను ఆతృతగా వాకబు చేయడం కనిపించింది.

కలెక్టర్ సందర్శన

హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య రెండు పరీక్షా కేంద్రాలను సందర్శించారు. కాజీపేట మండలం కడిపికొండ శివారులోని పీఎంశ్రీ కేంద్రియ విద్యాలయం, సుబేదారిలోని యూనివర్సిటీ పోస్టు గ్రాడ్యుయేట్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను సందర్శించి అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షా కేంద్రాలలో పరీక్ష జరుగుతున్న తీరును కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు బాలరాజు, నవీన్ కుమార్, ఇతర అధికారులతో పాటు పరీక్షా కేంద్రాల సూపరింటెంట్లతో మాట్లాడారు.

సందర్శించిన సీపీ

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నీట్ పరీక్ష కేంద్రాలను సీపీ ఆదివారం సందర్శించారు. ఆర్ట్స్ అండ్ సైన్స్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రాల వద్ద భద్రత ఏర్పాట్లతో పాటు అభ్యర్థులను తనిఖీ చేస్తున్న తీరును సీపీ పరిశీలించారు. సీపీ వెంట హనుమకొండ, వరంగల్ ట్రాఫిక్ ఏసీపీలు దేవేందర్‌రెడ్డి, సత్యనారాయణ, సీఐలు సత్యనారాయణరెడ్డి, రవికుమార్, నాగబాబు, మంగీలాల్ పాల్గొన్నారు.

ఉగ్రమూకలను కఠినంగా శిక్షించాలి

- బీజేపీ క్రమ శిక్షణ సంఘం రాష్ట్ర చైర్మన్ మార్తినేని ధర్మారావు
- హనుమకొండ అంబేద్కర్ విగ్రహం నుంచి అమరవీరుల స్థూపం వరకు కాగడాలతో ర్యాలీ

వడ్డెపల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి): జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై దాడులకు పాల్పడిన ఉగ్రమూకలను కఠినంగా శిక్షించాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ క్రమశిక్షణ సంఘం రాష్ట్ర చైర్మన్ మార్తినేని ధర్మారావు అన్నారు. జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో ముష్కరుల దాడిలో మృతి చెందిన పర్యాటకులకు నివాళులర్పిస్తూ హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం నుంచి అమరవీరుల స్థూపం వరకు శివాజీ యువజన భక్త మండలి అంబేద్కర్ సర్కిల్ హనుమకొండ ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులతో కలిసి కాగడాలు, కొవ్వొత్తులతో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. దాడికి పాల్పడిన ఉగ్రవాదులను శిక్షించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ధర్మారావు మాట్లాడుతూ.. పహల్గాంలో పర్యాటకులపై విచక్షణారహితంగా దాడులు జరిపిన నరహంతకులను ఉపేక్షించవద్దని, వారిని చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అమరవీరుల స్థూపం వద్ద కొవ్వొత్తులు వెలిగించి మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు చాడా స్వాతి శ్రీనివాస్‌రెడ్డి, గుజ్జుల వసంత మహేందర్‌రెడ్డి, శివాజీ యువజన భక్త మండలి ప్రతినిధులు కట్ల భాస్కర్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, సరోత్తంరెడ్డి, అశోక్‌రావు, ప్రదీప్‌రావు, జానకీరామారావుతో పాటు బీజేపీ శ్రేణులు బింగి శ్రీనివాస్, శనిగరపు విజయ్, వాసుదేవరెడ్డి, నాగపురి వెంకటేష్, గందు స్వామి, గట్టు రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం నుంచి అమరవీరుల స్థూపం వరకు కాగడాలు, కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మొగిలిచర్లలో భారీ అగ్ని ప్రమాదం



మంటలను అదుపులోకి తీసుకువస్తున్న ఫైర్ సిబ్బంది



మొక్కజొన్న చేలల్లో వ్యాపిస్తున్న మంటలు

- 40 ఎకరాల వరకు విస్తరించిన మంటలు
- రూ.20 లక్షల వరకు ఆస్తినష్టం

గీసుగొండ, మే 4 (ఆంధ్రజ్యోతి): మొగిలిచర్ల శివారులో ఆదివారం భారీ అగ్నిప్రమాదం జరిగి మొక్కజొన్న చేలు తగులపడ్డాయి. రోడ్డుపై ఆరబోసిన మొక్కజొన్నలు, పొట్టుతో ఉన్న మొక్కజొన్న కంకులు అగ్నికి ఆహుతయ్యాయి. చెలరేగిన మంటలు ఎంతకూ అదుపులోకి రాలేదు. 40 ఎకరాల్లో విస్తరించి దగ్ధం చేశాయి. చేలల్లో ఉన్న డ్రిప్ పైపులు, బోర్లు కాలిపోయాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మొక్కజొన్న పంట కోత అనంతరం వృథాగా ఉండే చొప్పను ఓ రైతు తన భూమిలో అంటిపెట్టాడు. కొద్ది సేపటికి విపరీతంగా గాలిదుమారం లేవడంతో కాలుతున్న మొక్కజొన్న చొప్ప గాలికి కొట్టుకొని పోయి పక్క చేలల్లో, పక్కనే రోడ్డుపై ఆరబోసిన మొక్కజొన్నలపై పడింది. మొక్కజొన్న చొప్ప బాగా ఎండి ఉండడంతో ఒక్కసారిగా మంటలు దావానంలా వ్యాపించాయి. చుట్టు మొక్కజొన్న చేలు ఉండటంతో అంటుకొని మంటలు చెలరేగాయి. కొద్ది నిమిషాల్లోనే బీభత్సంగా మంటలు ఎగిసిపడటంతో స్థానికులు అక్కడికి చేరుకొని ఫైర్ సిబ్బందికి సమాచారం అందించి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. రెండు ఫైర్ ఇంజన్‌లు వచ్చి మంటలు ఆర్పేందుకు రంగంలోకి దిగాయి. అదే సమయంలో మంటలు మొగిలిచర్ల సమీపంలోని పెట్రోల్‌బంక్, కోళ్లఫామ్‌ల వైపు వ్యాపిస్తుండడంతో స్థానికులు ఆందోళన చెందారు. కాగా, గాలిదుమారం తీవ్రత తగ్గడంతో ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. రోడ్డుపై ఆరబోసిన మొక్కజొన్నలు కాలిపోవడంతో బాధిత రైతులు విలపించారు. చేతికి వచ్చిన పంట బుగ్గిపాలైందని రోదించారు. దాదాపు రూ.20 లక్షల వరకు నష్టం జరిగినట్లు అంచనా వేశారు.

ప్రాజెక్టుల కోసం కాంగ్రెస్ చేసిందేమీలేదు..

- పంటలు ఎండిపోవడానికి ప్రభుత్వమే కారణం
- ప్రాజెక్టుల నిర్మాణంలో మంత్రులకు అవగాహన లేదు..
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత పొన్నాల లక్ష్మయ్య



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య

హనుమకొండ టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఈ 16 నెలల్లో ప్రాజెక్టుల కోసం చేసింది ఏమీలేదని, బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే ప్రాజెక్టుల నిర్మాణం జరిగిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత పొన్నాల లక్ష్మయ్య అన్నారు. ఆదివారం హనుమకొండలోని ఆయన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాల్సిన పనులపై సమీక్షలు చేసి ఈ ఏడాది రబీ సీజన్‌లో 1 లక్షా 27వేల ధాన్యం పండించి చరిత్ర సృష్టించినట్లు చెప్పుకోవడం సిగ్గుచేటని అన్నారు. పంటల దిగుబడి కోసం గతంలో ఉన్న ప్రాజెక్టుల కంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ప్రాజెక్టును నిర్మించారో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్మాణంలో వైఫల్యం చెందిందన్నారు. రాష్ట్ర మంత్రులు క్రెడిట్ కోసమే జిల్లాలో సమీక్షలు నిర్వహిస్తున్నాని మండిపడ్డారు. వ్యవసాయంపై మంత్రులకు అవగాహన లేదని తెలిపారు. రెండేళ్లలో దేవాదులను పూర్తి చేసి ఆరు లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని అనడం వారి అవగాహన రాహిత్యమన్నారు. రైతుల పంటలు ఎండి పోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమన్నారు. దేవన్నపేటలోని దేవాదుల ఫేజ్-1, ఫేజ్-2 మోటార్లు పనిచేయడం లేదని ఫేజ్-3 మాత్రమే రన్ చేస్తున్నారని అన్నారు. ఓ ఎమ్మెల్యే కోసం వేరేవద్దనున్న మోటర్లను తీసుకొచ్చి మోటార్లను పంపింగ్ చేస్తున్నారని విమర్శించారు. ప్రాజెక్టుల నిర్వహణపై మంత్రులకు అవగాహన లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం డీబీఆర్ లేకుండానే టెండర్లు వేస్తున్నారని విమర్శించారు.

నల్లగొండలో నాలుగు టీఎంసీల నీరు ఆంధ్రోళ్లు తీసుకెళ్తే సోయిలేని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అని విమర్శించారు. ఎల్లంపెల్లి నుంచి 234 టీఎంసీల నీళ్లు కిందికి వృథాగా పోతున్నాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలో 24 టీఎంసీల నీళ్లనే పంపింగ్ చేశారని, మరో 100 టీఎంసీల నీటిని ఎత్తిపోస్తే పంటలను కాపాడుకునేవారన్నారు. కాంగ్రెస్ మంత్రులు రైతులకు సాగు నీరు అందించి పంటలు పండించినట్లు గొప్పలు చెప్పుకోవడం మానుకొని ఇప్పటికైనా పనులు పూర్తిచేసేందుకు కృషి చేయాలని హితవుపలికారు. కాళేశ్వరంలో 86 పిల్లర్లు ఉంటే అందులో 3 పిల్లర్లు కుంగిపోయాయని, 3 పిల్లర్లకు రూ.4 నుంచి 5వందల కోట్లు ఖర్చు చేస్తే శాశ్వతంగా రైతులకు సాగునీరు అందించవచ్చని పొన్నాల తెలిపారు.





సమావేశంలో మాట్లాడుతున్న విశారదన్

రాజ్యాధికారం కోసమే జేఏసీ ఏర్పాటు

ధర్మ సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు విశారదన్ మహారాజ్

కాజీపేట, మే 4 (ఆంధ్రజ్యోతి): అణగారిన వర్గాల ప్రజలకు రాజ్యాధికారం కోసమే బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఏర్పాటు జరిగిందని ధర్మసమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు విశారదన్ మహారాజ్ అన్నారు. కాజీపేట ఫాతిమా నగర్‌లో ఆదివారం బీసీ, ఎస్సీ, ఎస్టీ ఆవిర్భావం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విశారదన్ మహారాజ్ హాజరై మాట్లాడారు. తెలంగాణలో 90 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీలు ఉండగా 10 శాతం అగ్రవర్ణాల వారికి ఈ రాజ్యంలో ఏ పని ఉందని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల బానిస బతుకుల నుంచి భారత రాజ్యాంగం ఇచ్చిన హక్కులతో స్వేచ్ఛగా జీవిస్తున్నామన్నారు. జ్యోతిరావు పూలే, అంబేద్కర్, సిద్ధాంతాలతో సర్వాయి పాపన్న, సమ్మక్క, సారలమ్మ, చిట్యాల ఐలమ్మ వారసత్వం, ఆదర్శంతో ఈ జేఏసీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాధికారం అందించడమే జేఏసీ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు, పాలమూరు యూనివర్సిటీ ప్రొఫెసర్ నాగం కుమారస్వామి, డాక్టర్ ఎంఎఫ్ గోపీనాథ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవికృష్ణ గౌడ్, దాసోజు లలిత, సాయిని నరేందర్, డాక్టర్ కూరపాటి రమేశ్, డాక్టర్ సంపత్, శ్రీనివాస్, శ్రీకాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రయాణికులకు శుభవార్త

- చెన్నై - జోధ్‌పూర్ నూతన మార్గంలో ప్రారంభం
- వారానికి ఐదు రోజుల సేవలు



గిర్మాజీపేట, మే 4 (ఆంధ్రజ్యోతి): చైన్నై-న్యూఢిల్లీ మార్గంలో మరో సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు అందుబాటులోకి వస్తోంది. ఈనెల 6 నుంచి ఇది వరంగల్ ప్రయాణికులకు సేవలు అందిస్తుంది. చైన్నై-భగత్ కి కోటి (జోధ్‌పూర్) మధ్య వారానికి ఐదు రోజులు నడిచే ఈ రైలును శనివారం సాయంత్రం 5.30 గంటలకు కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినివైష్ణవ్ పుణే నుంచి వర్చువల్‌గా చైన్నై సెంట్రల్‌లో ప్రారంభించారు. ఈ రైలు సోమవారం మధ్యాహ్నం 12.30గంటలకు భగత్ కి కోటికి చేరుకుంటుంది. అయితే రెగ్యులర్‌గా ఈనెల 5వ తేదిన చైన్నై సెంట్రల్ నుంచి, 7వ తేదీన భగత్ కి కోటి నుంచి ఈ రైళ్లు బయలుదేరుతాయని అధికారులు తెలిపారు. రెగ్యులర్‌గా చైన్నై సెంట్రల్-భగవత్ కి కోటి (రైలు నెంబర్ 20625) రైలు ప్రతీ సోమ, మంగళ, గురు, శుక్ర, ఆదివారాల్లో రాత్రి 7.45గంటలకు చైన్నై నుంచి బయలుదేరి వరంగల్ మీదుగా మూడో రోజు భగత్ కి కోటికి చేరుకుంటుంది. అదేవిధంగా (రైలు నెంబర్ 20626) ప్రతీ సోమ, మంగళ, బుధ, శుక్ర, ఆదివారాల్లో భగత్ కి కోటిలో ఉదయం 5.30 గంటలకు బయలుదేరి వరంగల్ మీదుగా అదే రోజు రాత్రి చైన్నైకి చేరుకుంటుంది.

వరంగల్‌కు చేరుకునే వేళలు

చెన్నై నుంచి భగత్ కి కోటి (జోధ్‌పూర్)కు బయలు దేరిన సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ప్రతీ మంగళ, బుధ, శుక్ర,శని, సోమ వారాల్లో ఉదయం 04.46 గంటలకు వరంగల్‌కు చేరుకుంటుంది. 2 నిమిషాల అనంతరం బయలుదేరి ఉదయం 9.20 గంటలకు బల్లార్షకు చేరుకుంటుంది. మరుసటి రోజు మధ్యాహ్నం 12.15 గంటలకు భగత్ కి కోటికి చేరుకుంటుంది. అలాగే భగత్ కి కోటి నుంచి బయలు దేరిన రైలు ప్రతీ మంగళ, గురు, శుక్ర, శనివారాల్లో మధ్యాహ్నం 12.08 గంటలకు వరంగల్‌కు చేరుకుంటుంది. 2 నిమిషాల అనంతరం బయలుదేరి మధ్యాహ్నం 1.23 గంటలకు ఖమ్మంకు, మధ్యాహ్నం 3.45 గంటలకు విజయవాడకు, అదే రాత్రి 11.15 గంటలకు చైన్నైకి చేరుకుటుంది. వరంగల్ ప్రజలు ఈ నూతన రైలును సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

ప్రొసీడింగ్స్ ఇచ్చారు.. బిల్లులు మరిచారు

- రోడ్డు వెడల్పులో ఇండ్ల నిర్వాసితుల గోడు
- డబుల్ బెడ్‌రూం మంజూరు చేస్తూ కలెక్టర్ ప్రొసీడింగ్స్
- అయినా ఇంటి బిల్లుల కోసం ఎదురుచూపులు
- కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలంటూ లబ్ధిదారుల వేడుకోలు

గీసుగొండ, మే 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో రోడ్డు వెడల్పు కింద ఇండ్లు, స్థలాలు కోల్పోయిన వారు సంవత్సరాలు గడుస్తున్నా నష్టపరిహారం రాలేదని ఆవేదన చెందుతున్నారు. 2019లో బీఆర్ఎస్ ప్రభుత్వంలో గీసుగొండ, మచ్చాపూర్, గంగదేవిపల్లి, మరియపురం, 15వ డివిజన్ గొర్రెకుంటలో రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. రోడ్డు వెడల్పులో చాలా మంది ఇండ్లు కోల్పోయారు. కాగా, ఇండ్ల నిర్వాసితులు తమకు నష్టపరిహారంపై కచ్చితమైన హామీ ఇవ్వాలని పనులను అప్పట్లో అడ్డుకున్నారు. దీంతో నిర్వాసితులకు నష్టపరిహారం కింద డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చి నచ్చచెప్పారు. అనంతరం రోడ్డు వెడల్పు పనులు కొనసాగాయి. అదే సమయంలో కరోనా రావడంతో ఇండ్ల నిర్మాణాలు నిలిచిపోయాయి. కరోనా తీవ్రత తగ్గిన తరువాత 2022లో లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణాలను మళ్లీ ప్రారంభించారు. అధికారుల సూచన మేరకు ఇండ్లు నిర్మించుకున్నా ఇప్పటివరకు పూర్తిస్థాయిలో బిల్లులు రాలేదని వారు వాపోతున్నారు. మరియపురంలో ముగ్గురికి, మచ్చాపూర్‌లో 23 మందికి, గీసుగొండలో 25, గంగదేవిపల్లిలో 16, గొర్రెకుంటలో 25 మందికి డబుల్ బెడ్‌రూం ఇండ్లను మంజూరు చేస్తూ అప్పట్లో కలెక్టర్ ప్రొసీడింగ్స్ కూడా ఇచ్చారు. అయితే, గీసుగొండలో ఏడుగురికి, మచ్చాపూర్‌లో 16, మరియపురంలో 3, గంగదేవిపల్లికి 5 గురికి స్పాట్ బిల్లులు మాత్రమే వచ్చాయి. తరువాత ఫైనల్ బిల్లులు రాలేదని ఆవేదన చెందుతున్నారు. మిగిలిన వారికి అసలు బిల్లులే రాలేదని వాపోతున్నారు. కొంతమంది అనివార్య కారణాలతో ఆలస్యంగా నిర్మించుకున్నా బిల్లులు రావడంలేదని ఆందోళన చెందుతున్నారు. కాగా, రెండో దశలో ఎలుకుర్తిలో 39 మందికి డబుల్ బెడ్‌రూం ఇండ్లు మంజూరైనా ఒక్కరికి కూడా బిల్లులు రాలేదని వాపోతున్నారు. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని ఇండ్లను మంజూరు ఇవ్వడంతో గ్రామంలోని ఇండ్ల నిర్వాసితులు ఏ ఒక్కరూ కట్టుకోకున్నా, ఇండ్లు కట్టుకున్న వారికి బిల్లులు పూర్తిస్థాయిలో రావని అధికారులు అంటున్నారు. రోడ్డు వెడల్పులో ఇండ్లు కోల్పోయిన తమకు నష్టపరిహారం కింద డబుల్ బెడ్‌రూం బిల్లులు చెల్లించి కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఆదుకోవాలని లబ్ధిదారులు వేడుకుంటున్నారు.



గీసుగొండలో ఇంటిని నిర్మించుకొని బిల్లుల కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారు రాజేశ్వరి

ఇప్పటికైనా ప్రభుత్వం ఆదుకోవాలి

గాజర్ల రాజేశ్వరి, గీసుగొండ

రోడ్డు వెడల్పుతో ఇంటిని కోల్పోయాం. అప్పుడు అధికారులు, ప్రజాప్రతినిధులు వచ్చి ఇండ్లు పోయినందుకు నష్టపరిహారం కింద డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇస్తామని చెప్పారు. కలెక్టర్ డబుల్ బెడ్‌రూం ఇంటి మంజూరు పత్రం కూడా ఇచ్చారు.. అదే సమయంలో కరోనా మొదలు కావడంతో ఇంటిని నిర్మించుకోలేదు. కలెక్టర్ ఇచ్చిన లెటర్ ఉంది కదా అని, కరోనా తగ్గిన తరువాత కొంత ఆలస్యంగా ఇంటిని నిర్మించుకున్నాం. ఇపుడు రద్దయ్యిందంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా తమకు బిల్లులు చెల్లించి ఆదుకోవాలి.

కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకుంటుంది

కొండేటి కొమురారెడ్డి, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు



అర్హులైన వారిని కాంగ్రెస్ ప్రభుత్వం తప్పకుండా ఆదుకుంటుంది. ఈ విషయమై ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. గొర్రెకుంటలో రోడ్డు వెడల్పు కింద ఇండ్లు కోల్పోయిన 10 మందికి ఎమ్మెల్యే చొరవ చూపి డబుల్ బెడ్‌రూం ఇండ్లను మంజూరు చేయించారు.

పత్తి కొనుగోళ్లలో రూ.3 వేల కోట్ల అవినీతి

మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోపణ



వరంగల్ వ్యవసాయం, మే 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సీసీఐ పత్తి కొనుగోళ్లలో సుమారు మూడువేల కోట్ల రూపాయల భారీ స్కామ్ జరిగిందని, అందులో ప్రభుత్వ పెద్దలు, సీసీఐ అధికారుల హస్తం ఉందని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో టెంపరరీ రిజిస్ట్రేషన్(టీఆర్) నంబర్లతో బ్రోకర్లు ట్రేడర్ల ముసుగులో దోపిడీకి పాల్పడ్డారని ఆరోపించారు. గత దీపావళి రోజున హైదరాబాద్‌లోని ఓ ఫైవ్‌స్టార్ హోటల్‌లో సీసీఐ అధికారులు, ప్రముఖ ట్రేడర్స్ మధ్య రహస్య సమావేశం జరిగిందని, ఈ కుంభకోణానికి సంబంధించిన బీజం అక్కడే పడిందని పేర్కొన్నారు. అక్కడి సీసీ కెమెరాలను పరిశీలిస్తే దొంగలు దొరికిపోతారని, ఈస్కామ్ వెనుక ప్రభుత్వ పెద్దలు, సీసీఐ ఉన్నతాధికారులు ఉన్నారని తెలిపారు. ఈ వ్యవహారంలో ఏడుగురు మార్కెట్ కార్యదర్శులపై వేటు పడిందని, మరో 130మందికి షోకాజ్ నోటీసులు జారీ చేయడమే అవకతవకలు జరిగాయనేందుకు నిదర్శమని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ పత్తి సీజన్‌లో 25 లక్షల మంది రైతుల నుంచి 49 లక్షల బేళ్ల పత్తి కొనుగోలు చేసినట్లు సీసీఐ ప్రకటించిందని పెద్ది ఆరోపించారు. ఇందులో 41 లక్షల బేళ్లపత్తిని కేవలం 6.30 లక్షల మంది (20శాతం) రైతుల నుంచి, 8 లక్షల బేళ్లను ట్రేడర్ల ద్వారా కొనుగోలు చేసినట్లు సీసీఐ వెల్లడించిందని తెలిపారు. పత్తికి కనీస మద్దతు ధర రూ.7521లతో కొనుగోలు చేసిట్లు సీసీఐ ఆన్‌లైన్‌లో పెట్టిందని తెలిపారు. 80 శాతం పత్తిని 20శాతం మంది రైతుల నుంచి కొనుగోలు చేస్తే మిగతా పత్తి ఎవరి వద్ద నుంచి కొనుగోలు చేసినట్లు..? మద్దతు ధర ఎవరికి చెల్లించినట్లు..? సుమారు 18 లక్షల మంది రైతులు పత్తిని ఎవరికి అమ్మినట్లు అని సీసీఐ అధికారులను ప్రశ్నించారు. సీసీఐ అధికారులు, బ్రోకర్లు, ప్రభుత్వ పెద్దలు కుమ్మక్కై రైతుల నుంచి ఐదు నుంచి ఆరు వేల ధరకు కొనుగోలు చేసి అదే పత్తిని సీసీఐ కి రూ.7521ల అమ్మారని సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. పత్తి కొనుగోళ్లలో జరిగిన అక్రమాలపై సీబీఐ చేత విచారణ జరిపించాలని ఆయన ఆ ప్రకటనలో డిమాండ్ చేశారు.



వెలమ సంఘం నాయకులతో ఎమ్మెల్సీ టీ రవీందర్‌రావు

వెలమ సంఘం అభివృద్ధికి కృషి

ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు

రెడ్డికాలనీ, మే 4 (ఆంధ్రజ్యోతి): వెలమ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. హనుమకొండలోని ఏఆర్ఆర్ గార్డెన్స్‌లో ఆదివారం వెలమ సంక్షేమ సంఘం 30వ సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా రవీందర్‌రావు, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరై మాట్లాడుతూ.. వెలమలు ఐక్యంగా ఉండి సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. సంఘాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు మాట్లాడుతూ.. వెలమ సంఘం అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పని చేయాలన్నారు. భవిష్యత్‌లో వెలమ సంఘాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం సంఘం అభివృద్ధికి కృషి చేస్తున్నవారిని సన్మానించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, వెలమసంక్షేమ సంఘం అధక్షుడు పేరాల మధుసూదన్‌రావు, ప్రధాన కార్యదర్శి కాకులమర్రి ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యక్షులు గుజ్జ ప్రభాకర్‌రావు, తక్కెళ్లపల్లి శ్యాంసుందర్‌రావు, జాయింట్ సెక్రెటరీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, బాలకిషన్‌రావు, స్వామిరావుతో పాటు పెద్ద సంఖ్యలో వెలమ కులస్థులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా శ్రీను



మేన శ్రీనును అభినందిస్తున్న డీఆర్‌డీఏ స్టాఫ్, ఏపీవోలు

హనుమకొండ కలెక్టరేట్, మే4 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మేన శ్రీను నియామకయ్యారు. గతంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా ఉన్న రాధికగుప్తా బదిలీపై వెళ్లడంతో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకట్‌రెడ్డికి బాధ్యతలు అప్పగించారు. ఇటీవల వెంకట్‌రెడ్డి దీర్ఘకాల సెలవుపై వెళ్లడంతో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మేన శ్రీనును నియమిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన శ్రీనును డీఆర్‌డీఏ సిబ్బంది, ఏపీవోలు, అధికారులు బొకేలు ఇచ్చి అభినందనలు తెలిపారు.

ముదిరాజ్‌ల సంక్షేమానికి రూ.వెయ్యి కోట్లు కేటాయించాలి



పాదయాత్ర చేస్తున్న ముదిరాజ్ సమాజ్ నాయకులు

ముదిరాజ్ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు దారం యువరాజ్

హనుమకొండ టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ముదిరాజ్‌ల సంక్షేమానికి రూ.వెయ్యికోట్ల నిధులు కేటాయించాలని ముదిరాజ్ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు దారం యువరాజ్ డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండలోని అమరవీరుల స్థూపం వరకు పాదయాత్ర నిర్వహించి మాట్లాడారు. ములుగు జిల్లా మేడారం సమ్మక్క- సారలమ్మలను దర్శించుకొని వరంగల్ భద్రకాళి అమ్మవారి ఆలయం వరకు పాదయాత్ర చేసి అక్కడి నుంచి హనుమకొండలోని అమరవీరుల స్థూపం వరకు చేరుకొని అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా దారం యువరాజ్ ముదిరాజ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ముదిరాజ్‌ల సంక్షేమం కోసం రూ.వెయ్యి కోట్లు నిధులు కేటాయించి తెలంగాణలోని చెరువులు, కుంటలపై మత్స్యసంపదపై ఆధారపడి జీవిస్తున్న ముత్తరాసి, ముదిరాజ్, బెస్త, గంగపుత్ర, గూండ్ల కులాలకు చెరువులపై హక్కులు కల్పించాలని కోరారు. తెలంగాణ మత్స్య అభివృద్ధి బోర్డును ఏర్పాటు చేసి ముదిరాజ్‌ను చైర్మన్‌గా ప్రభుత్వం నియమించాలన్నారు. ఉచిత చేప పిల్లల పథకం వంద శాతం మత్స్యకారులకు చేరే విధంగా పంపిణీ చేపట్టాలన్నారు. రాజకీయాల్లో ముదిరాజ్‌లకు ప్రాతినిథ్యం పెంచి మంత్రి వర్గంలో స్థానం కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఊళ్లకు వెళ్తున్నారా.. దొంగలున్నారు జాగ్రత్త..!

- పోలీసుల సూచనలు పాటిస్తే చోరీలకు అడ్డుకట్ట



హనుమకొండ టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి): వేసవి కావడంతో పాఠశాలలు, కళాశాలలకు సెలవులు వచ్చాయి. దీంతో కుటుంబంతో సహా విహారయాత్రలకు, పర్యాటక ప్రదేశాలకు వెళ్తుంటారు. అదునుచూసి నగరంలో దొంగతనాలు కూడా పెరుగుతున్నాయి. తాళాలు వేసి ఉన్న ఇండ్లను టార్గెట్ చేసి దొంగలు అందినకాడికి దోచుకుంటున్నారు. హనుమకొండ సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వడ్డెపల్లి, జులైవాడ, న్యూశాయంపేట, హంటర్‌రోడ్, దీన్‌దయాళ్‌నగర్, బాలసముద్రం, శ్రీనివాసకాలనీతో పాటు పలు కాలనీల్లో వరుస చోరీలు జరగడంతో ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

వరుస చోరీలు

సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలో వరుస చోరీలు కలకలం రేపుతున్నాయి. కాలనీల్లో సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో చోరీలకు పాల్పడిన వారిని పట్టుకోవడం పోలీసులకు సవాల్‌గా మారుతోంది. కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కాలనీ పెద్దలకు పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని పోలీసులు చెబుతున్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే చోరీలను అరికట్టవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

ఊరెళ్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి

సుబేదారి సీఐ, పి.సత్యనారాయణరెడ్డి



విద్యార్థులకు పరీక్షలు ముగిశాయి. వేసవి సెలవులు రావడంతో ప్రజలు స్వగ్రామాలు, విహారయాత్రలకు ఇండ్లకు తాళాలు వేసి వెళ్తున్నారు. వెళ్లే ముందు స్థానిక పోలీసులకు సమాచారం అందించాలి. పెట్రోలింగ్ పెంచి రాత్రి నిఘా ఏర్పాటు చేస్తాం. బంగారం, నగదు ఇంటిలో ఉండనివ్వకుండా బ్యాంకు లాకర్లలో పెట్టుకోవాలి. చోరీల నియంత్రణకు ప్రజలు పోలీసులకు సహకరించాలి. ఎవరైనా అనుమానితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి.

వృక్షో రక్షతి రక్షితః



వర్ధన్నపేట రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి) : నా వయస్సు 70 ఏళ్లు.. నా పేరు వేపచెట్టు. నేను వేసవి కాలంలో ఎంతో మందికి చల్లటి గాలి, నీడను ఇచ్చే చెట్టును. నన్ను ఈ గ్రామస్థులు అల్లారుముద్దుగా పెంచుకున్నారు. ఇప్పుడు నేను మహావృక్షాన్నై ఎంతో మందికి నీడనిస్తూ సేద తీరుస్తున్నాను. నా ముందే ఎంతో మంది పుడుతున్నారు.. మరణిస్తున్నారు. ఎంత మండు టెండలోనైనా చల్లటి గాలిని ఇవ్వడమే నా స్వభావం.

వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని బండౌతపురం గ్రామంలో జీపీ ఎదురుగా వేప చెట్టు విశేషాలను అక్కడి వృద్ధులు ఆంధ్రజ్యోతితో పంచుకున్నారు. వృక్షాలను మనం రక్షిస్తే, అవి మనల్ని రక్షిస్తాయని చెప్పడానికి ఈ చిత్రమే చక్కటి నిదర్శనం.

ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి

- సద్గురు లక్ష్మీనారాయణ గురుభవాని
- భక్తిశ్రద్ధలతో హనుమాన్ మహాయజ్ఞం

దామెర, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పులుకుర్తి గ్రామ శివారులోని బాలా మానసా మహా విద్యాపీఠం ఆవరణలో ఆదివారం ప్రాతఃకాల మండప పూజలతో ధన్వంతరి సహిత హనుమాన్ మహా యజ్ఞం ఘనంగా ప్రారంభమైంది. ఈ మహా యజ్ఞానికి సద్గురు లక్ష్మీనారాయణ గురుభవాని విచ్చేసి అనుగ్రహ భాషణం చేశారు. యజ్ఞంలో 40 మంది వేద రుత్వికులతో గణపతి సహస్ర మోదక, వాసవి కన్యకా పరమేశ్వరి, మహాలక్ష్మీ సహిత, ధన్వంతరి సహిత హనుమాన్ 6వ మహాయజ్ఞం పూజాధికాలను నిర్వహించారు. ఇందులో భాగంగా దైవ చింతనతోనే సర్వమానవాళి మనుగడ, సంక్షేమం, సుఖ శాంతులు వంటివి ఆధారపడి ఉన్నాయని సద్గురు లక్ష్మీనారాయణ గురుభవాని అనుగ్రహ బాషణం చేశారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని, మానసిక ప్రశాంతత కోసం దైవానుగ్రహం ఉండాలని పేర్కొన్నారు. ఆతరువాత పూర్ణాహుతి, ఆశీర్వచనం కార్యక్రమాన్ని నిర్వహించారు. సత్సంకల్పంతో చేపట్టే లోక కల్యాణానికి ఎలాంటి ఆటంకాలు ఎదురు రావని, ఏ విధమైన సమస్యలు దరిచేరవని స్పష్టం చేశారు. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా చిన్నారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అన్న ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం 6గంటలకు శోభా యాత్ర నిర్వహించారు.

ప్రముఖుల సందర్శన

ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, హనుమకొండ జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయచందర్‌రెడ్డి, కరీంనగర్ డీఎస్పీ జూపల్లి శివరామయ్య కుటుంబ సభ్యులు, మాజీ సర్పంచ్ పెరుక సత్యం, ముదిగొండ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. అంతే కాకుండా ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు చెల్పూరు, హైదరాబాద్, కరీంనగర్, సంగారెడ్డి, ఖమ్మం, కొత్తగూడెం తదితర ప్రాంతాల నుంచి భక్త శిష్య బృందం తమ సేవలను అందించారు. కాగా, ధన్వంతరి సహిత హనుమాన్ యజ్ఞం క్రతువులో మానస పరివార్ ట్రస్ట్ సభ్యులు, వేల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



అనుగ్రహ భాషణం చేస్తున్న సద్గురు లక్ష్మీనారాయణ గురుభవాని



నృత్యం చేస్తున్న చిన్నారులు

నదీ స్నానం.. పుణ్యఫలం

15వ తేదీ నుంచి సరస్వతీ పుష్కరాలు

మహదేవపూర్, మే 4 (ఆంధ్రజ్యోతి) : సమస్త ప్రాణకోటి మనుగడకు ఆధారం జలం. జలం పుట్టిన తరువాతే జీవకోటి ఉద్భవించింది. జలధారల వెంటే నాగరికత విస్తరించింది. అలాంటి జలానికి దేవత రూపాలనిచ్చి తల్లిగా ఆరాధించడం హిందూ సంప్రదాయం. అలాగే నదులు, సముద్రాలు, కోనేరులు, మాఘ, మంగళ స్నానాలు.. ఇలా హిందూ సంప్రదాయం.. నీటితోనే ముడిపడి ఉంది. అలాగే తీర్థ యాత్రలు అని పుణ్యక్షేత్రాల దర్శనం కూడా అంతే. కర్మలు, పిండప్రదానాలు, తర్పణాలు కూడా జలంతో ముడిపడినవే. నదీ తీరంలో పితృకర్మలాచరించడం మోక్షదాయకమని పెద్దలు చెప్తారు. పితరులను ఉద్ధరించడానికి భాగీరథుడు గంగానదిని భూమికి తీసుకువచ్చాడని పురాణాలు చెప్తున్నాయి. తిలోదకాలు ఇచ్చామంటే స్వస్తి వాచకం చెప్పడమని లోకోక్తి. నదీ స్నానాల్లో పుష్కర స్నానం పుణ్యప్రథమని హిందువల విశ్వాసం. తైత్తరీయ ఉపనిషత్తు బ్రహ్మ నుండి ఆకాశం, ఆకాశం నుంచి వాయువు, వాయువు నుంచి జలం, జలం నుంచి భూమి, భూమి నుంచి ఔషధాలు, ఔషధాల నుంచి అన్నం, అన్నం నుంచి జీవులు పుట్టాయని వివరిస్తుంది. ఇలా జీవరాశులకు ప్రధానమైన జలం స్నానం. ప్రాముఖ్యతను గుర్తు చేసేవే పుష్కరాలు. పుష్కరం అంటే పన్నెండు సంవత్సరాలు ఒక సారి వస్తాయి. దేశంలోని 12 ముఖ్యమైన నదులన్నింటికి పుష్కరాలు వస్తాయి. ఆ పుష్కరాల సమయంలో స్నానం దశవిధాల మేలు అని శాస్త్రాలు చెబుతున్నాయి. ఈ క్రమంలోనే సరస్వతీ నదికి ఈ నెల 15నుంచి పుష్కరాలు జరగనుండగా.. మన రాష్ట్రంలో సరస్వతీ పుష్కరాలు జరిగే ఏకైక ప్రాంతం భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వర తీరం. ఈ సారి పుష్కరాలు లక్షలాది మంది భక్తులు తరలొస్తారన్న అంచనాల మధ్య ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది.


నదిలో పుణ్య స్నానమాచరించి దీపం వెలిగించిన మహిళ

దశ విధ స్నానాలు

మాలపకర్షణ స్నానం, సంకల్ప, మృత్తికా, మంత్ర, పితృ సంబంధ, గురు సంబంధ, మూల మంత్ర, అఘర్షణ, పురుష సూక్త, తీర్థ స్నానం ఉన్నాయి. పది రకాల స్నానాల్లో తీర్థ స్నానం ఒకటి. దశ విధ స్నానాల్లో అతి శ్రేష్ఠమైనది కూడా అదే. తీర్థ స్నానాచరణకు విధి విధానం ఉంది. ప్రవాహానికి అభిముఖంగా నడుము లోతు నీటిలో నిలబడి, నది ప్రాముఖ్యతనూ, మహిమను స్మరించి, నదికి అది దేవతనూ, అభిమాన దేవత అయిన భగవంతుడిని, నామాన్ని ధ్యానించి మునకలు వేయాలి. నదీ స్నానం కేవలం తన శరీరానికే కాదని అంతరంగా కూడా అని తనలో సూక్ష్మరూపంలో నెలకొన్న దైవానికి రూపంగా కూడా భావించాలి. దశ విధ స్నానాలలో తీర్థస్నానం ఉత్తమమైనదే పుష్కర పుణ్య మనయంలో ఆచరించే పుష్కర స్నానం విశేష ఫలదాయకం అని పెద్దలు చెప్తారు. గౌతమ మహర్షికి గోహత్య పాపం నుంచి విమోచనం అనుగ్రహించిన గోదావరి పుష్కర స్నానం అంతరంగ ప్రక్షాళనకు అద్వితీయమైన సాధనం. అందులో కలిసే ప్రాణహిత, సంగమంలోని అంతర్వాహిని సరస్వతి నదికి అదే వర్తిస్తుంది. సరస్వతి నది స్నానానికి ఒక అనుష్ఠాన ప్రక్రియ నిర్దేశించి ఉంది. ఒక భావనా పద్ధతి ఉంది. ప్రతీ క్రియకు ప్రతి ప్రక్రియకు ఒక పరామర్థం. ప్రతి పరమార్థానికి ఒక ఫలితం ఉంటాయి. స్థూలంగా కనిపించే ప్రతి దానికి ఒక సూక్ష్మ రూపం ఉంటుంది. సూక్ష్మంలో మోక్షం అని అందుకే అంటారు. సూక్ష్మాతి సూక్ష్మమైన , స్థూలాతి స్థూలమైన విశ్వమూ ఆ పదార్థాల సమ్మేళనంతోనే రూపొందింది అండంలో, పిండంలో, బ్రహ్మాండంలోఅన్నింటిలో అన్నీ ఉన్నాయి. మనిషిలోనూ ఉన్నాయి. ఈ విశాల విశ్వంలోని ప్రకృతి విన్యాసం మనిషిలోనూ ఉంది. అందుకే ప్రపంచంలో ప్రవహించే నదులు కూడా మానవ శరీరంలో ఉన్నాయని తత్వవేత్తలు సెలవిచ్చారు.

పుష్కర స్నానమాచరించి పునీతులు కండి

- కాశీ ఉత్తర పీఠాధికారి సుదర్శనానంద స్వామి ఉద్బోధ
- రుద్రేశ్వరాలయాన్ని సందర్శించిన స్వామిజీ

హనుమకొండ కల్చరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభ మేళా అనంతరం ఈ నెల 15వ తేదీ నుంచి 26వ తేదీ వరకు వస్తున్న పవిత్ర సరస్వతీ నది పుష్కరకాలంలో సమీప నదుల్లో భక్తులు స్నానాలు ఆచరించి పునీతులు కావాలని వారణాసి (కాశీ) ఉత్తర పీఠాధికారి సుదర్శనానంద స్వామిజీ ఉద్బోధించారు. కాశేశ్వరంలోకి ఆలయాన్ని సందర్శించి ఆదివారం నేరుగా ప్రసిద్ధ వేయిస్తంభాల రుద్రేశ్వరాలయం చేరుకొని స్వామివారికి అభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ఉత్తిష్ట గణపతి దర్శనం చేయించి అనంతరం గర్భాలయంలో కొలువైన కాకతీయుల కాలం నాటి రుద్రేశ్వరుడిని స్వామిజీ సందర్శించి వారణాసిలోని మణికర్ణిక ఘాట్ నుంచి తన వెంట తీసుకొచ్చిన గంగాజలంతో స్వయంగా తానే అభిషేకం నిర్వహించుకున్నారు. అనంతరం ఆలయ నాట్య మండపంలో భక్తులకు మంగళహారతులు సమర్పించి అనుగ్రహ భాషణం చేశారు. వరంగల్ వాసులకు సమీపంలోని త్రిలింగేశ్వర ఆలయంగా ప్రసిద్ధిగాంచిన కాళేశ్వరంలో పుష్కరస్నానాలు ఆచరించాలని సూచించారు. ఇటీవల ప్రయాగ్‌రాజ్‌లో తమ వారణాసి పీఠాధిపతి సురేశ్వరానందస్వామిజీ ఆధ్వర్యంలో భక్తులకు విశేష సేవలందించామని చెప్పారు. అక్కడి ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవతో 60 కోట్ల మంది భక్తులు పుష్కర స్నానాలు ఆచరించారని చెప్పారు. సరస్వతీ పుష్కరాలకు కూడా ఇక్కడి తెలంగాణ సర్కార్, సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రత్యేక చొరవ తీసుకొని పుష్కరాలకు చేస్తున్న ఏర్పాట్లు ఎంతో ప్రశంసనీయమైనవని స్వామిజీ పేర్కొన్నారు. పుష్కర సమయంలో రాజకీయాలు, ప్రజల మధ్య విభేదాలు విస్మరించి ప్రతి ఒక్కరూ స్నానమాచరించాలన్నారు. భారతదేశం భిన్నత్వంతో ఏకత్వంగా భాసిల్లుతూ సనాతన ధర్మాన్ని ఆచరిస్తూ ఒక మహోన్నత శక్తిగా ఎదిగారని అన్నారు. భగవత్ రామానుజులు, శంకరాచార్యులు, మధ్వాచార్యులు, బసవేశ్వరుల స్ఫూర్తితో హిందూ సమాజం ఆధ్యాత్మికతతో విలసిల్లుతోందన్నారు. ఆలయ ఈవో అనిల్ కుమార్, మణికంఠ శర్మ తదితరులు పాల్గొన్నారు. స్వామిజీ భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.


రుద్రేశ్వరాలయంలో మాట్లాడుతున్న సుదర్శనానందస్వామి

ఉన్నది తొమ్మిది రోజులే..

- పిల్లర్లకే పరిమితమైన పనులు
- మంత్రి ఆదేశాలు బేఖాతరు
- పుష్కరాల పనులకు గ్రహణం
- పట్టించుకోని పాలకులు

మహదేవపూర్, మే 4 (ఆంధ్రజ్యోతి) : సరస్వతి పుష్కరాలకు సర్వ సిద్ధమయ్యాయని అనుకుంటే పొరపాటే .. ఏర్పాట్లలో ఒక్కటి కూడా పూర్తి కాలేదంటే అతిశయోక్తి కాదు.. మంత్రి శ్రీధర్‌బాబు స్వయంగా పనులను పరిశీలించినా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారైంది పరిస్థితి. పరమశివుడి సన్నిధిగా పేరొంది.. భక్తుల కొంగు బంగారంగా విలసిల్లుతున్న కాళేశ్వరాలయ అభివృద్ధి పనులకు గ్రహణం పట్టింది. అన్ని ఉన్నా అల్లుడి నోట్ల శని ఉన్నట్లు నిధులు మంజూరైనా ఇంతవరకు పనులు ప్రారంభం కాకపోవడం విడ్డూరంగా ఉంది. పతి పన్నెండు ఏళ్ల కోసారి జరిగే పుష్కరాలు మళ్లీ ఈ సంవత్సరం ఈ నెలలో వస్తున్నందున పనులు జరగకపోవడం గమనార్హం. రాష్ట్ర ప్రభుత్వం పుష్కరాల అభివృద్ధి పనుల కోసం , కాళేశ్వర ఆలయ అభివృద్ధి కోసం రూ.25కోట్లు మంజూరు చేసింది. టెండర్లు పూర్తయినయి.. అయినా ఇంతవరకు పనులు పూర్తి కావడం లేదు. ఇంకా తొమ్మిదిరోజులే ఉన్నా.. అయినా ఇంతవరకు పనులు పూర్తి కాకపోవడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.


పుష్కరఘాట్ వద్ద పిల్లర్ల వరకే పరిమితమై ఉన్న స్నాన గదులు

ఇంకా పూర్తి కాని పనులు ఇవే..

శారదా మండపం పనులు పిల్లర్ల వద్దనే ఉన్నాయి. వీఐపీ ఘాట్ వద్ద మెట్ల పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. బట్టలు మార్చుకునే గది, స్నానపు గదులు, మరుగుదొడ్ల పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి. పుష్కర ఘాట్ వద్ద ఆర్చి తోరణం పూర్తి కాలేదు. మండపం పనులు, సరస్వతి మాత విగ్రహ పనులు 20 శాతం కూడా పూర్తి కాలేదు. పనులకు ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చొరవతో రూ. 25 కోట్లు మంజూరైనా ఏం లాభం లేకుండా పోతుంది. పుష్కర ఘాట్ అభివృద్ధి.. వీఐపీ ఘాట్‌కు రోడ్డు, పార్కింగ్, ఆలయంలో కొత్త అభివృద్ధి పనులు, బస్టాండ్ రహ దారి, ఇతరత్రా పనులు ఇంకా పూర్తి కాకపోవడంతో మళ్లీ 25 కోట్లు వృథాగానే పోతాయో మనని పలువురు భక్తులు చర్చించుకుంటున్నారు. భక్తుల కోర్కెలు తీర్చే దేవుడి పనులకు ఇంత జాప్యం ఎందుకు చేస్తున్నారో అర్థం కాని పరిస్థితి ఉంది. దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి శైలజ రామయ్యార్ ఇటీవల వరుస మీటింగ్‌లు పెట్టి అభివృద్ధి పనులపై ఆరా తీసినా ఇంతవరకు ఆ పనులకు మోక్షం రావడం లేదు. ఆలయం నుండి గోదావరి దాకా చలువ పందిళ్లు, నీడ ప్రదేశాలు ఏర్పాటు చేస్తేనే భక్తులకు సౌకర్యంగా ఉంటంది. తాగునీటి వసతిని మెరుగు పరచాల్సి ఉంది. గోదావరి ఒడ్డున స్నానపు గదులు, మహిళలు దుస్తులు మార్చుకునేందుకు గదులు, శాశ్వత మరమ్మతు పనులు చేయాల్సి ఉండగా పట్టించుకునే నాథుడు లేదు. కేశఖండన గదుల నిర్మాణం పిల్లర్ల వరకే పరిమితమై ఉంది. అసలు పుష్కరాల వరకు పూర్తయ్యేనా అనే సందేహం నెలకొంది. మంత్రి, ప్రిన్సిపల్ సెక్రటరీ వరుస సమావేశాలు ఏర్పాటు చేసి ఏం లాభం ఇంతవరకు ఏ పని పూర్తి కాలేదని పలువురు విమర్శిస్తున్నారు.


పుష్కరఘాట్ వద్ద ఇంకా నిర్మాణంలోనే ఉన్న కేశఖండన గదులు

బీఆర్ఎస్ ప్రభుత్వంలో రూ.25 కోట్లు

తొమ్మిది సంవత్సరాల క్రితం బీఆర్ఎస్ ప్రభుత్వంలో అప్పటి సీఎం కేసీఆర్ ఆలయాభివృద్ధి కోసం రూ. 25 కోట్లు మంజూరు చేశారు. అప్పటి పనులు ఇప్పటివరకు పూర్తి కాకపోగా కొన్ని భవనాలు మధ్యలోనే ఆగిపోయాయి. గతంలోనే నిధులు మంజూ రైనా ఆ డబ్బులు లెక్కాపత్రం లేకుండా పనులు పూర్తి కాలేదు.. వంద రూముల వసతి గృహాల నిర్మాణం ఇంకా పూర్తి కాలేదు.. అన్నసత్రం మధ్యలోనే ఆగిపోయాయి. సగం కట్టిన బిల్డింగ్‌లు అలాగే

లగ్గమే 'బంగారమాయెనా'..!?

- సామాన్య, మధ్య తరగతి ప్రజలకు కలగానే బంగారం
- పెళ్లిళ్ల సీజన్ అయినా కొనుగోళ్లు లేక వెలవెలబోతున్న జ్యువెల్లర్స్
- రూ.లక్షకు చేరువైన తులం పసిడి ధర
- వన్ గ్రామ్‌గోల్డ్ ఆభరణాలే దిక్కంటున్న మహిళలు

వేసవిలో వివాహాది శుభ కార్యాలున్నా..

ఏటా వేసవి మూడు నెలలు వివాహ శుభ కార్యాలయాల సమయాల్లో కాస్త ఎక్కువగానే బంగారం కొనుగోళ్లు జరిగేవి. ఈ యేడు పెరిగిన ధరతో కొనుగోళ్లు పూర్తిగా పడిపోయాయి. పెళ్లిళ్ల సీజన్ అయినప్పటికీ వినియోగదారులు కొనుగోళ్లకు ముందుకు రాకపోవడంతో జ్యూవెల్లరీ షాపులు గిరాకీలు లేక వెలవెలబోతున్నాయి. ఆడవారికి ఎంతో ఇష్టమైన బంగారు ఆభరణాలు ధరించాలంటే సంపన్నులై ఉండాలి. లేదంటే ఉన్న స్థిరాస్తులను అమ్మి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి వచ్చిందని చెప్పక తప్పదు. ఆడ పిల్లల వివాహాలకు భారీ మొత్తంలో బంగారం కొనుగోలు చేసే వారు సైతం ప్రస్తుతం సంప్రదాయ మెట్టెలు, పుస్తెల తాడుతోనే సరి పెట్టుకుంటున్నారు. అప్పటికే సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ధర ఆర్థిక భారంగా మారింది.

మహబూబాబాద్ టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి): వేసవి ఎండల్లా పసిడి ధరలు భగ్గుమంటున్నాయి. రోజురోజుకూ బంగారం ధరలు పెరిగిపోయి తులం బంగారం (24 క్యారెట్లు) ధర లక్షకు చేరువైంది. పక్షం రోజుల కిందట రూ.లక్ష మార్కు దాటి పోయి ప్రజల గుండెల్లో పరుగెత్తించింది. ఈ మధ్య మళ్లీ కాస్త తగ్గి తులం రూ.96 వేలకు చేరుకుంది. ధరలు చూస్తుంటే సామాన్య, మధ్య తరగతి ప్రజలకు బంగారం కలగానే మిగిలిపోనుంది. వారు అటు వైపు కన్నెత్తి చూసే పరిస్థితి లేకుండాపోయింది. సాధారణంగా ధనవంతుల ఇళ్లలోని మహిళలు మాత్రమే బంగారు ఆభరణాలను ధరించే వారు. కూలీనాలీ చేసుకుని జీవనోపాధి పొందే సామాన్య ప్రజలు బంగారు అభరణాలకు ఎప్పుడు దూరంగానే ఉంటున్నారు. వారు చూడడమే తప్ప ఆభరణాలు ధరించిన దాఖాలాలు కన్పించలేదు. ఇక మధ్యతరగతి ప్రజలు తమ సంపాదనలో కొంత మేర తమ పిల్లలకు బంగారు ఆభరణాలు కొనుగోళ్లు చేస్తూ వస్తున్నారు. ప్రస్తుతం పెరిగిన ధరలు వారిని కూడ కొనుగోలుకు దూరం చేశాయని చెప్పవచ్చు. ఆర్థిక స్తోమత లేని వారు వన్ గ్రామ్ గోల్డ్ ఆభరణాలను కొనుగోలు చేసి ధరిస్తున్నారు.

వంద రోజుల్లో భారీగా పెరిగిన ధర

మార్కెట్‌లో వందరోజుల్లో తులం బంగారం ధర సుమారు రూ.20 వేల వరకు పెరిగింది. గత సంవత్సరం డిసెంబరు మాసంలో తులం బంగారం ధర రూ.76 నుంచి 78 వేలు పలికింది. క్రమ క్రమంగా ఎన్నడు లేని విధంగా వందరోజుల్లో సుమారు రూ.20 వేల వరకు పెరిగి రూ.లక్షకు చేరువైంది. గతంలో డబ్బులున్న కొంతమంది బంగారం కొనుగోలు చేసి దాచుకునే వారు. బంగారం ధరలు అమాంతం పెరగడంతో వారు కూడా కొనుగోలు చేయడానికి ముందుకు రావడం లేదు. పెళ్లిళ్ల సీజన్ కావడంతో కొంత కాలం కిందట బంగారు ఆభరణాలు ఆర్డర్ ఇచ్చి కొంత సైకం అడ్వాన్స్ ఇచ్చిన వినియోగదారులు అప్పటిధర ప్రకారమే తమకు ఆభరణాలు చేసి ఇవ్వాలనడంతో వ్యాపారులు తలలు పట్టుకున్నారు. ఓ పక్క ధరలు పెరిగి విక్రయాలు లేక, మరోపక్క పాతధరతో ఆభరణాలు చేసి ఇవ్వాల్సి రావడంతో వ్యాపారులు ఆర్థికంగా నష్టపోతున్నారు. బంగారం ధరలు పెరగడంతో అటు వినియోగదారులు, ఇటు వ్యాపారులు ఇద్దరు నష్టపోవాల్సి వస్తోంది. ఏది ఏమైనప్పటికి సామాన్య, మధ్యతరగతి ప్రజలకు బంగారం కొనుగోళ్లు కలగానే మిగిలి పోనున్నాయి.



బంగారం ధర అడిగి వెళ్తున్నారు..



పెరిగిన బంగారం ధరలతో వినియోగదారులు ధర అడిగి వెళుతున్నారు తప్ప కొనడంలేదు. గిరాకీ పూర్తిగా పడిపోయింది. ఉదయం నుంచి రాత్రి వరకు ఖాళీగా షాపు తెరిచి కూర్చుంటున్నాం. మధ్యతరగతి వర్గాల ప్రజలు బంగారు ఆభరణాలు చేయించుకోవడం బంద్ చేశారు. ఉన్నత వర్గాల వారు పట్టణాల్లోని పెద్దషోరూంలలో కొనుగోలు చేయడంతో కులవృత్తిపై ఆధారపడిన మాలాంటి షాపులు, వృత్తిదారులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఏర్పడింది.

బీ వేణుగోపాలాచారి, బంగారం షాపు నిర్వాహకుడు, కేసముద్రం

ఆలయాల్లో నియామకాలపై ఆరా

- సమాచారం తెప్పించుకున్న దేవాదాయ శాఖ
- వివరాలను అందజేసిన ఆలయ ఈవోలు
- ఉమ్మడి జిల్లాలోని పలు గుళ్లలో అక్రమ నియామకాలు
- స్వీపర్ నుంచి అటెండర్ వరకు పైరవీలతో ఉద్యోగం
- తీగ లాగడంతో కదులుతున్న డొంక


హనుమకొండ, మే 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా దేవాదాయశాఖలో పదేళ్లలో చేసిన నియామకాల వివరాలపై ప్రభుత్వం ఆరా తీస్తోంది. ఇందులో భాగంగా హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ జిల్లాల్లోని దేవాలయాల్లో వివిధ హోదాల్లో పని చేస్తున్న ఉద్యోగుల వివరాలను సేకరిస్తున్నారు. ఈ ఆరు జిల్లాల్లో నాలుగో తరగతి ఉద్యోగినుంచి కార్యనిర్వాహణ అధికారులు (ఈవోల) వరకు 1200 మందికిపైగా విధులు నిర్వహిస్తున్నారు. 2014లో తెలంగాణ ఏర్పడింది. అప్పటి నుంచి 2023 వరకు దేవాదాయ శాఖలో ఎలాంటి ఉద్యోగాలను కొత్తగా ఇచ్చారో తెలుసుకుంటున్నారు. ఇందుకుగాను దేవాదాయ శాఖ అధికారులు ఆయా ఆలయాల నిర్వాహకులకు ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు.

ఈవోలకు ఆదేశాలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రధాన ఆలయాల వివరాలను దేవాదాయ శాఖ అడిగింది, ఇప్పటికే ఈ సమాచారం దేవాదాయ శాఖకు చేరింది. దేవాదాయ శాఖ ఈ వివరాలను పరిశీలిస్తోంది. వీరి నియామకాలు ఎలా జరిగాయి? నోటిఫికేషన్ ద్వారా జరిగాయా? లేక దొడ్డిదారిన జరిగాయా? నియామకాల సందర్భంగా విద్యార్హతలు, రిజర్వేషన్, రోస్టర్ పాయింట్లు తదితర నిబంధనలను కచ్చితంగా పాటించారా? లేక ప్రజాప్రతినిధుల ఒత్తిళ్ల మేరకు తీసుకున్నారా? అన్న విషయాలను లోతుగా పరిశీలిస్తున్నారు.

అక్రమ నియామకాలు

ఉమ్మడి జిల్లాలో భక్తులు ఎక్కువ సంఖ్యలో వచ్చే, ఆదాయం కాస్త ఎక్కువగా ఉండే ఆలయాల్లో పదేళ్లకాలంలో నాలుగోతరగతి ఉద్యోగులుగా అనేకమంది నియామకం జరిగినట్టు తెలుస్తోంది. ముఖ్యంగా స్వీపర్లు, అటెండర్లు, జూనియర్ అసిస్టెంట్ల స్థాయిలో పైరవీల ద్వారా అనేక మంది నియమితులైనట్లు ఫిర్యాదులు ఉన్నాయి. సహాయ పూజారులుగా కూడా తాత్కాలిక పద్ధతిపై చాలా మంది నియమితులయ్యారు. వీరందరికీ దేవాలయానికి వచ్చే ఆదాయం నుంచే వేతనాలను చెల్లిస్తున్నారు. దీంతో ఆలయ నిర్వహణకు ఆదాయం సరిపోక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రధానంగా పాలక మండళ్ల చైర్మన్లు, సభ్యులు తమకు అనుకూలమైవారిని అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి నియామకాలు చేయించినట్టు ఆరోపణలు ఉన్నాయి. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లలో ఇలాంటి నియామకాలు జోరుగా జరిగాయి.



రెగ్యులర్ ఉద్యోగులతో పాటు అక్రమంగా నియామకమైనవారికి సైతం వేతనాలు చెల్లించే ఆర్థిక ఇబ్బందులు ఏర్పడుతుండడంతో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దీనిపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఈ నియామకాలపై ఆరా తీస్తోంది. దీంతో తీగలాగితే అవినీతి డొంక కదులుతున్నట్టు తెలుస్తోంది. అక్రమంగా నియామకమైన ఉద్యోగుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఆయా ఆలయ ఈవోలు పదేళ్లలో తమ ఆలయాల్లో ఎంతమంది నియామకమైంది వారి వివరాలన్నిటినీ దేవాదాయ శాఖకు నివేదికల రూపంలో సమర్పించారు.

అర్హత పత్రాల పరిశీలన


గతంలో చిన్న ఆలయాల ఉద్యోగులకు ఆ గుళ్లకు వచ్చే ఆదాయం నుంచి జీతాలను చెల్లించేవారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఇలాంటి ఉద్యోగులకు ప్రభుత్వమే ప్రత్యేక పద్దు నుంచి జీతాలను చెల్లిస్తోంది. ఈ మొత్తం వ్యవహారాలను సమగ్రంగా పరిశీలించేందుకు వాస్తవ సమాచారాన్ని రాబడుతున్నారు. ఇదే క్రమంలో సిబ్బంది అర్హత ధ్రువపత్రాలను, విజిలెన్స్ విభాగం పరిశీలిస్తున్నట్టు సమాచారం.


భద్రకాళి చెరువు పూడికతీత పనుల విహంగ చిత్రం

పనులు చకచకా..

హనుమకొండ భద్రకాళి చెరువులో పూడికతీత పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఏడు జోన్లుగా విభజించి చెరువు పూడిక తీస్తున్నారు. భద్రకాళి పూడికతీత, ఆలయ మాడ వీధుల పనులు ఆంధ్రజ్యోతి డ్రోన్ కెమెరాకు చిక్కాయి.

- హనుమకొండ స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి


భద్రకాళి ఆలయం చుట్టూ కొనసాగుతున్న మాడ వీధుల నిర్మాణ పనులు

మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడిగా రవికుమార్


ఎన్నికైన నూతన కార్యవర్గం

రెడ్డికాలనీ, మే 4 (ఆంధ్రజ్యోతి) : శ్రీ ఆంజనేయ మున్నూరుకాపు పరపతి సంఘం అధ్యక్షుడిగా కనుకుంట్ల రవికుమార్ ఎన్నికయ్యారు. హనుమకొండ పద్మాక్షి కాలనీలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. 2025-27 కాలానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె.రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా తోట ప్రకాశ్, కోశాధికారిగా కర్ర దశరథ్‌కుమార్, ఆడిటర్‌గా దేవులపల్లి సంపత్, కార్యవర్గ సభ్యులుగా సల్ల జనార్దన్, కొండ్ర సతీష్ కుమార్‌లు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా గండె కృష్ణ వ్యవహరించారు. హనుమాన్ జయంతి ఉత్సవాల కోసం యేటా రూ.75వేలు దేవాలయానికి ఇవ్వాలని ఏకగ్రీవంగా తీర్మానించారు.



పి.మాలిక
మెడికల్ ఆఫీసర్,
పీహెచ్‌సీ
వడ్డెపల్లి

ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యం

ఆంధ్రజ్యోతి : ఎండ తీవ్రత నుంచి ఎలా రక్షణ పొందాలి?
మెడికల్ ఆఫీసర్ : ఎండ తీవ్రత నుంచి రక్షణ పొందడానికి ఓఆర్ఎస్‌తో పాటు నీరు ఎక్కువగా తీసుకోవాలి.

ఆంధ్రజ్యోతి : ఎండలో బయటకు వెళ్లినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి?
మెడికల్ ఆఫీసర్ : ఎండలో బయటకు వెళ్లినప్పుడు తలకు కాటన్ క్లాత్ కట్టుకోవాలి. వాంతులు, విరేచనాలు, తలనొప్పి ఉంటే వైద్యులను సంప్రదించాలి.

ఆంధ్రజ్యోతి : పీహెచ్‌సీలో ఎంత మంది స్టాఫ్ ఉన్నారు?
మెడికల్ ఆఫీసర్ : పీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్, సీవో, 16 మంది ఆశా కార్యకర్తలు, 7 మంది ఏఎన్ఎంలు ఉన్నారు. ల్యాబ్ అసిస్టెంట్, స్టాఫ్ నర్సులు లేరు.

ఆంధ్రజ్యోతి : ఆస్పత్రి టైమింగ్స్ ఏమిటి?
మెడికల్ ఆఫీసర్ : ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు.

ఆంధ్రజ్యోతి : రోజూ ఓపీ పరీక్షలను ఎంత మందికి చూస్తారు?
మెడికల్ ఆఫీసర్ : ప్రతిరోజూ 70 నుంచి 100 మందికి ఓపీ పరీక్షలను నిర్వహిస్తాం.

- వడ్డెపల్లి (ఆంధ్రజ్యోతి)

అంధకారంలో 100 ఫీట్ల రోడ్డు

- కేయూ - సమ్మయ్యనగర్ రహదారిపై వీధిలైట్లు కరువు
- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

వడ్డెపల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని వడ్డెపల్లి, సమ్మయ్యనగర్ వరకు హైవేపై వీధి దీపాలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. ప్రమాదాలు జరుగుతున్నాయని వివిధ కాలనీల వాసులు బల్దియా అధికారులకు విజ్ఞాపన పత్రాలు సమర్పించుకున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వడ్డెపల్లి వంద ఫీట్ల రోడ్డు నుంచి సమ్మయ్యనగర్ వరకు వర్షాకాలంలో నివాస గృహాల్లోకి వరద నీరు చేరడంతో డక్ట్ అండర్ డ్రైయినేజీని ఏడాది కిందట నిర్మించారు. డక్ట్ నిర్మాణం సందర్భంగా అంతకు ముందు డివైడర్ల మధ్య ఉన్న స్ట్రీట్ లైట్ల స్తంభాలను తొలగించారు. డక్ట్ డ్రైయినేజీ పూర్తయి ఆరు నెలలు దాటినప్పటికీ డివైడర్ల మధ్య సెంట్రల్ లైటింగ్ సిస్టాన్ని ఏర్పాటు చేయలేదు. వీధి లైట్లను అమర్చకపోవడం వలన హైవేకు ఇరువైపులా ఉన్న అమరావతినగర్, వివేక్‌నగర్ కాలనీ, సమ్మయ్యనగర్, ప్రగతినగర్, కుడా కాలనీతోపాటు వివిధ కాలనీల ప్రజలు రాత్రివేళల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం వేలాది వాహనాలు రేయింబవళ్లు సంచరించే హైవేపై వీధిలైట్లు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వివిధ కాలనీల వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలల కాలంలోనే ఐదు రోడ్డు ప్రమాదాలు జరిగి ఇద్దరు మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా వరంగల్ మహా నగరపాలక సంస్థ అధికారులు స్పందించి హైవేపై నిర్మించిన డివైడర్ల మధ్య స్తంభాలను ఏర్పాటు చేసి వీధి దీపాలను అమర్చాలని ప్రజలు కోరుతున్నారు.


సమ్మయ్యనగర్, వివేక్‌నగర్ హైవే డివైడర్ల మధ్య ఏర్పాటు చేయని వీధిలైట్లు

వీధిలైట్లు వెంటనే ఏర్పాటు చేయాలి

మీసాల రమేష్, వివేక్‌నగర్ కాలనీ



వడ్డెపల్లి శ్యామల గార్డెన్ నుంచి అమరావతి నగర్, వివేక్ నగర్, సమ్మయ్య నగర్, ప్రగతినగర్ వరకు హైవే డివైడర్ల మధ్య స్తంభాలు ఏర్పాటు చేయాలి. స్తంభాలకు వీధి లైట్లు అమర్చి ప్రమాదాలు జరగకుండా నియంత్రించాలి. రోడ్డుకు ఇరువైపులా ప్రమాదాలను సూచించే సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలి.

ప్రజల ఆకాంక్షలను మీడియా నెరవేర్చాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌డీఎల్‌సీఈ డైరెక్టర్ సురేశ్‌లాల్

కేయూ క్యాంపస్, మే 4 (ఆంధ్రజ్యోతి) : ప్రజల ఆకాంక్షలను మీడియా నెరవేర్చాలని కేయూ ఎస్‌డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ అన్నారు. ఆదివారం కేయూ ఎస్‌డీఎల్‌సీఈలో 2022-24 ఏడాది ఫైనల్ ఇయర్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం జర్నలిజం విభాగాధిపతి డాక్టర్ సంగాని మల్లేశ్వర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సురేశ్‌లాల్ హాజరై మాట్లాడారు. సమాజ రుగ్మతలను రూపుమాపేందుకు జర్నలిజం కృషి చేయాలని అన్నారు. బీఆర్ అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ పీఆర్‌వో వేణుగోపాల్‌రెడ్డి, స్టాఫ్ ట్రైనింగ్ డైరెక్టర్ వెంకటరమణలు మాట్లాడుతూ.. జర్నలిస్టులు బాధ్యతగా వ్యవహరించాలని పేర్కొన్నారు. సంగాని మల్లేశ్వర్ మాట్లాడుతూ.. జర్నలిజంలో ఉజ్వల ఉద్యోగ, ఉపాధి అవకాశాలున్నాయని చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు కంజర్ల నరసింహరాములు, పెరుమాండ్ల వెంకటేశ్వర్లు, ఈర్ల సురేందర్, చిరంజీవి, డాక్టర్ శంకర్, సిబ్బంది ప్రణబ్, ఈర్ల కుమార్, దుబాసి రవీందర్, బి.కమలాకర్, పున్నం చందర్, సునిత, మహోన్నత, కె.బాబురావు, లోకేశ్ పాల్గొన్నారు.

మర్కజీలో ముగిసిన వేసవి శిక్షణా శిబిరం


శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న వక్తలు

హనుమకొండ, మే 4 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ మర్కజీ ఉన్నత పాఠశాలలో ఏప్రిల్ 30వ తేదీ నుంచి ఐదు రోజుల పాటు నిర్వహించిన వేసవి శిక్షణా శిబిరం ఆదివారం ఘనంగా ముగిసింది. జనవిజ్ఞానవేదిక, మర్కజీ ఉన్నత పాఠశాల సంయుక్తాధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరానికి విద్యార్థుల నుంచి మంచి స్పందన లభించింది. ముగింపు కార్యక్రమానికి జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు కాజీపేట పురుషోత్తం అధ్యక్షత వహించారు. ఈ శిబిరంలో భాగంగా పాటలు, నృత్య, ఉపన్యాస, చిత్రలేఖణ, చదరంగం పోటీల్లో ప్రతిభ కనబరించిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. సర్టిఫికెట్లను అందచేశారు. చివరన శాస్త్రవేత్తలతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలు, సందేహాలను నిట్ ప్రొఫెసర్లు సీబీ రామారావు, ఎల్.ఆంజనేయులు, సుమలత నివృత్తి చేశారు. ముగింపు కార్యక్రమంలో మర్కజీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు కిరణ్, లింగమూర్తి, జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి రామంచ భిక్షపతి, టీచర్ విద్యా, రిసోర్స్ పర్సన్లు వి.శ్రీనివాస్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

బుంగ జ్యోతిరమణకు డాక్టరేట్


జ్యోతిరమణకు గౌరవ డాక్టరేట్ అవార్డును ప్రదానం చేస్తున్న గౌరీశంకర్

వడ్డెపల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని త్యాగరాయ గాన సభ ఆడిటోరియంలో తెలుగు సంస్కృతి సాహితీ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం గౌరవ డాక్టరేట్ల ప్రదానోత్సవాన్ని నిర్వహించారు. ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ సంస్థలో గవర్నర్‌గా ప్రజలకు విశిష్ట సేవలను అందించినందుకు గాను హనుమకొండ పట్టణానికి చెందిన బుంగ జ్యోతిరమణకు గౌరవ డాక్టరేట్ అవార్డుతో పాటు ప్రశంసా పత్రాన్ని ట్రస్టు చైర్మన్ గౌరీశంకర్ ప్రదానం చేశారు. ఈ అవార్డు రావడంతో తనకు మరింత బాధ్యత పెరిగిందని బుంగ జ్యోతిరమణ పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, మే 4 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా నగరంలో పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. మడికొండ సబ్‌స్టేషన్ పరిధిలోని తరాలపల్లి, రాంపేటలో ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు, బాలసముద్రం సబ్‌స్టేషన్ పరిధిలోని ఏనుగులగడ్డ, న్యూబస్టాండ్ చౌరస్తా, పింజర్ల స్ట్రీట్ ఏరియాలో ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని డీఈ పేర్కొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

▸▸ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్


సమావేశంలో మాట్లాడుతున్న దాస్యం వినయ్‌భాస్కర్

వడ్డెపల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు కార్మిక కోడ్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20న నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ కార్మికులకు పిలుపునిచ్చారు. ఆదివారం హనుమకొండ వడ్డెపల్లిలోని నివాసంలో కార్మికులతో కలిసి నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులపట్ల కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాలని హితవు పలికారు. అసంఘటిత, సంఘటిత కార్మికుల సంక్షేమం కోసం అధికారంలో ఉన్నా లేకున్నా తాను కృషి చేస్తానని స్పష్టం చేశారు. పదేళ్లుగా వివిధ కార్మిక చైతన్య కార్యక్రమాలు చేపడుతూ వారికి అండగా నిలుస్తూ సామాజిక న్యాయం కోసం కృషి చేశానని స్పష్టం చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ కార్మిక విభాగం నాయకులు నాయిని రవి, ఎంజాల మల్లేశం, ఇసంపెల్లి సంజీవ, రవీందర్‌రెడ్డి, కాటపురం రాజు, రఘుపతి రెడ్డి, భిక్షపతి, సిద్ధిఖీ, గొర్రె విజయ్ , రఘు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల సాధనకు సంఘటితంగా పోరాడాలి

- మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్


బీఆర్ఎస్ కార్యాలయంలో కార్మిక సంక్షేమ మాసోత్సవం లోగోను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్

హనుమకొండ టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి) : అసంఘటిత రంగంలో పని చేస్తున్న కార్మికుల హక్కుల సాధనకు సంఘటితంగా పోరాడాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ పిలుపునిచ్చారు. ఆదివారంహనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బీఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర కౌన్సిల్ తీర్మానాలను బలపరుస్తూ పలు తీర్మానాలు చేసి, కార్మిక సంక్షేమ మాసోత్సవం లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. ఈ నెలలో జరిగే ఆర్టీసీ ఉద్యోగ, కార్మికుల సమ్మెకు మద్దతును ప్రకటించారు మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయిని రవి, ఇంజాల మల్లేశం, రవీందర్‌రెడ్డి, ఎండి ఇస్మాయిల్, రమేష్, బాబురావు, నరహరి, శివకుమార్, రఘు తదితరులు పాల్గొన్నారు.

అనంతసాగర్ మాటు చెరువు కాలువ కబ్జా

- కాలువ కట్టను ధ్వంసం చేసి మొరం తరలింపు
- చోద్యం చూస్తున్న ఐబీ, రెవెన్యూ అధికారులు


మొరం డంప్ చేస్తున్న ట్రాక్టర్


మాటు కాలువ కట్టను ధ్వంసం చేసిన ప్రదేశం

హసన్‌పర్తి, మే 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ప్రత్యేకంగా ధర్మసాగర్ రిజర్వాయర్ నుంచి ఎల్లాపూర్ వరకు సాగునీటి పంపిణీని కాలువల(ఫీడర్ చానల్) ద్వారా శ్రీకారం చుట్టింది. అయితే కొంత మంది వ్యాపారులు, రియల్టర్లు స్వప్రయోజనాల కోసం చెరువులు, కుంటలే కాకుండా ఫీడర్ చానల్ కాలువలను సైతం కబ్జా చేసి అన్నదాతలకు చుక్కలు చూపెడుతున్నారు. చెరువులు, కుంటలు, ఫీడర్ చానళ్లు, పంట కాలువలకు కబ్జాకు గురి కాకుండా చూడాల్సిన ఐబీ, రెవెన్యూ అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరించడంతో అన్నదాతలకు గోస తప్పడం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ధర్మసాగర్ రిజర్వాయర్ నుంచి మడిపల్లి చెరువు ద్వారా అనంతసాగర్ మాటు చెరువు, ఎల్లాపూర్ గొలుసు కట్టు చెరువుకు ప్రత్యేకంగా ఫీడర్ చానెల్ ఉంది. ఈ ఫీడర్ చానెల్ ద్వారా ధర్మసాగర్ రిజర్వాయర్ నుంచి మడిపల్లి, అనంతసాగర్‌తో పాటు ఎల్లాపూర్ పెద్ద చెరువులోకి సాగునీరు చేరుతోంది. దీంతో ఆయా గ్రామాల రైతులకు వ్యవసాయ సాగుకు నీరందుతుంది. అయితే ఇటీవల భూముల ధరలకు రెక్కలు రావడంతో అనంతసాగర్ మాటు చెరువు నుంచి ఎల్లాపూర్ పెద్ద చెరువు వరకు గల ఫీడర్ చానల్‌ను కొంతమంది కబ్జాదారులు తమ స్వప్రయోజనం కోసం కాలువ పక్కనే ఉన్న కట్టను ధ్వంసం చేసి మొరం తరలింపునకు పాల్పడుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఫీడర్ చానల్ పర్యవేక్షణ చేయాల్సిన ఐబీ, రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులకు సాగునీటి పంపిణీకి ఇబ్బందికరంగా మారిందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ క్రమంలోనే అనంతసాగర్ మాటు చెరువు నుంచి ఎల్లాపూర్ పెద్ద చెరువు వరకు గల ఫీడర్ చానల్ (కాలువ కట్ట)ను ధ్వంసం చేస్తూ పౌల్ట్రీ నిర్వాహకుడు మొరం తరలిస్తున్నట్లు స్థానిక రైతులు సంబంధిత ఐబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే ఈ ఫీడర్ చానల్ ఎల్కతుర్తి సర్కిల్ కిందకు రావడంతో చింతగట్టు ఐబీ ఇంజనీరింగ్ అధికారులు సంబంధిత ఎల్కతుర్తి సర్కిల్ అధికారులకు సమాచారం అందించారు. అయితే ఈ ఫీడర్ చానల్ ధ్వంసం చేసి మొరం తరలించడంవల్ల ఫీడర్ చానెల్ బలహీన పడి రైతులకు సాగునీటి పంపిణీలో ఇబ్బందులు తలెత్తుతాయని తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఐబీ, రెవెన్యూ అధికారులు సమన్వయంతో మాటు చెరువు ఫీడర్ చానల్‌ను కాపాడాలని ఎల్లాపూర్, అనంతసాగర్ గ్రామాల రైతులు కోరుతున్నారు.

బీజేపీ డివిజన్ అధ్యక్షులు, కౌన్సిల్ సభ్యుల నియామకం

రాంనగర్, మే 4 (ఆంధ్రజ్యోతి) : సంస్థాగత నియామకాల్లో భాగంగా గతంలో పెండింగ్‌లో ఉన్న 7 డివిజన్ల అధ్యక్షులతో పాటు జిల్లా కౌన్సిల్ సభ్యులను బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి ఆదివారం ప్రకటించారు. 8వ డివిజన్ అధ్యక్షుడిగా ఇప్పుడు రాకేశ్, 10వ డివిజన్ అధ్యక్షుడిగా ఉడుతల మురళి, 30వ డివిజన్ అధ్యక్షుడిగా నూకల ఉషాదేవి, 51వ డివిజన్ అధ్యక్షుడిగా డి.శివరెడ్డి, 53వ డివిజన్ అధ్యక్షుడిగా పెరుమాండ్ల రామకృష్ణ, 58వ డివిజన్ అధ్యక్షుడిగా నద్దునూరి మోహన్‌దాసు, 59వ డివిజన్ అధ్యక్షుడిగా వైల జితేందర్‌ను నియమించగా, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా బొమ్మసాని అనిల్, నాసం కరుణ, కెతపల్లి సంపత్‌రెడ్డి, గుండ్ల శ్రీనువాస్, జంపాల పూర్ణచందర్, జన్ను మధు, పి. రాంరెడ్డిలను నియామకం చేశారు.

నేడు బల్దియాలో ప్రజావాణి కార్యక్రమం

వరంగల్ కార్పొరేషన్, మే 4 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు ప్రతీ వారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం సోమవారం జరుగనుందని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆమె వెల్లడించారు. ప్రజల సమస్యలు వెల్లడించేందుకు ఉదయం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయానికి వచ్చి ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. ప్రజావాణిలో సం బంధిత అధికారులు బాధితుల ఫిర్యాదులు పరిష్కరించి తగిన పరిష్కారం చూపిస్తారని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే తెలిపారు.

పూర్వ విద్యార్థుల రజతోత్సవ సమ్మేళనం


సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

మడికొండ, మే 4 (ఆంధ్రజ్యోతి) : మడికొండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999 - 2000 విద్యాసంవత్సరంలో పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల రజతోత్సవ సమ్మేళనం ఆదివారం చిలుపూర్ మండలం రాజవరం గ్రామంలోని తన్మయ ఫార్మ్ రిసార్ట్‌లో ఘనంగా జరిగింది. 25 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులంతా ఒకే వేదికపై చేరి ఆత్మీయతతో ఒకరినొకరు పలుకరిచుకొని అలనాటి మధురస్మృతులను నెమరువేసుకున్నారు. కుటుంబ నేపథ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పొనగోటి వెంకట్రావు, కోన మారుతి, నర్రా శ్రీనివాస్, పేర్ల సురేష్, బన్న శ్రీనివాస్, కొమురవెల్లి నరేష్, శ్రీనివాస్, లక్ష్మణ్‌రాజ్, సుమలత పాల్గొన్నారు.

చిన్నతనంలోనే పెద్ద కష్టం

- తండ్రి మృతితో మీదపడిన కుటుంబ భారం
- 14 ఏళ్లకే హెల్త్‌కేర్ జ్యూస్ పాయింట్ ఏర్పాటు
- ఇంటర్ విద్యనభ్యసిస్తూ స్వయం ఉపాధి


పచ్చి కూరగాయల జ్యూస్ తయారు చేస్తున్న రాజునాయక్

వరంగల్ కార్పొరేషన్, మే 4 (ఆంధ్రజ్యోతి): ఆ యువకుడికి పేదరికం చిన్నప్పటి నుంచి వేటాడుతూనే ఉంది. ఒక వైపు చదువు.. మరో వైపు స్మాల్ స్కేల్ ఇండస్ట్రీ ఏర్పాటు చేసుకుని నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాడు అముగోతు రాజునాయక్. చిన్నతం నుంచి కుటుంబ భారాన్ని మోస్తూ ఆత్మస్థైర్యంతో ముందుకుసాగుతున్నాడు. 14 ఏళ్లు నిండక ముందే కాకతీయ యూనివర్సిటీ మైదానంలో హెల్త్‌కేర్ జ్యూస్ పాయింట్ (పచ్చి కూరగాయల) ఏర్పాటు చేసి వెజిటెబుల్ జ్యూస్ తయారుచేయగా వచ్చిన కొద్ది పాటి ఆదాయంతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు.

వరంగల్ జిల్లా సంగెం మండలం నల్లబెల్లి గ్రామ శివారులోని బాల్‌నాయక్‌తండాకు చెందిన రాజునాయక్.. ప్రస్తుతం హనుమకొండ పోచమ్మకుంటలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని రోజు వారిగా వచ్చే ఆదాయంతో ఇంటిల్లిపాదిని పోషిస్తున్నాడు. మూడేళ్ల కిందట తండ్రి కిషన్ అనారోగ్య కారణంతో మృతి చెందాడు. దీంతో తల్లి దినసరి కూలీగా పని చేస్తూ పిల్లలను పోషించేది. ఇద్దరు కూతుర్లు ఉండగా ఉన్న కాస్త వ్యవసాయ భూమి విక్రయించి పెళ్లిళ్లు చేసింది. కొద్దిరోజుల తర్వాత తల్లికి కూడా అనారోగ్యం వెంటాడడంతో 14 ఏళ్ల ప్రాయంలోనే రాజుపై కుటుంబ భారం మీదపడింది. తల్లితోపాటు రెండేళ్ల కిందట హనుమకొండ పోచమ్మకుంటలో ఓ ఇంట్లో అద్దెకు దిగారు.


కేయూ వాకర్స్‌కు జ్యూస్ విక్రయిస్తున్న రాజునాయక్

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. ఈ క్రమంలో కేయూలో హెల్త్‌కేర్ జూస్‌పాయింట్ ఏర్పాటు చేశాడు. గుమ్మడికాయ, సొరకాయ, బీట్‌రూట్, క్యారెట్, కాకరకాయ, ఆవకాడ, గోధుమగడ్డితో జ్యూస్ చేయడం ప్రారంభించాడు. ప్రతీ రోజు ఖర్చు రూ.1000 పోగా, రూ.300 మిగులుతాయని వెల్లడించాడు. అయితే తనకు పోలీసు ఆఫీసర్ కావాలని ఉందని, మంచి చదువులు చదివి పోలీసుశాఖలో పని చేస్తానని రాజు ధీమా వ్యక్తం చేస్తున్నాడు.

నీట్ అభ్యర్థులకు చల్లని నీరు అందజేత


చల్లని నీరు అందజేస్తున్న వ్యక్తులు

రాంనగర్, మే 4 (ఆంధ్రజ్యోతి) : మండుటెండల్లో నీట్ పరీక్షకు హాజరయ్యేందుకు వచ్చిన నీట్ అభ్యర్థులతో వారి తల్లితండ్రులకు చల్లని నీరు అందించి తమ ఉదారతను చాటుకున్నారు వరంగల్‌కు చెందిన శంకర్, లోకేశ్ అనే ఇద్దరు వ్యక్తులు. ఆర్ట్స్ కళాశాల పరీక్ష కేంద్రం వద్ద తన కారు వెనుకాల కూల్ క్యాన్‌లు పెట్టుకొని అభ్యర్థులకు, వారి తల్లితండ్రులకు అందజేశారు. ఈ సందర్భంగా దాహార్తి తీర్చుకున్న ప్రతీ ఒక్కరు ఆ ఇద్దరికి కృతజ్ఞతలు తెలిపారు.

హైదరాబాద్‌లో వృద్ధ దంపతుల హత్య

» తలలు పగలగొట్టి, రూ.లక్ష, పుస్తెలతాడు దోపిడీ


కనకయ్య, రాజమ్మ(ఫైల్)

అల్వాల్, మే 4 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని అల్వాల్‌లో వృద్ధ దంపతులు దారుణ హత్యకు గురయ్యారు. వారి ఇంట్లో ఉండాల్సిన రూ.లక్ష నగదు, వృద్ధురాలి మెడలోని బంగారు పుస్తెలతాడు మాయవ్వడంతో ఈ హత్య తెలిసిన వారి పనేనని పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మండలం మానిక్యారం గ్రామానికి చెందిన కనకయ్య(70), రాజమ్మ(65) దంపతులు అల్వాల్‌లోని సూర్యానగర్ కాలనీలో మూడేళ్లుగా నివాసముంటున్నారు. కనకయ్య స్థానికంగా నిర్మాణంలో ఉన్న ఒక భవనానికి వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. నాలుగు రోజుల క్రితం స్వగ్రామానికి వెళ్లి తిరిగొచ్చిన కనకయ్య.. స్థానికంగా వడ్డీలకు తిప్పేందుకు రూ.లక్ష తెచ్చాడు. ఈ విషయాన్ని తన పని ప్రదేశంలో మేస్త్రీతోపాటు పలువురికి చెప్పాడు. శనివారం రాత్రి ఇంట్లో నిద్రించిన కనకయ్య దంపతులు హత్యకు గురయ్యారు. ఆదివారం ఉదయం ఆ ఇంటికి వచ్చిన కుమార్తె లత తల్లిదండ్రులు విగతజీవులుగా ఉండటాన్ని గమనించింది. మంచంపై నిద్రిస్తున్న ఇద్దరి తలలపై దొడ్డు కర్రతో కొట్టినట్లు బలమైన గాయాలు ఉన్నాయి. డబ్బు కోసం తెలిసిన వారే ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారని భావిస్తున్నారు.

ఆయువు తీసిన అనుమానం

» భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్య


లక్ష్మి (ఫైల్)

జీడిమెట్ల, మే 4 (ఆంధ్రజ్యోతి): భర్త అనుమానంతో వేధింపులకు గురిచేస్తుండడంతో మనస్తాపం చెందిన భార్య ఐదంతస్తుల భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన హైదరాబాద్ సుభాష్‌నగర్‌లోని ఓ అపార్టుమెంటులో ఆదివారం జరిగింది. శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరుకు చెందిన లక్ష్మి అలియాస్ పూజ (25)కు అదే జిల్లా సోంపేటకు చెందిన హరికృష్ణతో గత సంవత్సరం డిసెంబర్ 14న వివాహం జరిగింది. జీడిమెట్లలోని ఓ ప్రైవేట్ కంపెనీలో హరికృష్ణ పనిచేస్తున్నాడు. డిగ్రీ వరకు చదువుకున్న లక్ష్మి తన మేన బావను ప్రేమించింది. అయితే రెండు కుటుంబాల మధ్య వైరం ఉండటంతో వీరి ప్రేమను పెద్దలు అంగీకరించలేదు. ఆమె తల్లిదండ్రులు అకౌంటెంట్‌గా పనిచేస్తున్న హరికృష్ణతో వివాహం జరిపించారు. లక్ష్మి తన బావను ప్రేమించిన విషయం హరికృష్ణకు తెలియడంతో పెళ్లి అయినప్పటి నుంచి అనుమానంతో ఆమెను వేధింపులకు గురిచేస్తుండేవాడు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో లక్ష్మి ఐదంతస్తుల భవనంపై నుంచి కిందపడి మృతి చెందింది. లక్ష్మి మృతికి సంబంధించి ఆమె భర్త పాత్రపై స్థానికంగా పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

ప్రేమ జంట ఆత్మహత్య

రాజాపూర్, మే 4(ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చిన్నరేవల్లి గ్రామంలో ప్రేమ జంట ఆత్మహత్య చేసుకుంది. ఇద్దరూ మైనర్లేనని ఎస్ఐ శివానందం తెలిపారు. చిన్నరేవల్లికి చెందిన యువకుడు(17), అతడి కంటే 6 నెలలు పెద్దదైన యువతి కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. పెళ్లి వయసు వచ్చి, ఆర్థికంగా స్థిరపడిన తరువాత పెళ్లి చేస్తామని కుటుంబసభ్యులు, గ్రామస్థులు వారికి నచ్చచెప్పారు. అయితే ఆదివారం యువతి ఇంట్లో చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న యువకుడు మొదంపల్లి గ్రామ శివారులోని పశువుల కొట్టంలో ఉరేసుకున్నాడు.

ఫోరెన్సిక్ ల్యాబ్‌లలో సిబ్బంది కొరత!

అందుబాటులో లేని సైంటిస్టులు

» సైబర్ ఫోరెన్సిక్‌కు డిమాండ్.. ఫోరెన్సిక్ సైన్స్‌కు విద్యార్థుల కొరత

హైదరాబాద్, మే 4(ఆంధ్రజ్యోతి): క్లిష్టమైన క్రిమినల్ కేసుల్లో.. ఫోరెన్సిక్ విశ్లేషణ అత్యంత కీలకం..! నేరస్తులకు కోర్టుల్లో శిక్ష పడాలంటే.. పోలీసుల దర్యాప్తుతోపాటు.. ఫోరెన్సిక్ నివేదికల ప్రాముఖ్యత అంతా ఇంతా కాదు..! రేప్ కేసుల్లో నిందితుల వీర్యకణాల విశ్లేషణ, డీఎన్ఏ పరీక్షలు.. దొంగతనాలు/దోపిడీలు, హత్య కేసుల్లో వేలిముద్రల విశ్లేషణ, తూటా ఏ తుపాకీ నుంచి వచ్చిందో గుర్తించడం, నేరం చేసేందుకు నిందితులు ఉపయోగించిన వాహనం టైరు గుర్తు దొరికినా.. చివరికి నేరస్తుల తల వెంట్రుక, ఉమ్మి, లాలాజలం లభించినా.. కేసు మిస్టరీని ఛేదించడంలో ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్(ఎఫ్ఎస్ఎల్) పాత్ర ఎనలేనిది..! ఇంటర్నెట్‌లో వెతికి మరీ.. పోలీసులకు చిక్కకుండా ఉండేలా నిందితులు నేరాలకు పాల్పడుతుంటే.. 'కానూన్ కా హాథ్ లంబా హోతాహై' అంటూ ఎఫ్ఎస్ఎల్ బృందాలు నిరూపించిన కేసులెన్నో..! అయితే.. అంతటి కీలకమైన ఎఫ్ఎస్ఎల్‌తో పాటు.. జిల్లా ఫోరెన్సిక్ ల్యాబ్‌లలో సిబ్బంది కొరతతో కేసులు పేరుకుపోతున్నాయి. కేంద్ర ఎఫ్ఎస్ఎల్ మొదలు.. జిల్లా స్థాయి వరకు దేశంలో మొత్తం 711 ల్యాబ్‌లు ఉండగా.. వాటిల్లో 50% సిబ్బంది లేకపోవడం గమనార్హం..! దేశవ్యాప్తంగా ఉన్న ల్యాబ్‌లకు ఏటా 5 లక్షల దాకా కేసులు వెళ్తుండగా.. సిబ్బంది కొరత కారణంగా నివేదికల్లో తీవ్ర జాప్యం నెలకొంటోంది. దేశవ్యాప్తంగా.. తెలంగాణలో 91%, బిహార్‌లో 85%, ఉత్తరాఖండ్‌లో 80% మేర ఫోరెన్సిక్ సైంటిస్టుల కొరత ఉన్నట్లు ఇటీవల విడుదలైన 'ఇండియా జస్టిస్-2025' నివేదిక స్పష్టం చేసింది.

ఈ పరీక్షలు కీలకం

క్రిమినల్ కేసులకు సంబంధించి బయాలజీ, సీరాలజీ, డీఎన్ఏ, టాక్సికాలజీ, కెమిస్ట్రీ, లిక్కర్, నార్కొటిక్స్, ఎక్స్‌ప్లోజివ్స్, బాలిస్టిక్స్ వంటి పరీక్షలను ఫోరెన్సిక్ సైన్స్ లాబరేటరీల్లో నిర్వహిస్తారు. పైన పేర్కొన్న పరీక్షలకు ఒక్కో విభాగానికి కనీసం ఒక నిపుణుడైన సైంటిస్టు సేవలు అవసరం. ఇవేకాకుండా.. ఫొటోగ్రఫీ, ఆర్ఎన్ఏ, సైబర్ ఫోరెన్సిక్ పరీక్షలకు కూడా నిపుణుల అవసరం ఉంటుంది. తెలంగాణ ఫోరెన్సిక్ సైన్స్ లాబరేటరీలో కొన్నేళ్లుగా రిక్రూట్‌మెంట్లు లేకపోవడంతో భారీగా ఖాళీలు పేరుకుపోయాయి. పదవీ విరమణ చేసిన వారి స్థానంలో నియామకాలు చేపట్టకపోవడంతో వేల సంఖ్యలో ఎఫ్ఎస్ఎల్ నివేదికలు పెండింగ్‌లో పడ్డాయి. గతంలో ఎఫ్ఎస్ఎల్‌కు డైరక్టర్లుగా సీనియర్ సైంటిస్టులను నియమించేవారు. ప్రస్తుతం ఏపీ ప్రభుత్వ సలహాదారుగా ఉన్న గాంధీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎఫ్ఎస్ఎల్ డైరక్టర్‌గా పనిచేసిన వారే..! ఆయన తర్వాత ఆ స్థాయిలో సైంటిస్టులను డైరక్టర్లు చేయకుండా సీనియర్ ఐపీఎస్ అధికారులకు ఎఫ్ఎస్ఎల్ అదనపు బాధ్యత అప్పగిస్తూ వస్తున్నారు.

ఒక అధికారి 4 పదవులు..

ప్రస్తుతం తెలంగాణ ఎఫ్ఎస్ఎల్‌కు సీనియర్ ఐపీఎస్ అధికారి షికాగోయల్ ఇన్‌చార్జిగా ఉన్నారు. వాస్తవానికి ఆమె సీఐడీ డీజీగా బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. దాంతోపాటు.. మహిళా భద్రత విభాగం, సైబర్ సెక్యూరిటీ బ్యూరో, ఎఫ్ఎస్ఎల్‌కు ఇన్‌చార్జిగా ఉండడం గమనార్హం..! ఒక అధికారి నాలుగు కీలకమైన బాధ్యతలను నిర్వర్తించడం దాదాపు అసాధ్యమే..!

విద్యార్థుల వెనుకంజ.. భవిష్యత్ ఏమిటి?

ఫోరెన్సిక్ సైంటిఫిక్ ఆఫీసర్‌గా నియమితులు అవ్వాలంటే బీఎస్సీలో ఫోరెన్సిక్ సైన్స్ కోర్సు, లేదా బయాలజీ, జెనెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ విభాగాల నుంచి డిగ్రీ పూర్తిచేయాల్సి ఉంటుంది. వీటిలో నైపుణ్యత సాధిస్తే.. ఎఫ్ఎస్ఎల్‌కు సంబంధించిన డీఎన్ఏ విశ్లేషణ, టాక్సికాలజీ, బాలిస్టిక్ సైంటిస్టులు అవ్వవచ్చు. క్రిమినాలజీ కోర్సు పట్టా ఉన్నా సరే.. బీటెక్ విద్యార్థులు అయితే సైబర్ ఫోరెన్సిక్ లేదా డిజిటల్ ఫోరెన్సిక్స్ కోర్సుల్లో చేరితే వీరికి సైబర్ క్రైం విభాగాల్లో పనిదొరకుతుంది. ఇన్ని అవకాశాలున్నప్పటికీ, సైన్స్ రంగానికి సంబంధించిన కోర్సుల్లో చేరడానికి విద్యార్థులు ముందుకు రాకపోవడంతో చాలా కాలేజీల్లో సీట్లు ఖాళీగా ఉంటున్నాయి. చేరిన అతికొద్ది మంది సైన్స్ విద్యార్థులను ప్రైవేట్ రంగం ఎక్కువ జీతాలిచ్చి తమ వైపు తిప్పుకొంటోంది. దీంతో.. ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌ల భవిష్యత్ ఏమిటనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇక.. జాతీయ, రాష్ట్ర స్థాయుల్లో ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్సిటీలను ప్రారంభించాలన్న ప్రతిపాదనలు ఏళ్ల తరబడి పెండింగ్‌లోనే ఉంటున్నాయి. కేంద్ర, రాష్ట్ర స్థాయుల్లో ఫోరెన్సిక్ విభాగాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలన్న ప్రతిపాదనకు మోక్షం లభించకపోవడంతో.. ఫోరెన్సిక్ విభాగాలు పోలీసు గొడుగు నీడలోనే పనిచేస్తున్నాయి.

డిగ్రీ పరీక్షలు చేపట్టకపోవడం ప్రభుత్వ అసమర్థత

రేవంత్‌వి గాలి మాటలు: హరీశ్‌రావు



హైదరాబాద్, మే 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాకతీయ, శాతవాహన, తెలంగాణ, మహాత్మా గాంధీ, పాలమూరు యూనివర్సిటీల పరిధిలో ఏప్రిల్‌లో జరగాల్సిన డిగ్రీ పరీక్షలను నేటికీ చేపట్టకపోవడం ప్రభుత్వ అసమర్థతేనని మాజీమంత్రి హరీశ్‌రావు విమర్శించారు. డిగ్రీ కళాశాలలకు దాదాపు రూ.800 కోట్ల ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించక పోవడంతో 6 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందన్నారు. బడా కాంట్రాక్టర్లకు వేల కోట్ల బిల్లులు చెల్లిస్తారు కానీ విద్యార్థుల ఫీజు రియంబర్స్‌మెంట్ చెల్లించరా? అని ఆదివారం ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ పథకాన్ని ఇంకా మెరుగైన రీతిలో కొనసాగిస్తామని మేనిఫెస్టోలో ప్రకటించిన కాంగ్రెస్ ఇప్పుడు ఆ పథకాన్ని మరుగునపడేలా చేసిందన్నారు. విద్యాశాఖ మంత్రిగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లిస్తామని అసెంబ్లీలో చెప్పిన మాటలు గాలి మాటలయ్యాయని విమర్శించారు. రెండు నెలల్లో మొత్తం బకాయిలు చెల్లిస్తామని, కళాశాల యాజమాన్యాలకు ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క ఇచ్చిన హామీ నీటిమూటగా మారిందన్నారు. పరీక్షలు నిర్వహించాలని విద్యార్థులు ప్రభుత్వాన్ని వేడుకునే దుస్థితి రావడం ప్రభుత్వ పాలనా వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. సకాలంలో పరీక్ష నిర్వహించక పోవడంతో పీజీసెట్, లాసెట్, ఇతర పోటీ పరీక్షలు రాయడానికి మూడో సంవత్సరం విద్యార్థులు అర్హత కోల్పోతున్నారన్నారు.

రెండు కార్లపై కట్టెల లోడ్ లారీ బోల్తా

ఇద్దరికి గాయాలు, త్రుటిలో తప్పించుకున్న ముగ్గురు

బాధితులకు హరీశ్ రావు సాయం

కొండాపూర్, మే 4 (ఆంధ్రజ్యోతి): కట్టెల లోడ్‌తో వెళ్తున్న ఓ లారీ రెండు కార్లపై బోల్తా పడడంతో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా, ముగ్గురు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఈ ఘటన ఆదివారం సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మల్కాపూర్ సమీపంలో 65వ నెంబరు జాతీయ రహదారిపై జరిగింది. ఈ ప్రమాదంలో ఓ కారులో ప్రయాణిస్తున్న రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లికి చెందిన అరుణకు గాయాలు కాగా, ఆమె భర్త, ఇద్దరు కుమారులు త్రుటిలో తప్పించుకున్నారు. మరో కారులో ప్రయాణిస్తున్న హైదరాబాద్‌కు చెందిన వ్యక్తికి గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన సమయంలో జహీరాబాద్ వెళ్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు తన కాన్వాయ్ ఆపి సహాయక చర్యలు చేపట్టారు. స్థానికులు, సిబ్బందితో కలిసి కార్లలో ఇరుక్కుపోయిన వారిని బయటకు తీశారు. గాయపడిన ఇద్దరిని తన వాహనంలో ఎక్కించి ఆస్పత్రికి పంపించారు. ఎస్పీ, కలెక్టర్‌తో మాట్లాడి బాధితుల వైద్యానికి సాయం అందించాలని హరీశ్ రావు సూచించారు.

సోషల్ మీడియాలో ప్రేమ.. మోసంతో ముగింపు!

థాయ్‌లాండ్ అమ్మాయి.. చెన్నై అబ్బాయి..

ప్రేమ పేరుతో మోసగించిన యువకుడు

సొంత దేశానికి వెళ్లేందుకు వ్యభిచారం

బంజారాహిల్స్, మే 4 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో ఓ వ్యక్తి విదేశీ యువతిని మోసం చేశాడు. ప్రేమించానని చెప్పి మోజు తీరిన తర్వాత పత్తా లేకుండా పోయాడు. దీంతో దేశం కాని దేశంలో యువతి జీవితం తల్లకిందులైపోయింది. పోలీసుల కథనం ప్రకారం.. శ్రీనగర్‌కాలనీలోని ఓ ఇంట్లో వ్యభిచారం జరుగుతుందన్న సమాచారం అందుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు దాడులు నిర్వహించగా.. నిర్వాహకురాలితో పాటు థాయ్‌లాండ్ చెందిన అమ్మాయి బెంగాల్‌కు చెందిన యువతి దొరికారు. వారిని అదుపులోకి తీసుకుని థాయ్‌లాండ్ అమ్మాయిని ప్రశ్నించగా ఆమె ప్రేమికుడి చేతిలో మోసపోయిన విషయం వెలుగులోకి వచ్చింది. థాయ్‌లాండ్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన అమ్మాయి ఉద్యోగ అన్వేషణలో ఉండగా గతేడాది ఇన్‌స్టా లో చెన్నైకి చెందిన యువకుడితో పరిచయం ప్రేమకు దారి తీసింది. అయితే చెన్నైకి వస్తే మొత్తం తిప్పి చూపిస్తానని నమ్మబలికాడు. దీంతో ఆమె మార్చి 15న చెన్నైకి వచ్చింది. ఓ హోటల్ బుక్ చేసుకుని ఇద్దరు కొద్ది రోజులు కలిసి ఉన్నారు. అనంతరం యువకుడు ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకుని చెప్పా పెట్టకుండా వెళ్లిపోయాడు. హోటల్ బిల్లు కూడా కట్టలేదు. యువతి వద్ద డబ్బు లేకపోవడంతో థాయ్‌లాండ్ స్నేహితురాలికి ఫోన్ చేసి జరిగిన విషయాన్ని చెప్పింది. డబ్బు పంపిస్తే తిరిగి వస్తానని తెలిపింది. దీనికి స్నేహితురాలు తన వద్ద డబ్బు లేదని హైదరాబాద్‌కు వెళ్లి తనకు తెలిసిన వారి ద్వారా వ్యభిచారం చేసి డబ్బు సంపాదించుకోవచ్చని సలహా ఇచ్చింది. హోటల్ నిర్వాహకులను బతిమిలాడి నగరానికి వచ్చిన యువతి శ్రీనగర్‌లో పది రోజులుగా వ్యభిచారం చేస్తూ వరకు పోలీసులకు చిక్కింది.

అదుపుతప్పి కంటైనర్‌ను ఢీకొన్న కారు

ఇద్దరి మృతి, నలుగురికి గాయాలు

కీసర రూరల్, మే 4(ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్యపు డ్రైవింగ్ కారణంగా ఓ కారు అదుపుతప్పి కంటైనర్‌ను బలంగా ఢీకొట్టింది. ఆదివారం మేడ్చల్ జిల్లా కీసర వద్ద జరిగిన ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందగా నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. బోడుప్పల్ మేడిపల్లికి చెందిన ఆరుగురు పనిమీద శనివారం బీదర్ వెళ్లారు. తిరుగు ప్రయాణంలో కీసర మండలం రాంపల్లిదాయర వద్ద కారు అదుపుతప్పి ముందు వెళ్తున్న కంటైనర్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో కారు నడుపుతున్న యశ్వంత్ (25), పక్క సీట్లో కూర్చున్న చార్లెస్(25) మృతి చెందారు. వెనక సీట్లో కూర్చున్న మరో నలుగురికి గాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ అస్పత్రికి తరలించారు. కారును నడుపుతున్న యశ్వంత్ నిర్లక్ష్యపు డ్రైవింగ్ కారణంగానే ప్రమాదం జరిగినట్లు తెలిసిందని, ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

బిజినెస్

3,300కుపైగా కంపెనీల పేర్లు తొలగింపు!

కసరత్తు చేస్తున్న ప్రభుత్వం

న్యూఢిల్లీ: కంపెనీల చట్టం కింద నమోదైన కంపెనీల సంఖ్య తగ్గనుంది. ఎలాంటి వ్యాపార కార్యకలాపాలు లేనందున తమ పేర్లు తొలగించాలని 3,300కు పైగా కంపెనీలు కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు దరఖాస్తు చేశాయి. దీనిపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని వివిధ రాష్ట్రాల రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ (ఆర్ఓసీ) పత్రికల్లో నోటిఫికేషన్లు జారీ చేశాయి. కంపెనీల చట్టంలోని సెక్షన్ 248 (2) ప్రకారం ఏదైనా కంపెనీ నమోదైన ఏడాదిలోగా వ్యాపారం ప్రారంభించకపోయినా లేదా ఒక ఆర్థిక సంవత్సరం తర్వాత వరుసగా రెండేళ్ల పాటు ఎలాంటి వ్యాపార కార్యకలాపాలు చేయకపోయినా ఆ కంపెనీ తమ పేరును రికార్డుల నుంచి తొలగించమని కోరవచ్చు. అయితే అందుకు వాటాదారుల్లో 75 శాతం మంది ఆమోదం కావాలి.

మహారాష్ట్ర నుంచే ఎక్కువ: తమ పేర్లను రికార్డుల నుంచి తొలగించమని మహారాష్ట్ర నుంచే ఎక్కువ కంపెనీలు కోరాయి. ఆ రాష్ట్రం నుంచి దీనికి సంబంధించి 700కు పైగా కంపెనీల నుంచి విజ్ఞప్తులు అందాయి. ఢిల్లీ (500+) కర్ణాటక (350+) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. గుజరాత్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ నుంచి కూడా రెండేసి వందల కంపెనీలు ఇందు కోసం విజ్ఞప్తి చేశాయి. ఈ ఏడాది మార్చి నెలాఖరు నాటికి దేశంలో 28,52,449 కంపెనీలు నమోదై ఉండగా అందులో 18,50,932 కంపెనీలు మాత్రమే చురుగ్గా పని చేస్తున్నాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



5వ తేదీ			
హైదరాబాద్	465	విజయవాడ	500
వరంగల్	467	గోదావరి	475
చిత్తూరు	543	విశాఖపట్నం	480
		డజను గుడ్లు రూ. 60	

ఐఎంఎఫ్ ఈడీ కేవీ సుబ్రమణియన్‌పై వేటు



పాక్‌పై ఆర్థిక యుద్ధం మరింత తీవ్రం చేసేందుకే..

న్యూఢిల్లీ: పాకిస్థాన్‌పై ఆర్థిక యుద్ధాన్ని కేంద్ర ప్రభుత్వం మరింత తీవ్రం చేసింది. అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్)లో మన దేశం తరపున ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ)గా ఉన్న కేవీ సుబ్రమణియన్‌ను కేంద్ర ప్రభుత్వం ఆకస్మికంగా తొలగించింది. ఆయన పదవీ కాలం ఇంకా ఆరు నెలలు ఉండగానే ప్రభుత్వం ఆయనపై వేటు వేసింది. వాస్తవానికి సుబ్రమణియన్ పదవీ కాలం ఈ ఏడాది అక్టోబరుతో ముగియాల్సి ఉంది. అయితే ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర క్యాబినెట్ నియామకాల కమిటీ ఈ నెల ఒకటో తేదీ నుంచే సుబ్రమణియన్‌కు ఉద్వాసన పలకాలని నిర్ణయించింది. ఇందుకు కారణాలు మాత్రం వెల్లడించలేదు.

పాక్‌పై ఒత్తిడి పెంచేందుకే: తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పాకిస్థాన్‌పై ఒత్తిడి పెంచేందుకే కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని భావిస్తున్నారు. ఐఎంఎఫ్ విషయ సేకరణపై సుబ్రమణియన్ గతంలో చేసిన వ్యాఖ్యలు ఆ సంస్థలోని చాలా దేశాలకు రుచించలేదు. దీనికి తోడు ఇటీవల ఆయన తన తాజా పుస్తకం 'ఇండియా @ 100: ఎన్విజనింగ్ టుమారోస్ ఎకనామిక్ ప్రమోషన్' ప్రమోషన్ కోసం చేసిన ప్రచారం ఆయన స్థాయికి తగ్గట్టు లేదని ఆరోపణలు వచ్చాయి.

ఈ నేపథ్యంలో ఈ నెల 9న జరిగే ఐఎంఎఫ్ సమావేశంలో పాకిస్థాన్‌కు కొత్త రుణాలు పుట్టకుండా మిగతా దేశాల మద్దతు కూడగట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ చర్య తీసుకుందని భావిస్తున్నారు. ఈ సమావేశంలో పాక్‌కు మరో విడత 130 కోట్ల డాలర్ల రుణం మంజూరు చేయడంతో పాటు ఇప్పటికే మంజూరు చేసిన రుణాల వినియోగాన్ని ఐఎంఎఫ్ సమీక్షించనుంది. ఈ నేపథ్యంలో కేంద్రం ఆకస్మికంగా సుబ్రమణియన్‌ను ఐఎంఎఫ్ ఈడీ పదవి నుంచి తొలగించాలని నిర్ణయించడం విశేషం.

ప్రస్తుతానికైతే 'టీ+జీరో' ట్రేడింగ్ ఐచ్ఛికమే

ఏఐ రెండు వైపులా పదునున్న కత్తి
సెబీ చీఫ్ పాండే



న్యూఢిల్లీ: స్టాక్ మార్కెట్లో ప్రస్తుతానికైతే టీ+జీరో ట్రేడింగ్ ఐచ్ఛికమని క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ స్పష్టం చేసింది. అయితే ఈ వెసులుబాటు మార్కెట్ వర్గాలు క్రమంగా ఈ విధానానికి మారేందుకు దోహదం చేస్తుందని సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే చెప్పారు. షేర్ల అమ్మకాలు, కొనుగోళ్లు, నగదు చెల్లింపుల ప్రక్రియ ఒకేరోజు ముగిసే విధానాన్ని టీ+జీరో సెటిల్‌మెంట్ అంటారు. సెబీ ప్రస్తుతం ఈ విధానాన్ని తప్పనిసరి పద్ధతిలో కాకుండా ఐచ్ఛిక పద్ధతిలోనే అమలు చేస్తోంది. కాగా కృత్రిమ మేధ (ఏఐ) వినియోగంపైనా సెబీ చీఫ్ మాట్లాడుతూ.. ఈ సరికొత్త టెక్నాలజీ రెండు వైపులా పదునున్న కత్తిలాంటిదన్నారు. నియంత్రణ వ్యవస్థను మరింత పటిష్ఠం చేసేందుకు సెబీ ఇప్పటికే ఏఐని వినియోగిస్తోందన్నారు. ప్రస్తుతం ఐపీఓ పత్రాల ప్రాసెసింగ్, ఇతర కార్యకలాపాల పర్యవేక్షణ కోసం దీన్ని ఉపయోగిస్తున్నట్టు వెల్లడించారు. ఏఐ టూల్స్ సాయంతో సోషల్ మీడియాలో వచ్చే అనధికారిక ఆర్థిక సలహా సేవలకు చెక్ పెడుతున్నట్టు పాండే చెప్పారు.

కేంద్రీకృత కేవైసీ వ్యవస్థ: కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ, ఇతర ఆర్థిక రెగ్యులేటరీ సంస్థలతో కలిసి కేంద్రీకృత నో యువర్ కస్టమర్ (కేవైసీ) వ్యవస్థ ఏర్పాటు కోసం పని చేస్తున్నట్టు పాండే వెల్లడించారు. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ కార్యదర్శి అధ్యక్షతన ఒక కమిటీ ఇందు కోసం ఇప్పటికే కసరత్తు ప్రారంభించిందన్నారు. ఈ వ్యవస్థ అందుబాటులోకి వస్తే కేవైసీ విధానం అత్యంత సులభమవుతుందన్నారు.

మిశ్రమంగా కదలాడే అవకాశం

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మిశ్రమంగా కదలాడే అవకాశాలున్నాయి. ప్రస్తుతం నిఫ్టీ 24,346 స్థాయిలో కన్సాలిడేట్ అవుతోంది. 24,550 స్థాయిలో బలమైన నిరోధాన్ని ఎదుర్కొంటోంది. దీన్ని అధిగమిస్తే మీడియం టర్మ్‌లో మరింత బలపడే అవకాశం ఉంది. మిడ్, స్మాల్ కంపెనీల్లో ఇప్పటికీ కరెక్షన్ కొనసాగుతుండటం మొత్తంగా మార్కెట్ బలహీనతను సూచిస్తోంది. ప్రస్తుతం రిఫైనరీ, షిప్‌బిల్డింగ్, టెక్స్‌టైల్స్ రక్షణ రంగ షేర్లకు డిమాండ్ కనిపిస్తోంది.

స్టాక్ రికమండేషన్స్

తేజస్ నెట్‌వర్క్: రెండేళ్లుగా డౌన్‌ట్రెండ్‌లో పయనిస్తున్న ఈ షేరు ప్రస్తుతం అక్యుములేషన్ జోన్‌లో ఉంది. మార్చి నుంచి బేస్ ఏర్పడుతోంది. కీలకమైన రూ.650 స్థాయిలో రెండోసారి మద్దతు తీసుకున్నాయి. గత శుక్రవారం రూ.704 స్థాయిలో ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.700 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.810 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.670 స్థాయిని స్టాప్‌లా‌స్‌గా పెట్టుకోవాలి.

రైల్‌టెల్: గత ఆరు నెలల్లో 25 శాతం మేర దిద్దుబాటుకు లోనైన ఈ షేరులో రూ.290 స్థాయిలో మంచి బేస్ ఏర్పడుతోంది. ఇక్కడ మంచి డిమాండ్ కనిపిస్తోంది. 20,50 రోజుల మూవింగ్ యావరేజ్‌స్‌ను అధిగమించింది. గత శుక్రవారం 6.7 శాతం లాభంతో రూ.316 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.300 శ్రేణిలో ప్రవేశించి రూ.370 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.275 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఎస్‌బీఐ కార్డ్స్: స్వలకాలికంగా చూస్తే ఈ కౌంటర్‌లో మూమెంటమ్ కాస్త తగ్గింది. అయితే మీడియం టర్మ్‌లో బలాన్ని ప్రదర్శిస్తోంది. తాజాగా కీలకమైన రూ.860 స్థాయికి చేరుకుంది. గత శుక్రవారం రూ.878 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.850 పై స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.980 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.835 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

హిందాల్కో: ఏడాది కాలంగా అంతగా పనితీరు కనబరచని ఈ షేరు ప్రస్తుతం కీలకమైన డిమాండ్ జోన్‌లోకి వచ్చింది. రూ.600 పై స్థాయిలో టైట్ ప్రైస్ యాక్షన్‌తో చలిస్తోంది. మీడియం టర్మ్ మూమెంటమ్ బాగుంది. గత శుక్రవారం రూ.632 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.600 శ్రేణిలో ప్రవేశించి రూ.740 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.675 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఎస్‌బీఐ: ప్రస్తుతం ఈ షేరు మంచి మూమెంటమ్, బలాన్ని ప్రదర్శిస్తోంది. తాజాగా మూడు నెలల గరిష్ఠాన్ని అధిగమించిన ఈ షేరు 20 రోజుల మూవింగ్ యావరేజ్ పైన నిలదొక్కుకుంది. గత శుక్రవారం రూ.800 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.780 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.860 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.755 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

జీఈ వెర్నోవా స్టీమ్‌తో ఆజాద్ ఇంజనీరింగ్ ఒప్పందం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అణు విద్యుత్, థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులకు అవసరమైన ఎయిర్ ఫాయిల్స్ సరఫరా కోసం జీఈ వెర్నోవా స్టీమ్ పవర్ సర్వీసెస్ బిజినెస్ యూనిట్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్టు ప్రెసిషన్ ఇంజనీరింగ్ కంపెనీ ఆజాద్ ఇంజనీరింగ్ ప్రకటించింది. దీని విలువ రూ.5.35 కోట్ల డాలర్లని (కూ.454.75 కోట్లు) వెల్లడించింది. 2030 వరకు అంటే ఆరేళ్ల పాటు అమల్లో ఉండే ఈ ఒప్పందం కింద జీఈ వెర్నోవా తమ కోసం కాంప్లెక్స్ రొటేటింగ్, స్టేషనరీ ఎయిర్ ఫాయిల్స్ ఉత్పత్తి చేసి సరఫరా చేస్తుందని ఆజాద్ ఇంజనీరింగ్ సీఈఓ, చైర్మన్ రాకేశ్ చోప్దార్ తెలిపారు. ఇప్పటికే ఉభయ సంస్థల మధ్య ఉన్న దీర్ఘకాలిక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత పటిష్ఠం చేస్తుందన్నారు.

24,500 పైన నిలకడ తప్పనిసరి

టెక్ వ్యూ


వి. సుందర్ రాజా

నిఫ్టీ ఎట్టకేలకు గత వారం కీలక స్థాయి 24,500 దాటి మరింత పురోగమించినా శుక్రవారం నాడు గరిష్ఠ స్థాయిల్లో ఇంట్రాడే కరెక్షన్‌తో అప్రమత్త సంకేతం ఇచ్చింది. వారం మొత్తానికి 310 పాయింట్ల లాభంతో 24,350 వద్ద ముగిసింది. 24,500 వద్ద కన్సాలిడేషన్, సైడ్‌వేస్ ధోరణిని ప్రదర్శిస్తోంది. ప్రస్తుతం గత డిసెంబరు నాటి గరిష్ఠ స్థాయిలకు చేరువలో ఉంది. నిఫ్టీ వరుసగా గత 15 రోజులుగా నిరంతర ర్యాలీలో ఉన్నందు వల్ల కరెక్షన్ ఏర్పడవలసిన అవసరం ఉంది. అమెరికన్ మార్కెట్లలో గత శుక్రవారం నాటి ర్యాలీ కారణంగా ఈ వారం పాజిటివ్‌గానే ప్రారంభం కావచ్చు. ఈ క్రమంలో మరోసారి 24,500 వద్ద పరీక్ష ఎదుర్కొనే ఆస్కారం ఉంది.

బుల్లిష్ స్థాయిలు: పాజిటివ్ ట్రెండ్‌లో ట్రేడయితే అప్‌ట్రెండ్ కోసం కీలక స్థాయి 24,500 కన్నా పైన నిలదొక్కుకోవడం తప్పనిసరి. మరో నిరోధం 24,800. ప్రధాన నిరోధం 25,000. ఇక్కడ కన్సాలిడేషన్‌కు ఆస్కారం ఉంది.

బేరిష్ స్థాయిలు: 24,500 వద్ద విఫలమైతే బలహీనత ముప్పును ఎదుర్కొంటుంది. దిగువన మద్దతు స్థాయి 24,300. భద్రత కోసం ఇక్కడ నిలదొక్కుకోవాలి. విఫలమైతే మరింత బలహీనపడుతుంది. దిగువ మద్దతు స్థాయిలు 23,150, 23,000.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత వారంలో సైడ్‌వేస్‌లో కదలాడుతూ 450 పాయింట్ల లాభంతో వారం మధ్య స్థాయి 55,100 వద్ద ముగిసింది. ఎగువన నిరోధ స్థాయిలు 55,600, 56,000. మరింత సానుకూలత కోసం 56,000 కన్నా పైన నిలదొక్కుకోవాలి. మద్దతు స్థాయి 55,000. ఇక్కడ నిలదొక్కుకోవడంలో విఫలమైతే అప్రమత్త సంకేతం ఇస్తుంది.

పాటర్న్: మార్కెట్ గత వారం 200 డీఎంఏ కన్నా పైన ముగిసింది. పుల్‌బ్యాక్ రియాక్షన్ ఏర్పడి ఈ స్థాయిలో నిలదొక్కుకోలేకపోతే అప్రమత్త సంకేతం ఇస్తుంది. ట్రెండ్‌లో మరింత సానుకూలత కోసం 24,500 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" కన్నా పైన నిలదొక్కుకోవాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం మంగళవారం తదుపరి రివర్సల్ ఉంది.

సోమవారం స్థాయిలు	
నిరోధం	24,500, 24,560
మద్దతు	24,360, 24,300

24,000 దిగువన బేరిష్

(మే 5-9 తేదీల మధ్య వారానికి)

జ్యోతిష్యం


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 24,062-24,589 పాయింట్ల మధ్యన కదలాడి 308 పాయింట్ల లాభంతో 24,347 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 24,000 కన్నా దిగువన ముగిస్తే స్వల్పకాలానికి బేరిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 24,351, 24,270, 23,812, 23,500 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి: 24,650 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 23,950
నిరోధ స్థాయిలు: 24,550, 24,650, 24,750 (24,450 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 24,150, 24,050, 23,950 (24,250 దిగువన బేరిష్)

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	140	విజయవాడ	142
వరంగల్	140	గుంటూరు	140
కరీంనగర్	140	ఒంగోలు	140
మహబూబ్‌నగర్	140	చిత్తూరు	110
కర్నూలు	140	నెల్లూరు	115
విశాఖపట్నం	141	అనంతపురం	115
గోదావరి	142		

SCHOLARSHIP ALERT

IET India Scholarship Award

Description: The Institution of Engineering and Technology (IET) invites undergraduate engineering students to showcase their creativity, innovation, and leadership. This scholarship recognizes and nurtures India's future engineering leaders, empowering them to excel.
Eligibility: Open to full-time 1st, 2nd, 3rd, and 4th-year UG engineering students from AICTE/UGC-approved institutions across all branches. Applicants must have cleared all credit courses in a single attempt with a minimum of 60% marks in aggregate (or 6.0 CGPA on a 10-point scale). There is no age limit.
Prizes & Rewards: Scholarships worth INR 10,00,000
Last Date: 31-05-2025 *Application:* Online only
Short Url: www.b4s.in/aj/IET5



Education Future International

Description: Education Future International Scholarship 2025 is offered by the Education Future organisation to meritorious Indian students who are pursuing studies overseas in any of the top universities globally.
Eligibility: Application is open to Indian nationals with a valid passport. Applicants must be pursuing an undergraduate/postgraduate course overseas in a recognised institution outside India. They must have secured a minimum of 60% marks in Class 10 and 12, and be able to prove the absence of any means for education funding.
Prizes & Rewards: A scholarship ranging between 2 to 10 lakh. *Last Date:* Round The Year
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/EFIS5

buddy4study.com

సీపెట్ అడ్మిషన్ టెస్ట్ 2025



సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోకెమికల్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ దేశ వ్యాప్తంగా ఉన్న 30 సీపెట్ కేంద్రాల్లో అడ్మిషన్ టెస్ట్ ద్వారా డిప్లొమా, పీజీ డిప్లొమా, పోస్ట్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది. ఆంధ్రప్రదేశ్ విజయవాడ కేంద్రంలో 150, తెలంగాణ హైదరాబాద్ కేంద్రంలో 300 సీట్లు ఉన్నాయి. అర్హులైన స్త్రీ, పురుష అభ్యర్థులు 2025 మే 29 తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

కోర్సులు

డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ మౌల్డ్ టెక్నాలజీ: మూడు సంవత్సరాల వ్యవధి కోర్సు ఇది. మొత్తం ఆరు సెమిస్టర్లు ఉంటాయి. పదో తరగతి పాసైన వారు దరఖాస్తు చేసుకోవచ్చు.
డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ టెక్నాలజీ: మూడు సంవత్సరాల వ్యవధి కోర్సు ఇది. మొత్తం ఆరు సెమిస్టర్లు ఉంటాయి. పదో తరగతి పాసైన వారు దరఖాస్తు చేసుకోవచ్చు.
పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ ప్రాసెసింగ్ అండ్ టెస్టింగ్: రెండు సంవత్సరాల వ్యవధి కోర్సు ఇది. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. సైన్స్‌తో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు.
పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ మౌల్డ్ డిజైన్ విత్ క్యాడ్/క్యామ్: ఒక సంవత్సరం ఆరు నెలల వ్యవధి కోర్సు ఇది. మూడు సెమిస్టర్లు ఉంటాయి. మెకానికల్/ప్లాస్టిక్స్/పాలిమర్/టూల్/ప్రొడక్షన్/మెకట్రానిక్స్/ఆటోమొబైల్/టూల్ అండ్ డై మేకింగ్/ పెట్రోకెమికల్స్/ ఇండస్ట్రియల్/ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్/ టెక్నాలజీ లేదా డీపీఎమ్‌టీ/డీపీటీ(సీపెట్) డిప్లొమా చేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. (హైదరాబాద్ క్యాంపస్‌లో నాలుగు కోర్సులు ఉండగా, విజయవాడ క్యాంపస్‌లో మాత్రం క్యాడ్/కామ్ కోర్సు లేదు)
వయస్సు: ఈ కోర్సులకు ఎలాంటి గరిష్ఠ వయోపరిమితి లేదు.
ఎంపిక విధానం: ప్రవేశ పరీక్ష ఆధారంగా
దరఖాస్తు రుసుము: 100/- **చివరి తేదీ:** 2025 మే 29
ఎంట్రెన్స్ తేదీ: జూన్ 8
కోర్సు ప్రారంభం: 2025 జూలై 14
వెబ్‌సైట్: www.cipet.gov.in

CIPET - Telangana
IDA Phase-II, Cherlapally,
Hyderabad - 500051
hyderabad@cipet.gov.in
Ph: 8093140230, 8374064444
CIPET - Andhra Pradesh
Survey No.377, Surampalli(V), Gannavaram (M), Krishna Dist, Vijayawada - 521 212
vijayawada@cipet.gov.in
Ph: 7229004049, 9440531978

దిక్సూచి
DIKSUCHI

హైదరాబాద్ రామంతపూర్‌లో ఉన్న జవహర్‌లాల్ నెహ్రూ గవర్నమెంట్ పాలిటెక్నిక్ ప్యాకేజింగ్ టెక్నాలజీ కోర్సును ఆఫర్ చేస్తోంది. వస్తువు చెడిపోకుండా, సురక్షితంగా వినియోగదారుడి చేతికి చేరేందుకు దానికి చుట్టూ కల్పించే రక్షణే ప్యాకేజింగ్. మందంగా ఉండే కాగితం మొదలుకుని అట్టపెట్టె, చెక్కతో చేసే ప్యాకేజింగ్ మనకు తెలుసు. ఒక వస్తువు వేడిగా లేదంటే చల్లగా ఉండేందుకు అనువైన ప్యాకేజింగ్ అవసరం. సదరు విషయాలు అన్నింటినీ శాస్త్రీయం బోధించేదే డిప్లొమా ఇన్ ప్యాకేజింగ్ టెక్నాలజీ గ్రామీణ, పేద విద్యార్థులకు ఈ కోర్సు నిజంగా వరమని చెప్పాలి. కోర్సులో భాగంగా ప్యాకేజింగ్ మెటీరియల్ బేసిక్స్, మెథడాలజీ, డిజైన్, అప్లికేషన్ వంటి విషయాలన్నీ బోధిస్తారు. చివరి సెమిస్టర్‌లో సంబంధిత కంపెనీకి పంపి ప్రాక్టికల్‌గా అవగాహన కల్పిస్తారు.

రొటీన్ భిన్నం ఈ డిప్లొమాలు
ప్యాకేజింగ్ టెక్నాలజీ

ఉన్నత చదువులు

ప్యాకేజింగ్ టెక్నాలజీ కోర్సు చేసిన వారు ఈ రంగంలో స్థిరపడాలని లేదు. భవిష్యత్తులో తమ ఆసక్తి మారితే అందుకు అనుగుణంగా కూడా కోర్సులు చేయవచ్చు.
- ఈసెట్‌లో ర్యాంక్ సాధించి లేటరల్ ఎంట్రీ కింద బీటెక్‌లో చేరవచ్చు. మెకానికల్, ఏరోనాటికల్, ప్రొడక్షన్ ఇంజనీరింగ్ సీఎస్ఇ, ఐటీ బ్రాంచీల్లో చేరడానికి కూడా ఈ కోర్సు చేసిన వారు అర్హులు.
- ఒకవేళ ఇదే ప్రింటింగ్ టెక్నాలజీ కోర్సులో కొనసాగాలి అనుకుంటే హరియాణా రాష్ట్రం హిస్సార్‌లోని 'గురు జంబేశ్వర్ యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ' అలాగే 'హర్యానా సెంట్రల్ యూనివర్సిటీ ప్రింటింగ్ అండ్ ప్యాకేజింగ్ టెక్నాలజీ'లో బీటెక్ కోర్సును అందిస్తున్నాయి.
- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్ సహకారంతో హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూ ప్యాకేజింగ్‌లో ఎమ్మెస్సీ, ఐఐటీ రూర్కీ ప్యాకేజింగ్ టెక్నాలజీలో ఎంటెక్ అందిస్తున్నాయి.
- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్ నేరుగా ప్యాకేజింగ్‌లో సర్టిఫికెట్, పీజీ డిప్లొమా ఆఫర్ చేస్తోంది.

ఉద్యోగ అవకాశాలు

ప్రొడక్ట్ డెలివరీ(అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి సంస్థలు), ఫుడ్ డెలివరీ(స్విగ్గీ, జొమాటో వంటివి), ఫార్మా ఇండస్ట్రీ సహా ప్యాకేజింగ్ అవసరమైన ప్రతి సంస్థలో వీరికి ఉద్యోగ అవకాశాలు ఉంటాయి. ఎలక్ట్రికల్ - ఎలక్ట్రానిక్ గాడ్జెట్ల నుంచి వినియోగదారుడి చెంతకు చేరాల్సిన ప్రతి ప్రొడక్ట్‌కు ప్యాకేజింగ్ అవసరమే. అందుకే ఈ డిప్లొమా చేసిన వారికి నిరుద్యోగం అన్న ప్రసక్తే ఉండదు. నిజానికి డిమాండ్‌కు తగ్గ సరఫరాలేదు అన్నది నిజం కూడా.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో
500 మేనేజర్ పోస్టులు

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 500 స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఇందులో అసిస్టెంట్ మేనేజర్ (క్రెడిట్) 250, అసిస్టెంట్ మేనేజర్ (ఐటీ) 250 ఉన్నాయి. 30 సంవత్సరాల లోపు ఉన్న ఆసక్తిగల అభ్యర్థులు 2025 మే 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చు. పోస్టును అనుసరించి బీఈ/బీటెక్, సిఎ, సీఎస్, ఐసీడబ్ల్యూఏ, ఎంఎస్సీ, ఎంఈ/ఎంటెక్, ఎంబీఏ/పీజీడీఎం, ఎంసీఏ, సీజీడీబీఎం పాసై పని అనుభవం ఉండాలి. వివరాలకు www.unionbankofindia.co.in/ వెబ్‌సైట్ చూడవచ్చు.

Union Bank of India

యూజీసీ నెట్ 2025

ప్రతీనెల ఉపకార వేతనం తీసుకుంటూ, పరిశోధనలో కొనసాగడానికి చక్కని అవకాశం యూజీసీ నెట్. అంతేకాదు ఈ జాతీయ అర్హత పరీక్ష(నెట్) అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల పోటీకీ, ప్రభుత్వ అనుబంధ సంస్థల్లో ఉద్యోగాలకూ ప్రామాణికం.. ఇంత ప్రాధాన్యం ఉన్న యూజీసీ నెట్ 2025 దరఖాస్తు గడువు త్వరలో ముగియనుంది.

దేశ వ్యాప్తంగా ఎంపిక చేసిన పట్టణాల్లో యూజీసీ నెట్‌ను మొత్తం 83 సబ్జెక్టుల్లో నిర్వహిస్తారు. భాషా సబ్జెక్టులు తప్పించి మిగిలిన అన్ని ప్రశ్నపత్రాలు ఇంగ్లిష్, హిందీ మాధ్యమాల్లో ఉంటాయి. పరీక్ష అందరికీ ఉమ్మడిగానే ఉన్నప్పటికీ మూడు కేటగిరీలు ఉంటాయి.
కేటగిరీ-1: ఎంపికైనవారు ప్రతి నెలా యూజీసీ నిర్దేశిత స్టయిఫండ్(జేఆర్‌ఎఫ్) పొందుతూ పరిశోధన(పీహెచ్‌డీ) కొనసాగించవచ్చు. అలాగే వీరు అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు, జేఆర్‌ఎఫ్ లేకుండా జరిపే పీహెచ్‌డీ ప్రవేశాలకు అర్హులు.
కేటగిరీ-2: ఇందులో అవకాశం వస్తే జేఆర్‌ఎఫ్ దక్కదు. కానీ అసిస్టెంట్ పోస్టులకు, పీహెచ్‌డీ ప్రవేశాలకు అర్హులే.
కేటగిరీ-3: వీరు పీహెచ్‌డీలో ప్రవేశానికి అర్హులు. జేఆర్‌ఎఫ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ కోసం అర్హత ఉండదు.
విద్యార్హత: సంబంధిత సబ్జెక్టుల్లో 55 శాతం మార్కులతో పీజీ పాసై ఉండాలి. ఎస్సీ/ఎస్టీ/ఓబీసీ నాన్ క్రిమిలేయర్, దివ్యాంగులు, థర్డ్ జెండర్ వ్యక్తులకు 50 శాతం మార్కులు చాలు. ప్రస్తుతం పీజీ కోర్సు చేస్తున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. నాలుగేళ్ల గ్రాడ్యుయేషన్ చేస్తున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వీరికి డిగ్రీలో 75 శాతం మార్కులు ఉండాలి. ఎస్సీ/ఎస్టీ/ఓబీసీ/ఈడబ్ల్యూఎస్‌లకు 70 శాతం చాలు. యూజీతో జేఆర్‌ఎఫ్, పీహెచ్‌డీల్లో ప్రవేశానికి అర్హులు. పీజీ లేనందువల్ల అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు పోటీ పడలేరు. ఫైనల్ ఇయర్ చదువుతున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
వయస్సు: అసిస్టెంట్ ప్రొఫెసర్ అర్హత పొందడానికి, పీహెచ్‌డీ ప్రవేశానికి వయసు నిబంధన లేదు. జేఆర్‌ఎఫ్‌కు 2025 జూన్ 1వ తేదీ నాటికి30 ఏళ్లలోపు ఉండాలి. పైన పేర్కొన్న వారికి గరిష్ఠ వయోపరిమితిలో ఐదేళ్ల సడలింపు ఉంటుంది.
చివరి తేదీ: 2025 మే 7
పరీక్షలు: జూన్ 21 నుంచి 30 తేదీ వరకు
వెబ్‌సైట్: https://ugcnet.nta.ac.in/



చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

కలలన్నీ నిజమయ్యేలా



కమల్‌హాసన్ కథానాయకుడిగా మణిరత్నం దర్శకత్వంలో తెరకెక్కిన భారీ యాక్షన్ థ్రిల్లర్ 'థగ్ లైఫ్'. 'నాయకుడు' చిత్రం విడుదలైన మూడున్నర దశాబ్దాల తర్వాత వీరిద్దరి కలయికలో వస్తోన్న చిత్రమిది. మాఫియా ముఠాల పగ, ప్రతీకారం నేపథ్యంలో సాగే కథతో 'థగ్ లైఫ్'ను ఆసక్తికరంగా తెరకెక్కించారు మణిరత్నం. హీరో శింబు ముఖ్యపాత్రను పోషిస్తున్నారు. త్రిష కథానాయిక. సాన్యా మల్హోత్రా, జోజూ జార్జ్, ఐశ్వర్యలక్ష్మి కీలకపాత్రలు పోషిస్తున్నారు. జూన్ 5న 'థగ్‌లైఫ్' ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఏ.ఆర్. రెహమాన్ సంగీత సారథ్యం వహించిన ఈ చిత్రం నుంచి తొలి గీతాన్ని మేకర్స్ ఆదివారం విడుదల చేశారు. 'కలలన్నీ నిజమయ్యేలా... జింగుచా జింగూచా' అంటూ వివాహ వేడుక నేపథ్యంలో ఉత్సాహంగా సాగే ఈ గీతానికి రెహమాన్ వినసొంపైన బాణీలను అందించారు. అనంత శ్రీరామ్ సాహిత్యం అందించగా, మంగ్లీ, శ్రీకృష్ణ హృద్యంగా ఆలపించారు. కమల్‌హాసన్, మణిరత్నం, ఆర్. మహేంద్రన్, శివ ఆనంద్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రాన్ని ఎస్. సుధాకర్‌రెడ్డి తెలుగులో విడుదల చేస్తున్నారు. సినిమాటోగ్రఫీ: రవి కే చంద్రన్

తెలుగువాడినని వద్దన్నారు




ఇటీవలె విడుదలైన హిందీ చిత్రం 'జాట్'తో హిట్ కొట్టారు దర్శకుడు గోపీచంద్ మలినేని. దాదాపు వంద కోట్లకు పైగా కలెక్షన్స్ సాధించిన ఆ చిత్రానికి సీక్వెల్‌నూ ప్రకటించారు. తాజాగా మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో దర్శకుడిగా తనకు ఓ ప్రాజెక్ట్ విషయంలో ఎదురైన చేదు అనుభవాన్ని గుర్తుచేసుకున్నారు గోపీచంద్. "బాలకృష్ణతో 'వీరసింహా రెడ్డి' సినిమా చేశాక, తదుపరి ప్రాజెక్ట్ కోసం తమిళ హీరో విజయ్‌కు కథ చెప్పా. సింగిల్ సిట్టింగ్‌లోనే ఆయన ఆ కథను ఓకే చేశారు. ఆ సమయంలోనే విజయ్ రాజకీయాల్లోకి ప్రవేశిస్తున్నట్లు ప్రకటించారు. అప్పటికే ఆయన ఓ తెలుగు డైరెక్టర్‌తో 'వారీసు' (వారసుడు) చేశారు. మరో సినిమాను తెలుగువాడితో కాకుండా తమిళ దర్శకుడితోనే చేయమని ఆయనకు తమిళుల నుంచి ఒత్తిడి వచ్చింది అని అనుకుంటున్నాను. దాంతో ఆ ప్రాజెక్ట్ పట్టాలెక్కలేదు" అని పేర్కొన్నారు. ప్రస్తుతం బాలకృష్ణతో ఓ సినిమాను తెరకెక్కించే సన్నాహాల్లో ఉన్నారు గోపీచంద్ మలినేని.

యాక్షన్ హంగామా



దుల్కర్ సల్మాన్ కథానాయకుడిగా నటిస్తున్న కొత్త చిత్రం పట్టాలెక్కింది. నహాస్ హిదాయత్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి 'ఐ యామ్ గేమ్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. దుల్కర్ సల్మాన్ నిర్మిస్తున్నారు. ఆదివారం తిరువనంతపురంలో పూజా కార్యక్రమాలతో చిత్రీకరణ ప్రారంభించారు. కథానాయకుడిగా దుల్కర్‌కు ఇది 40వ చిత్రం. ఆంటోనీ వర్గీస్ కీలకపాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్రంతో తమిళ దర్శకుడు మిస్కిన్ నటుడిగా మలయాళ సినిమాల్లోకి అడుగుపెడుతున్నారు. 'దుల్కర్ కెరీర్లోనే భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతోన్న మలయాళ చిత్రమిది. ఇందులో ఆయన యాక్షన్ హంగామాను చూడబోతున్నారు. తిరువనంతపురంలో తొలి షెడ్యూల్ చిత్రీకరణ కొనసాగుతుంది. ఇతర వివరాలు త్వరలో వెల్లడిస్తాం' అని చిత్రబృందం తెలిపింది. ఈ చిత్రానికి సంగీతం: జేక్స్ బిజోయ్, సినిమాటోగ్రఫీ: జిమ్షీ ఖలీద్.

ముగింపు దశలో చిత్రీకరణ



పవన్ కల్యాణ్ సినిమా కోసం ఎదురుచూస్తున్న అభిమానులకు శుభవార్త చెప్పారు 'హరి హర వీరమల్లు' మేకర్స్. జ్యోతి కృష్ణ దర్శకత్వంలో రూపొందుతోన్న ఈ చిత్ర షూటింగ్‌లో పవన్ పాల్గొన్నట్లు చిత్ర యూనిట్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. పవన్ ప్రస్తుతం రెండు రోజుల షూటింగ్‌లో పాల్గొంటారని, దీనితో సినిమా గ్రాండ్‌గా ఒక ముగింపు దశకు వచ్చేసినట్లేనని పేర్కొంది. అతి త్వరలోనే 'హరి హర వీరమల్లు' సాలిడ్ ట్రైలర్ సహా పాటలు విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. త్వరలోనే అధికారిక రిలీజ్ డేట్ కూడా రానున్నట్లు సమాచారం. ఈ భారీ చిత్రాన్ని ఏ.ఎం.రత్నం నిర్మిస్తుండగా ఎం.ఎం.కీరవాణి సంగీతం అందిస్తున్నారు.

'తమ్ముడు' రాక ఖాయం



నితిన్ హీరోగా శ్రీరామ్ వేణు దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'తమ్ముడు'. ఆదివారం శ్రీరామ్ వేణు పుట్టిన రోజు. ఈ సందర్భంగా చిత్రబృందం రిలీజ్ డేట్‌ను ప్రకటించింది. జూలై 4న 'తమ్ముడు' చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ప్రేక్షకులకు మర్చిపోలేని సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను ఈ చిత్రంతో అందించబోతున్నట్లు దర్శకుడు చెప్పారు. ఈ చిత్రంలో వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ కథానాయికలు. లయ కీలకపాత్ర పోషిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: అజనీష్ లోకనాథ్, సినిమాటోగ్రఫీ: కేవీ గుహన్.

మరింత వినోదంతో...



హీరోయిన్ తాప్సీ పన్ను ఇటీవలె విడుదలైన 'ఫిర్ ఆయి హసీనా దిల్‌రూబా' చిత్రంతో ప్రేక్షకులను పలకరించిన సంగతి తెలిసిందే. 2021లో విక్రాంత్ మస్సే, తాప్సీ జంటగా వినీల్ మాథ్యూ దర్శకత్వంలో తెరకెక్కిన 'హసీనా దిల్‌రూబా'కు ఇది సీక్వెల్. ఇవి నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలయ్యాయి. ఇప్పుడు ఈ చిత్రానికి మూడో భాగం కూడా రాబోతోందని హింట్ ఇచ్చారు రచయిత్రి కనికా థిల్లాన్. ప్రస్తుతం స్క్రిప్ట్ పనులు జరుగుతున్నాయని.. మొదటి రెండు భాగాల కంటే మూడో భాగం మరింత వినోదంతో అలరించేలా ఉండబోతోందని తెలిపారు. ఈ రొమాంటిక్ థ్రిల్లర్ గురించి మరిన్ని వివరాలను త్వరలోనే ప్రకటించనున్నారు. ప్రస్తుతం 'గాంధారీ' చిత్రంతో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధంగా ఉన్నారు తాప్సీ పన్ను.

ఆ ఒక్క రాత్రి.. జీవితాన్నే మార్చేసింది



నాని

ప్రస్తుతం 'హిట్ 3' అందించిన విజయాన్ని ఆస్వాదిస్తున్నారు హీరో నాని. తాజాగా, ఓ పాడ్‌కాస్ట్‌లో పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. ఓ ప్రమాదం తన జీవితాన్నే మార్చేసిందని తెలిపారు. "నేను నా మొదటి కారును కొనకముందు ఓ ప్రమాదం జరిగింది. నా మిత్రుడి కారులో లాంగ్‌డ్రైవ్ వెళ్లాం. చీకటిలో నేను నడుపుతున్న కారు రోడ్డుపై నిలిచిపోయి ఉన్న ఓ లారీని ఢీకొట్టింది. నాకూ, నా పక్కనే ఉన్న ప్రశాంత్ అనే మిత్రుడికీ తీవ్ర గాయాలయ్యాయి. ప్రశాంత్ స్పృహ కోల్పోయాడు. ప్రశాంత్.. ప్రశాంత్ అని గట్టిగా అరవడంతో ఆయన స్పృహలోకి వచ్చాడు. దాంతో ఊపిరి పీల్చుకున్నా. చికిత్స కోసం ఓ అంబులెన్స్‌లో హాస్పిటల్‌కు వెళ్తుంటే దారిలో మరో ప్రమాదం జరిగింది. ఆ ప్రమాదంలో ఓ కుటుంబమంతా తీవ్రంగా గాయపడ్డారు. అందులో ఓ చిన్న పాప కూడా ఉంది. మాతో పాటూ వారినీ అంబులెన్సులో తీసుకుని ఆస్పత్రికి వెళ్లాం. ఆ పాపను ఐసీయూలో ఉంచారు. అర్ధరాత్రి నుంచి ఉదయం వరకూ ఆ పాప పరిస్థితి తెలుసుకోవడానికి నేను వేచి చూశా. మరణం అంచులకు తీసుకెళ్లిన ఆ రాత్రి నన్ను పూర్తిగా మార్చేసింది. జీవితాన్ని చూసే కోణాన్ని, పలు విషయాలకు స్పందించే విధానాన్ని నేర్పింది" అని పేర్కొన్నారు.

పరోటా మాస్టర్‌గా విజయ్ సేతుపతి



విజయ్ సేతుపతి, నిత్యా మేనన్ జంటగా పాండిరాజ్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం టైటిల్‌ను 'తలైవా తలైవి' అని మేకర్స్ ఖరారు చేశారు. దీనిని ప్రకటిస్తూ తాజాగా టైటిల్ టీజర్‌ను రిలీజ్ చేశారు. ఇందులో విజయ్ సేతుపతి పరోటా మాస్టర్‌గా నటిస్తున్నారు. అందుకోసం ఆయన కొంత శిక్షణ కూడా తీసుకున్నట్లు తెలిసింది. టీజర్‌లో..విజయ్ సేతుపతి, నిత్యామేనన్ వంట చేస్తూనే గొడవపడుతూ ఉంటారు. వారిద్దరు సరదాగా పోట్లాడుకుంటూ భార్యాభర్తలుగా కనిపిస్తారు. ఒకరిపై మరొకరు పెద్దగా అరుచుకుంటారు. చివరికి విజయ్ సేతుపతి నోటికి టవల్ కట్టుకొని తనలో తాను మాట్లాడుకుంటూ ఉండిపోతాడు. కాగా, ఈ చిత్రంలో టబు లీడ్ రోల్‌లో నటించనున్నారు. నటి రాధికా ఆప్టే కూడా త్వరలో ఈ ప్రాజెక్టులో భాగం కానున్నట్లు సమాచారం. జూన్‌లో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానున్న ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేయనున్నారు.

చీర కట్టులో అవని



మెగాస్టార్ చిరంజీవి హీరోగా వశిష్ట దర్శకత్వంలో రాబోతున్న చిత్రం 'విశ్వంభర'. త్రిష కృష్ణన్ కథానాయిక. యూవీ క్రియేషన్స్ నిర్మిస్తోంది. ఆదివారం త్రిష పుట్టిన రోజు సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు తెలియజేస్తూ మేకర్స్ ప్రత్యేక పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ చిత్రంలో త్రిష అవని పాత్ర పోషిస్తున్నట్లు వెల్లడించారు. చీర కట్టులో త్రిష మెరిసిపోతూ కనిపించారు. 2006లో విడుదలైన 'స్టాలిన్' తర్వాత చిరంజీవి, త్రిష కలసి నటిస్తున్న చిత్రమిది. సృష్టి, స్థితి, లయ ఈ మూడింటి నేపథ్యంలో ఈ చిత్ర కథ సాగనున్నట్లు సమాచారం. సినిమాలో భారీ సన్నివేశాలు ఉంటాయని ఇప్పటికే చిత్ర యూనిట్ వెల్లడించింది. ఆంజనేయ భక్తునిగా చిరంజీవి కనిపించనున్నారు. ఆషికా రంగనాథ్, కునాల్ కపూర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఎం.ఎం.కీరవాణి సంగీతం అందిస్తున్నారు.

జానూతో ప్రేమ గీతం



రాజ్ తరుణ్ హీరోగా రామ్ కడుముల దర్శకత్వంలో తెరకెక్కుతోన్న క్రైమ్ కామెడీ ఎంటర్‌టైనర్ 'పాంచ్ మినార్'. రాశి సింగ్ కథానాయిక. గోవిందరాజు సమర్పణలో మాధవి, ఎం.ఎస్.ఎం రెడ్డి నిర్మిస్తున్నారు. చిత్ర బృందం ఆదివారం 'జానూ మేరీ జానూ' అంటూ సాగే ప్రేమగీతాన్ని విడుదల చేసింది. శ్రీహర్ష ఈమని సాహిత్యానికి శేఖర్‌చంద్ర స్వరాలు సమకూర్చగా, వినాయక్ ఆలపించారు. అజయ్ ఘోష్, బ్రహ్మాజీ, శ్రీనివాస్‌రెడ్డి, రవి వర్మ కీలకపాత్రలు పోషిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: ఆదిత్య జవ్వాది, ఎడిటర్: ప్రవీణ్ పూడి.

'తేనెటీగ రామారావు' కన్నుమూత



నిర్మాత జవాజి వెంకట రామారావు అలియాస్ తేనెటీగ రామారావు(68) ఆదివారం హైదరాబాద్‌లో కన్నుమూశారు. కొంతకాలంగా లివర్ సంబంధ వ్యాధితో బాధపడుతున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రాజేంద్రప్రసాద్‌తో 'తేనెటీగ, వంశీ దర్శకత్వంలో నరేశ్-వాణీ విశ్వనాథ్‌తో 'ప్రేమ అండ్ కో, శివకృష్ణతో 'బొబ్బిలివేట', 'బడి' వంటి చిత్రాలను నిర్మించడంతో పాటు పలు డబ్బింగ్ సినిమాలకు రామారావు నిర్మాతగా వ్యవహరించారు.

భూభారతి రైతులకు రక్షణ కవచం

» నేటి నుంచి మరో 28 మండలాల్లో అమలు

» కలెక్టర్లు రైతుల సందేహాలను నివృత్తి చేయాలి: పొంగులేటి



హైదరాబాద్, మే 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ భూపరిపాలనలో నూతన అధ్యాయానికి నాంది పలికిన భూభారతి చట్టం రైతులకు రక్షణ కవచమని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గత నెల 17 నుంచి 30 వరకు 4 జిల్లాల్లోని 4 మండలాల్లో భూభారతిని పైలట్ ప్రాజెక్టుగా తీసుకొని రెవెన్యూ సదస్సులు నిర్వహించామని తెలిపారు. సోమవారం నుంచి 20 వరకు జిల్లాకొక మండలం చొప్పున మిగతా 28 మండలాల్లోనూ ఈ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాకోణంలో తీసుకొచ్చిన ఈ భూభారతి చట్టంపై అవగాహన కల్పించడంతో పాటు భూ సమస్యలపై ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి వాటి పరిష్కారమే సదస్సుల ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కలెక్టర్లు జిల్లాల్లో రెవెన్యూ సదస్సులకు హాజరై అక్కడ రైతులు, ప్రజల సందేహాలను నివృత్తి చేసి సమస్యలకు పరిష్కారం చూపాలని సూచించారు. రైతుల భూ సమస్యల శాశ్వత పరిష్కారమే ధ్యేయంగా ఎంతో అధ్యయనంతో తెచ్చిన భూభారతి చట్టాన్ని క్షేత్రస్థాయికి సమర్థంగా తీసుకెళ్లాలని కలెక్టర్లకు ఆయన విజ్ఞప్తి చేశారు.

నేటి నుంచి 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'

» వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల



హైదరాబాద్, మే 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రైతాంగానికి సాగు సంబంధిత అంశాలపై అవగాహన కల్పనకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలతో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' అనే నూతన కార్యక్రమం ప్రారంభించనున్నట్లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఈనెల 5 నుంచి జూన్ 13 వరకు సుమారు 1200 గ్రామాలలో నిర్వహిస్తామన్నారు. సుమారు 200లకు పైగా శాస్త్రవేత్తలతో బృందాలను ఏర్పాటు చేశామన్నారు. దక్షిణ తెలంగాణ మండలాల్లో సుమారు 100 బృందాలు, ఉత్తర, మధ్య తెలంగాణ మండలాల్లో సుమారు 50 బృందాలు పాల్గొంటాయన్నారు. ఒక్కో బృందం రోజువారి కార్యక్రమాన్ని నిర్వహించడంతోపాటు, ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎంపిక చేసుకున్న గ్రామాల రైతులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తారన్నారు. యూరియా వాడకం తగ్గింపు, జాగ్రత్తగా రసాయనాల వాడకం, రశీదులను భద్రపరచడం, సాగు నీటి ఆదా, పంటల మార్పిడి, చెట్లను పెంపకంపై అవగాహన కల్పిస్తారన్నారు. వీటితోపాటు రైతాంగం ఎదుర్కొంటున్న పలు సవాళ్లకు సూచనలు, సలహాలందిస్తారని తెలిపారు. రైతులు పెద్దఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని, వ్యవసాయ సంబంధిత అంశాలపై అనుమానాలను శాస్త్రవేత్తల ద్వారా నివృత్తి చేసుకోవాలని మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు. సోమవారం వికారాబాద్ జిల్లాలోని ధరూర్‌లో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌తో కలిసి మంత్రి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.

తెలంగాణ నమూనాతోనే కులగణన జరపాలి

» సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు గిడుగు రుద్రరాజు

న్యూఢిల్లీ, మే 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ నమూనాతో దేశవ్యాప్తంగా సమగ్ర కులగణన జరపాలని కేంద్రానికి సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు గిడుగు రుద్రరాజు సూచించారు. తెలంగాణలో కులగణన నిర్వహించిన విధానం అద్భుతంగా ఉందని.. కేవలం కులాల వారీ లెక్కలే కాక బీసీల సామాజిక, ఆర్థిక, విద్య పరమైన వెనుకబాటుతనాన్ని నిర్ధారించారన్నారు. ఆదివారం ఢిల్లీలోని తెలంగాణభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ మొదట్నుంచే కులగణనకు కట్టుబడి ఉందన్నారు. గతంలో కులగణన చేయాలని కోరిన వారిని మోదీ అర్బన్ నక్సల్స్‌గా అభివర్ణించారని విమర్శించారు. బీజేపీ నేతలు ఒప్పుకున్నా లేకున్నా.. 100 శాతం రాహుల్ గాంధీ ఒత్తిడితోనే కేంద్రం కులగణన నిర్ణయం తీసుకుందని స్పష్టం చేశారు. విద్య, ఉద్యోగాల్లో 50 శాతానికి మించి రిజర్వేషన్లు కల్పించేందుకు రాజ్యాంగ సవరణ చేయాలన్నారు.

ఎప్‌సెట్ ఇంజనీరింగ్‌కు 13,137 మంది గైర్హాజరు

» గతేడాదికన్నా తగ్గిన 33,427 మంది విద్యార్థులు

హైదరాబాద్, మే 4 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కాలేజీల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన ఎప్‌సెట్-2025 ముగిసింది. గత నెల 29, 30 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ విభాగ ప్రవేశ పరీక్షలు జరగ్గా.. ఈ నెల 2, 3, 4 తేదీల్లో ఇంజనీరింగ్ విభాగ ప్రవేశ పరీక్ష జరిగింది. అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలకు 86,762 మంది రిజిస్టర్ చేసుకోగా.. పరీక్షలకు 81,198 మంది హాజరయ్యారు. 5,564 మంది (6.41 శాతం) గైర్హాజరయ్యారు. ఇక రాష్ట్రవ్యాప్తంగా 16 జోన్ల పరిధిలో జరిగిన ఇంజనీరింగ్ పరీక్షకు గతేడాదితో పోలిస్తే ఈసారి గైర్హాజరైన విద్యార్థుల సంఖ్య పెరిగింది. ఈసారి ఎప్‌సెట్ కోసం మొత్తం 3,06,796 దరఖాస్తులు రాగా ఇందులో ఇంజనీరింగ్ దరఖాస్తుదారులు 2,20,327 మందిలో 2,07,190 మంది హాజరయ్యారు. 13,137 మంది (6.34 శాతం) హాజరుకాలేదు. సాధారణంగా ప్రతి ఏటా గైర్హాజరు దాదాపు 5 శాతం వరకు ఉంటుండగా.. ఈసారి ఎక్కువగా నమోదైంది. గతేడాది ఇంజనీరింగ్ పరీక్షకు 2,40,617 మంది హాజరుకాగా ఈసారి 2,07,190 మందే రాశారు. గతేడాదితో పోలిస్తే ఇది 33,427 తక్కువ. ఈసారి పరీక్షకు హాజరైన విద్యార్థుల సంఖ్య బాగా తగ్గడంతో ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌లో సీట్లు కూడా గతేడాదితో పోలిస్తే చాలా మిగిలిపోతాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఘాటుగా నీట్



హైదరాబాద్‌లోని ఓ కేంద్రం వద్ద పరీక్షకు హాజరయ్యే విద్యార్థినికి చెవి దిద్దులు తీసివేస్తున్న తల్లిదండ్రులు

(మొదటిపేజీ తరువాయి)

అమలు చేశారు. రకరకాల కారణాల వల్ల సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకోలేకపోయిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు.. లోపలికి అనుమతించాలంటూ సిబ్బందిని బతిమిలాడుకున్నా ఉపయోగం లేకపోయింది. దీంతో వారు కన్నీటిపర్యంతమయ్యారు. కరీంనగర్‌లోని మహిళల డిగ్రీ, పీజీ కాలేజీలో నీట్ పరీక్ష రాసేందుకు ఒక విద్యార్థిని వేములవాడ నుంచి తన తల్లితో కలిసి వచ్చింది. కానీ.. ఆమె మూడు నిమిషాలు ఆలస్యంగా రావడంతో లోపలికి అనుమతించలేదు. కూలీ పని చేసి, పుస్తెల తాడు తాకట్టుపెట్టి అప్పు తీసుకొని తన కుమార్తెకు లాంగ్‌టర్మ్ కోచింగ్ ఇప్పించానని.. ఇలా జరుగుతుందని ఊహించలేదని ఆ తల్లి కన్నీరుమున్నీరు అయింది. ఇటువంటి ఘటనలు అక్కడక్కడ జరిగినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. మేడ్చల్ జిల్లా కీసర పరిధిలోని అంకిరెడ్డిపల్లి గ్రామంలో నీట్ పరీక్షా కేంద్రం వద్దకు చేరుకున్న విద్యార్థులు.. హాల్‌టికెట్‌లో ఆ కేంద్రం పేరు ఒకలా, అక్కడ మరొకలా ఉండడంతో అయోమయానికి గురయ్యారు. అక్కడ గతంలో మూర్తి ఇంజనీరింగ్ కళాశాల ఉండేది. గత ప్రభుత్వ హయాంలో ఆ కాలేజీని అద్దెకు తీసుకుని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలను ఏర్పాటు చేశారు. హాల్‌టికెట్లలో ఆ కేంద్రం పేరు మూర్తి ఇంజనీరింగ్ కళాశాల అని ఉండడం.. అక్కడ గురుకుల పాఠశాల ఉండడంతో విద్యార్థులు ఆందోళన చెందారు. అది తమ పరీక్షా కేంద్రమో కాదో తెలియక అటూ ఇటూ తిరిగి చివరికి అక్కడికి వచ్చేసరికి సమయం మించిపోయింది. దీంతో కొంత మంది విద్యార్థులు పరీక్ష రాయలేకపోయారు. ఇక.. కొన్ని పరీక్షా కేంద్రాల్లో గోడ గడియారాలను ఏర్పాటు చేయలేదు. దీంతో విద్యార్థులు సమయం ఎంత అయిందో తెలియక, పరీక్ష రాయడానికి ఇంకా ఎంత సమయం ఉందో తెలుసుకునే వెసులుబాటు లేక తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. కొన్ని కేంద్రాల వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులతో దీనిపై గొడవకు దిగారు. కాగా.. హైదరాబాద్ జేఎన్‌టీయూ కేంద్రంలో పరీక్షా సమయం ముగియడానికి ముందే పేపర్లు తీసేసుకున్నారని విద్యార్థులు ఆరోపించారు.

మునుపెన్నడూ లేనంత..

నీట్ యూజీ 2017లో మొదలైంది. నాటి నుంచి కిందటి సంవత్సరం దాకా.. ఏ ఏడాదీ నీట్ ప్రశ్నపత్రం ఇంత కఠినంగా లేదని అధ్యాపకులు, విద్యారంగ నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ఫిజిక్స్ ప్రశ్నలు తమను బెంబేలెత్తించినట్లు విద్యార్థులు వెల్లడించారు. నీట్ పేపర్‌లో.. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీలలో మొత్తం 180 ప్రశ్నలుంటాయి. ఫిజిక్స్‌లో 45 ప్రశ్నలకుగాను 20-25 ప్రశ్నలకు జవాబు రాస్తే చాలా గొప్పేనని నిపుణులు చెబుతున్నారు. మెరిట్ విద్యార్థులు సైతం ఫిజిక్స్‌లో 30ప్రశ్నలకు మించి సమాధానాలు రాయలేకపోయారని.. ఎవరైనా 40ప్రశ్నలకు సమాధానాలు రాస్తే ఆలిండియా ర్యాంకు తథ్యమని వస్తుందని పేర్కొన్నారు. అలాగే, కెమిస్ట్రీలో ఆరు ప్రశ్నలను అత్యంత కఠినంగా ఇచ్చారని, అవి సుదీర్ఘంగా, సమయం ఎక్కువ తీసుకునేలా ఉన్నాయని ఓ ప్రముఖ విద్యా సంస్థలో కెమిస్ట్రీ సీనియర్ ఫ్యాకల్టీగా ఉన్న జె.శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు. బోటనీలోనూ ఇదే పరిస్థితి నెలకొందని.. కొన్ని ప్రశ్నలు కష్టంగా ఇచ్చారని ఆయన వెల్లడించారు. అయితే మెజారిటీ విద్యార్థులు ఆ ప్రశ్నలకు బాగానే సమాధానాలు రాసినట్టు చెబుతున్నారు. జువాలజీలో 3-4 ప్రశ్నలు అర్థం కాలేదని కొంతమంది పేర్కొన్నారు. చాలామంది విద్యార్థులు బోర్డు ఎగ్జామ్ సిలబస్‌ను పట్టించుకోలేదని.. వాటిలో ప్రశ్నలు అడగడం లేదన్న ధీమాతో ఉంటున్నారని.. కానీ, ఈసారి వాటి నుంచి కూడా ప్రశ్నలు అడిగారని.. నిపుణులు తెలిపారు. ప్రశ్నపత్రం కఠినంగా రావడంతో విద్యార్థులు ఒకరకమైన బాధతో కనిపించారు. కాగా.. నీట్ ఫలితాలను జూన్ 14న వెల్లడిస్తామని జాతీయ పరీక్షా సంస్థ ప్రకటించింది. ఈ నెల ఆఖరులోగా 'కీ' విడుదలయ్యే అవకాశం ఉంది.

ఆయా సబ్జెక్టుల్లో కఠిన ప్రశ్నల సంఖ్య ఇలా..

సబ్జెక్టు	సులభం	మధ్యస్థం	కఠినం	మొత్తం
ఫిజిక్స్	10	19	16	45
కెమిస్ట్రీ	11	19	15	45
బోటనీ	20	16	14	50
జువాలజీ	19	15	6	40
మొత్తం	60	69	51	180

లాంగ్ టర్మ్ విద్యార్థులకు దెబ్బే..

తెలంగాణలో నీట్ లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకుని పరీక్ష రాసేవారు 12 నుంచి 15 వేల మంది దాకా ఉంటారు. లాంగ్‌టర్మ్ తీసుకుని నిరుడు పరీక్ష రాసినవారిలో 2వేల మంది వరకూ ఎంబీబీఎస్ సీటు సాధించారని.. ఈసారి మాత్రం ఆ సంఖ్య వెయ్యిలోపే ఉంటుందని నీట్ నిపుణులు అభిప్రాయపడ్డారు. సాధారణంగా నీట్ లాంగ్‌టర్మ్ విద్యార్థులకు భౌతికశాస్త్రమే ఇబ్బందిగా ఉంటుందని.. ఈ ఏడాది అదే కష్టంగా రావడంతో వారు సీటు కొట్టడం చాలా కష్టమని పేర్కొన్నారు.

779 కాలేజీలు.. 1.17 లక్షల సీట్లు

అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ ఏడాది దేశవ్యాప్తంగా 779 మెడికల్ కాలేజీల్లో 1.17 లక్షల ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఈ సీట్ల కోసం దేశవ్యాప్తంగా 22.7 లక్షల మందికి పైగా అభ్యర్థులు పరీక్ష రాశారు.

450 వస్తే జనరల్‌లో సీటు!



కిందటి సంవత్సరం చాలా మంది విద్యార్థులు 720 మార్కులు సాధించారు. ఈసారి 700 సాధించడమే చాలా కష్టం. ఈ ఏడాది కటాఫ్ బాగా (50-60 మార్కుల మేర) తగ్గే అవకాశం కనిపిస్తోంది. నిరుడు తెలంగాణలో 490 మార్కులు సాధించిన వారికి కన్వీనర్ కోటాలో సీటుదక్కింది. ఈసారి 450 మార్కులు సాధిస్తే జనరల్ కేటగిరీలో సీటు రావొచ్చు.

- శంకర్‌రావు, డీన్, శ్రీచైతన్య కాలేజ్, కూకట్‌పల్లి

నీట్ పరీక్ష రాసిన తల్లీకూతుళ్లు



ఖమ్మం ఖానాపురంహవేలి, మే 4 (ఆంధ్రజ్యోతి): 'వివాహం విద్య నాశాయ' ..అని సామెత! కానీ, ఆ తల్లి అలా అనుకోలేదు. పెళ్లయి ముగ్గురు పిల్లలు పుట్టాక.. ఇంటర్మీడియట్ పూర్తిచేసిన పెద్ద కూతురితో కలిసి నీట్ పరీక్ష రాసింది. అందుకు ఆమె భర్త సహకారం సంపూర్ణంగా ఉండడం విశేషం. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం మంచానాయక్ తండాకు చెందిన ఆ తల్లీకుమార్తెల పేర్లు.. బానోత్ సరిత, బానోత్ కావేరి. సరిత బీఎస్సీ నర్సింగ్ రెండో సంవత్సరం చదువుతుండగా.. తల్లిదండ్రులు ఆమె చదువు ఆపించి, అదే గ్రామానికి చెందిన భూక్యా కిషన్‌తో పెళ్లి చేశారు. ఆ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వారిలో పెద్ద కుమార్తె కావేరి ఇంటర్‌పూర్తి చేసి నీట్ లాంగ్‌టర్మ్ కోచింగ్ తీసుకుని పరీక్ష రాసింది. సరిత కూడా ఆమెతో కలిసి నీట్ పరీక్ష రాసింది. తల్లి కూడా తనతో పాటే నీట్ పరీక్ష రాయటం సంతోషంగా ఉందని.. ఇద్దరం కలిసి ఖమ్మంలో ఒకే గదిలో ఉండి కోచింగ్ తీసుకున్నామని, తల్లి సూర్యాపేటలో పరీక్ష రాయగా తాను ఖమ్మంలో రాసినట్టు కావేరి తెలిపింది.



ఆర్టీసీ కార్మికులతో చర్చలకు సిద్ధం

నేడు, రేపు.. ఎప్పుడొచ్చినా చర్చిస్తాం: పొన్నం



హుస్నాబాద్ రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): టీజీఎస్‌ఆర్టీసీ కార్మికులతో చర్చలకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆదివారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ బస్టాండ్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి ప్రయాణికులు, డ్రైవర్లు, కండక్టర్లతో మాట్లాడారు. ప్రయాణానికి సంబంధించిన అంశాలపై మంత్రి కాసేపు ముచ్చటించారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ ప్రజాపాలనలో కార్మికుల సంక్షేమం కోసం అనేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలపై చర్చించడానికి ఈ నెల 5, 6 తేదీల్లో తాను హైదరాబాద్‌లో అందుబాటులో ఉంటానని చెప్పారు. గత పదేళ్లలో కార్మికుల సమ్మెతో అనేక మంది చనిపోయినా పట్టించుకోలేదన్నారు. ఒక్క ఆర్టీసీ బస్సు కొనుగోలు చేయకుండా, ఒక్క నియామకం చేపట్టకుండా గత ప్రభుత్వం ఆర్టీసీని పూర్తిగా నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. ప్రజాపాలన వచ్చాక సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రవాణా వ్యవస్థ బాగుండాలని కొత్తబస్సులు కొనుగోలు చేపట్టినట్లు తెలిపారు. ఆర్టీసీలో నియామకాలు చేపట్టామని ఆయన చెప్పారు.

ఆరు నెలల్లో హైటెక్ బస్టాండ్

ములుగు ప్రజల కల నెరవేరుస్తాం: పొన్నం

ములుగు, మే 4 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా ప్రజల దశాబ్దాల కల నూతనంగా ఏర్పాటు చేయబోయే బస్టాండ్‌తో నెరవేరనుందని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. జిల్లా కేంద్రంలో రూ. 4.80 కోట్లతో నిర్మించబోయే నూతన ఆర్టీసీ బస్టాండ్‌కు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి సీతక్కతో కలిసి ఆదివారం శంకుస్థాపన చేశారు. ముందుగా మంత్రులిద్దరూ గట్టమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారికి కాంగ్రెస్ కార్యకర్తలు గజమాలతో స్వాగతం పలికారు. అక్కడి నుంచి మంత్రులు ర్యాలీగా బయలుదేరి జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. అనంతరం పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో హైటెక్ తరహాలో నూతన బస్టాండ్‌ను ఆరు నెలల్లో నిర్మించి ప్రారంభించబోతున్నామన్నారు. రాష్ట్రంలో గ్రామ గ్రామానికి బస్సు సౌకర్యాన్ని కల్పించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ములుగు జిల్లా బస్టాండ్ బాగోలేదని మంత్రి సీతక్క తన దృష్టికి తీసుకొచ్చారని, దీంతో వెంటనే నిర్మాణానికి నిధులు మంజూరు చేశామన్నారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ.. జిల్లాలోని పలు ప్రాంతాల్లో బస్టాండ్ల నిర్మాణానికి నిధులు కేటాయించిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రాహుల్ నాయకత్వంలో.. రేవంత్ సర్కార్‌ది సామాజిక ప్రజాపాలన



» ఆయన ఆదేశం మేరకు కులగణనా చేసింది

» కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు కవితకు సామాజిక తెలంగాణ గుర్తుకు రాలేదా?

» కాంగ్రెస్ పాలనలో ప్రజలు కోరుకున్న స్వేచ్ఛ

» ఆ స్వేచ్ఛ వల్లే కవిత మాట్లాడుతోంది

» బీఆర్ఎస్‌ది యాక్టింగ్ పాలనైతే.. మాది రియాలిటీ పాలన: జగ్గారెడ్డి

హైదరాబాద్, మే 4 (ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ నాయకత్వంలో.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సామాజిక ప్రజాపాలన చేస్తోందని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి అన్నారు. తెలంగాణ సమాజం సామాజిక తెలంగాణ, మాట్లాడే స్వేచ్ఛ, ప్రజాపాలన కోరుకుంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని ఇచ్చిందన్నారు. రాహుల్‌గాంధీ ఆదేశం మేరకు రాష్ట్రంలో రేవంత్ ప్రభుత్వం కులగణన సర్వేను నిర్వహించిందని గుర్తు చేశారు. "కేసీఆర్ కూతురు కవిత.. తెలంగాణ ప్రజల్ని మోసం చేయడానికి కొత్త రాగం ఎత్తుకుంది. అధికారం పోయాక సామాజిక తెలంగాణ అంటూ పెద్ద మాటలు మాట్లాడుతోంది. కేసీఆర్ సీఎంగా ఉన్నపుడు ఆమెకు సామాజిక తెలంగాణ గుర్తుకు రాలేదా? అధికారం పోయాక గుర్తుకు వచ్చిందా?" అంటూ నిలదీశారు. పదేళ్ల అధికారంలో ఉన్న కేసీఆర్.. సామాజిక తెలంగాణ అంశాన్ని పట్టించుకోలేదంటూ కవిత.. చెప్పకనే చెప్పారని, ఆమె మనసులో మాటలు.. ఆమెకు తెలియకుండానే బయటికి వచ్చాయని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే.. ప్రజలు కోరుకున్న స్వేచ్ఛను వారికి ఇచ్చిందన్నారు. వారు గొంతు విప్పి మాట్లాడే స్వేచ్ఛను కల్పించిందన్నారు. తమ ప్రభుత్వం ఇచ్చిన ఆ స్వేచ్ఛలోనే కవిత కూడా మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నేతలు ఇందిరాపార్కు వద్దనున్న ధర్నాచౌక్‌లో కూర్చుని మాట్లాడుతున్నారంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన స్వేచ్ఛ వల్లనేనన్నారు. జిల్లాల్లోని కలెక్టరేట్ల వద్ద కూడా ధర్నాలు చేసుకునే స్వేచ్ఛను కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిందని తెలిపారు. కొత్త కొత్త రాగాలు ఎంచుకుని నటించడం కేసీఆర్ కుటుంబానికే సాధ్యమని విమర్శించారు. కేసీఆర్ పాలన నటించే పాలనైతే.. కాంగ్రెస్ ప్రభుత్వానిది ప్రజలు కోరుకున్న.. ప్రజాపాలనన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి యాక్టింగ్ పాలనైతే.. కాంగ్రెస్ ప్రభుత్వానికి రియాలిటీ పాలన అని పేర్కొన్నారు. సీఎం రేవంత్ చెప్పినట్లుగా ప్రజలు కాంగ్రెస్‌కు పదేళ్ల పాటు పరిపాలించే అవకాశం ఇస్తారని, పార్టీ కార్యకర్తలకూ ఆ విశ్వాసం ఉందన్నారు. ప్రస్తుతం ప్రజలకు లభిస్తున్న స్వేచ్ఛ కొనసాగాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఉండాలనే ప్రజలు కోరుకుంటారని, బీఆర్ఎస్‌ను అధికారంలోకి తెచ్చుకుని మళ్లీ బందీలు కావాలని కోరుకోరన్నారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.

కర్రెగుట్టల్లో చిక్కని నక్సల్స్ జాడ!

(మొదటిపేజీ తరువాయి)

మాజీ పోలీసులు, నిఘా సంస్థల నుంచి అవుననే సమాధానం వస్తోంది. నక్సల్స్ గుట్టలపై ఉన్నప్పుడు అనుసరించాల్సిన యుద్ధ వ్యూహాలను(జంగిల్ వార్‌ఫేర్) కేంద్ర బలగాలు ఏమాత్రం పట్టించుకోకుండా ముందుకు సాగడంతో ఆశించిన ఫలితాలను రాబట్టలేకపోయారనే వాదనలు వినిపిస్తున్నాయి. 'ఆపరేషన్ కర్రెగుట్టలు'లో కేవలం ఛత్తీస్‌గఢ్ పోలీసులు-- డీఆర్జీ, ఎస్టీఎఫ్, కేంద్ర బలగాలు-- సీఆర్పీఎఫ్, కోబ్రా మాత్రమే పాల్గొన్నాయి. నిజానికి తెలంగాణలో 90 కిలోమీటర్ల పొడవునా ఈ గుట్టలున్నాయి. దాదాపు సగం గుట్టలు తెలంగాణ పరిధిలో ఉన్నాయి. అటు మహారాష్ట్రలోనూ ఇంద్రావతి నది వైపు గుట్టలు విస్తరించి ఉన్నాయి. మొత్తం 288 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించిన ఈ గుట్టలపై ఛత్తీస్‌గఢ్ పోలీసులు, కేంద్ర బలగాలకు పెద్దగా అవగాహన లేదు. తెలంగాణ పోలీసులు పలు మార్లు ఇక్కడ ఆపరేషన్లు నిర్వహించారు. అటు ఇంద్రావతి ప్రాంతంపై మహారాష్ట్ర పోలీసులకు మంచి పట్టు ఉంది. అయితే.. ఎన్‌కౌంటర్ల చరిత్రలోనే తెలంగాణ గ్రేహౌండ్స్ సహకారం లేకుండా ఇటీవల అతిపెద్ద ఆపరేషన్లను ఛత్తీస్‌గఢ్ పోలీసులు నిర్వహించారు. కాంకేర్ జిల్లా పరిధిలోని అబూజ్‌మడ్‌లో 26 మంది నక్సల్స్, ఛత్తీస్‌గఢ్-ఒడిసా సరిహద్దుల్లోని గరియాబంద్-కుల్హారిఘాట్ అడవుల్లో 16 మంది మావోయిస్టులను ఎన్‌కౌంటర్ చేశారు. ఆ తర్వాత ఛత్తీస్‌గఢ్ పోలీసులు కేంద్ర బలగాల సహకారంతో ఒంటరిపోరును ప్రారంభించారు. కర్రెగుట్టల్లోనూ అదే వ్యూహాన్ని అనుసరించారు. 'ఆపరేషన్ కగార్'లో తమకే క్రెడిట్ దక్కాలని అలా చేసి ఉండవచ్చని విశ్రాంత పోలీసు అధికారులు అభిప్రాయపడుతున్నారు. కర్రెగుట్టల చుట్టూ 6 వేల బలగాలతో మొదలుకుని, విడతల వారీగా 24 వేల మంది పోలీసులను మోహరించారు. అయితే.. కర్రెగుట్టలపై అవగాహన లేక.. అక్కడి ప్రతికూల వాతావరణంలో నిలదొక్కుకోలేక.. అగ్రనాయకులు, సెంట్రల్ కమిటీ సభ్యులు, పీఎల్‌జీఏ ఒకటో బెటాలియన్ కమాండర్ హిడ్మా టార్గెట్‌గా చేపట్టిన ఆపరేషన్‌లో పెద్దగా సఫలమవ్వలేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పెద్ద నాయకులెవరూ దొరకకున్నా.. హిడ్మా బెటాలియన్‌కు చెందిన ముగ్గురు మహిళా నక్సల్స్ సహా.. ఆరుగురు ఎన్‌కౌంటర్‌లో చనిపోయారు. మిగతా నక్సలైట్లంతా తప్పించుకుని ఉంటారని నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. ఈ ఆపరేషన్‌లో తెలంగాణ, మహారాష్ట్ర పోలీసుల సహకారం తీసుకుని ఉంటే.. పరిస్థితి వేరేలా ఉండేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

టెక్నాలజీ ఉన్నా..

'ఆపరేషన్ కర్రెగుట్టలు'లో కేంద్ర బలగాలు భారీ టెక్నాలజీని వినియోగించాయి. డ్రోన్లు, హెలికాప్టర్ల సేవలను వాడుకున్నాయి. థర్మల్ ఇమేజ్‌తో జాడను గుర్తించే సాంకేతికతను రంగంలోకి దింపాయి. కర్రెగుట్టలను చుట్టుముట్టినా.. నక్సల్స్ తప్పించుకోవడానికి అవకాశం ఎలా చిక్కిందనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. ఎత్తయిన ప్రాంతాల్లో బలగాలు అనుసరించాల్సిన వ్యూహాలను పూర్తిగా విస్మరించాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. "కొండలపై కలుగుల్లో/గుహల్లో ఉన్న నక్సల్స్‌ను వ్యూహాత్మకంగా కట్టడి చేయాలి. తొలుత కొండల చుట్టూ ఉచ్చుపన్ని.. ఆ తర్వాత కలుగుల్లోంచి బయటకు వచ్చేలా చేయాలి. జంగిల్ వార్‌ఫేర్‌లో ప్రాథమిక సూత్రం ఇది. కర్రెగుట్టలో ఈ వ్యూహం అమలు కాకపోవడం పెద్ద లోటు. గుట్టల మధ్య ఎండాకాలం కొలిమిని తలపించేలా వేడి ఉంటుంది. సాయంత్రం 4 దాటితే.. ముందు నడిచి వెళ్లేవారు కూడా కనిపించనంతగా చిమ్మచీకటి ఉంటుంది. ఇలాంటి ప్రతికూల వాతావరణం ఉండే చోట స్థానిక పోలీసుల సహకారం తీసుకుని ఉండాల్సింది" అని పలు నక్సల్స్ ఆపరేషన్లలో పాలు పంచుకున్న ఓ విశ్రాంత పోలీసు అధికారి 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. స్థానిక పోలీసులకు మావోయిస్టుల కదలికలపై సమాచారం అందించే ఇన్ఫార్మర్లు ఉంటారని ఆయన వివరించారు. కానీ, ఆపరేషన్‌లో తాము పాల్గొనడం లేదంటూ తెలంగాణ పోలీసులు బహిరంగంగా ప్రకటించారని గుర్తుచేశారు.

బలగాలు సాధించిందేమిటి?

'ఆపరేషన్ కర్రెగుట్టలు' ప్రారంభమైన తర్వాత.. ఆరుగురు నక్సల్స్ ఎన్‌కౌంటర్, వెయ్యి మంది మావోయిస్టులు తలదాచుకునే భారీ గుహను గుర్తించడం మినహా.. పెద్దగా సాధించిందేమీ లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. డ్రోన్లు, హెలికాప్టర్లు, కే9, కే3 డాగ్‌స్క్వాడ్స్ సహాయంతో కర్రెగుట్టల్లోకి బలగాలు వెళ్లగలిగాయి. పదుల సంఖ్యలో మావోయిస్టుల భూగర్భ బంకర్లను గుర్తించి, ప్రెషర్‌కుక్కర్, టిఫిన్, పైపు, బీర్‌బాటిల్ బాంబులను స్వాధీనం చేసుకున్నాయి. నీలం కొండ(సరాయ్), దోబే కొండలు, ఆలుబాకల్లో మూడు బేస్ క్యాంపులను ఏర్పాటు చేశాయి. అయితే.. ఇంకా గాలించాల్సిన కొండలు 30కి పైగానే ఉన్నట్లు సమాచారం. 3 వేల మందికి పైగా నక్సలైట్లు, కేంద్ర కమిటీ నాయకులు కర్రెగుట్టల్లో ఉన్నారని బలగాలు భావించినా.. వారి జాడను గుర్తించలేకపోయాయి. ప్రతికూల వాతావరణంతో 15 మంది జవాన్లు వడదెబ్బ బారినపడ్డారు. వంద మందికి పైగా డీ-హైడ్రేషన్‌కు గురయ్యారు. అయితే.. మావోయిస్టులను వారి సేఫ్‌జోన్ నుంచి తరిమేశారనే క్రెడిట్ బలగాలకు దక్కే అవకాశాలున్నాయని విశ్రాంత పోలీసు అధికారులు అభిప్రాయపడుతున్నారు.

మావోయిస్టులతో చర్చల ప్రసక్తేలేదు

తుపాకీ వీడాల్సిందే.. పోలీసులకు లొంగిపోవాల్సిందే

నక్సల్‌కు సీఎం రేవంత్, కేసీఆర్ మద్దతు సరికాదు

వారిపై నిషేధం ఎత్తేసే దమ్ము రాష్ట్రానికి ఉందా..?

పాక్ పౌరులపై రాష్ట్ర సర్కారు నామమాత్ర చర్యలు

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్



కరీంనగర్, మే 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మావోయిస్టులతో చర్చల ప్రసక్తే లేదని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. మావోయిస్టులు తుపాకీ వీడాల్సిందేనని, పోలీసులకు లొంగిపోవాల్సిందేనని అన్నారు. ఆదివారం కరీంనగర్ జిల్లాలోని కొత్తపల్లిలో హనుమాన్ విగ్రహ ప్రారంభోత్సవం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. మావోయిస్టుల సమస్యను సామాజిక కోణంలో చూడాలంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కగార్ ఆపాలంటూ కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించారు. మావోయిస్టులు బాంబులు పెట్టి పోలీసులు, రాజకీయ నాయకులను చంపుతుంటే సామాజిక కోణంలో చూడాలా..? అని ప్రశ్నించారు. మావోయిస్టులపై నిషేధం విధించింది కాంగ్రెస్ పాలకులేనని చెప్పారు. రాష్ట్రంలో మావోయిస్టులపై విధించిన నిషేధాన్ని ఎత్తివేసే దమ్ము కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉందా..? అని సవాల్ విసిరారు. మావోయిస్టులు తుపాకులు చేతిలో పట్టుకొని అమాయకులైన గిరిజనులు, పోలీసులను కాల్చి చంపుతున్నారని పేర్కొన్నారు. కేసీఆర్ టీడీపీలో ఉన్న సమయంలో మావోయిస్టులు ఎంతో మంది నాయకులను చంపేశారని తెలిపారు. గిరిజనులను, అమాయకులను ఇన్‌ఫార్మర్ల పేరుతో కాల్చి చంపుతుంటే సమర్థిస్తారా..? అని ప్రశ్నించారు. పాకిస్థాన్ పౌరులను తిరిగి పంపే అంశంపై కేంద్రం ఇప్పటికే అన్ని రాష్ట్రాలకు ఆదేశాలు ఇచ్చిందని, దేశమంతా దీనిపై సీరియస్‌గా చర్యలు తీసుకుంటుంటే తెలంగాణ ప్రభుత్వం మాత్రం నామమాత్రంగా చర్యలు తీసుకోవడం సరికాదని విమర్శించారు. ఇప్పటికే చాలా మంది పాస్‌పోర్టు, వీసాలు లేకుండా ఇక్కడ నివసిస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. రోహింగ్యాలు కూడా చాలా మంది ఉన్నారని, వారిపై కాంగ్రెస్ వైఖరి తెలియజేయాలని డిమాండ్ చేశారు. దీనిని శాంతి భద్రతల సమస్యగా చూడాలే తప్ప మత కోణంలో, రాజకీయ లబ్ధి కోసం చూస్తే హైదరాబాద్ ఉగ్రవాదులకు అడ్డాగా మారే ప్రమాదముందని అన్నారు. కాళేశ్వరంపై ఎన్డీఎస్‌ఏ నివేదిక ఇచ్చి వారం రోజులైనా చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కేంద్రం తీసుకున్న కులగణన నిర్ణయం చరిత్రాత్మకమని, దీనిని కాంగ్రెస్ విజయమని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ కులగణన సర్వేకు, మోదీ కులగణనకు పొంతనే ఉండదని చెప్పారు. కాంగ్రెస్ కులగణనతో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని విమర్శించారు. 52 శాతం జనాభా ఉన్న బీసీలను 46 శాతంగా చూపారని అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నామని చెప్పి అందులో పది శాతం ముస్లింలకు కేటాయించారని సంజయ్ మండిపడ్డారు.

హైకోర్టు న్యాయమూర్తి గిరిజా ప్రియదర్శిని మృతి

» చీఫ్ జస్టిస్ సహా పలువురి నివాళి

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, మియాపూర్, మే 4(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాటూరి గిరిజా ప్రియదర్శిని(60) మరణించారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమె.. హైదరాబాద్, గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రిలో ఆదివారం ఉదయం తుది శ్వాస విడిచారు. జస్టిస్ గిరిజా ప్రియదర్శిని భౌతికకాయాన్ని హఫీజ్‌పేటలోని ఆమె స్వగృహానికి తరలించారు. హైకోర్టు చీఫ్ జస్టిస్ సుజయ్ పాల్, పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు ఆమె భౌతికకాయానికి నివాళి అర్పించారు. జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో సోమవారం మధ్యాహ్నం తర్వాత అంత్యక్రియలు జరగనున్నాయి. జస్టిస్ గిరిజా ప్రియదర్శినికి భర్త విజయ్‌కుమార్, కుమారులు నిఖిల్, అఖిల్ ఉన్నారు. కాగా, ఏపీలోని విశాఖపట్నంకు చెందిన గిరిజా ప్రియదర్శిని.. అక్కడి ఎన్‌బీఎం లా కాలేజీలో న్యాయశాస్త్రం పూర్తిచేసి.. 1995లో ఉమ్మడి ఏపీ హైకోర్టులో న్యాయవాదిగా నమోదు చేసుకున్నారు. విశాఖపట్నంలో పదేళ్లకు పైగా న్యాయవాదిగా పని చేసిన తర్వాత 2008లో నేరుగా జిల్లా జడ్జిగా ఎంపికయ్యారు. ఆదిలాబాద్, ఒంగోలు, కరీంనగర్ జిల్లాల ప్రధాన న్యాయమూర్తిగా పని చేశారు. 2022 మార్చి 24న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా ఎంపికయ్యారు. సమాజంలోని వెనుకబడిన వర్గాలకు న్యాయసహాయం అందించడంలో ఆమె కీలకంగా వ్యవహరించారు. నాల్సా ఆధ్వర్యంలో దూరదర్శన్‌లో ప్రసారమైన 'అకేలే నహీ హై ఆప్' కార్యక్రమంలో మారుమూల గ్రామాల్లోని అణగారిన వర్గాలకు న్యాయసహాయం అందించడంలో ఆమె చేసిన సేవలను కొనియాడారు. జస్టిస్ గిరిజా ప్రియదర్శిని మరణం పట్ల తెలంగాణ జడ్జెస్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకరరావు, ప్రధానకార్యదర్శి మురళీమోహన్ సంతాపం తెలిపారు.

శ్రీవారి సేవలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి



తిరుమల, మే 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీవీ వేణుగోపాల్ ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆయన ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలవిరాట్టును దర్శించుకున్నారు. అనంతరం రంగనాయక మండపానికి చేరుకున్న జస్టిస్‌కు వేదపండితులు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

నిమ్స్ వైద్యులకు నీట్ ఎస్ఎస్‌లో ఉత్తమ ర్యాంకులు

» అభినందించిన నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప నగరి

హైదరాబాద్ సిటీ, మే 4 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) యువ వైద్యులు ఇటీవల విడుదలైన నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్-సూపర్ స్పెషాలిటీ (నీట్-ఎస్ఎస్) 2024 ఫలితాల్లో సత్తా చాటారు. రెండోసారి కూడా జాతీయ స్థాయిలో ఒకరు మొదటి ర్యాంక్ పొందడం విశేషం. నిమ్స్ జనరల్ విభాగానికి చెందిన డాక్టర్ జకీర్ హుస్సేన్ జాతీయ స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించారు. గత ఏడాదీ మొదటి ర్యాంక్‌ను నిమ్స్ జనరల్ మెడిసిన్ డాక్టరే సాధించారు. మొత్తంగా నిమ్స్ జనరల్ మెడిసిన్ విభాగానికి చెందిన 12 మంది వైద్యులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. ఈ నేపథ్యంలో ర్యాంకులు సాధించిన వైద్యులు నిమ్స్ డైరెక్టర్ బీరప్ప నగరి అభినందించారు. ర్యాంకులు సాధించిన వైద్యుల్లో డాక్టర్ జాకీర్ హుస్సేన్ (1వ ర్యాంక్), డాక్టర్ భానుచంద్ (9వ), డాక్టర్ రోహిత్ (14వ), డాక్టర్ యు సౌమ్య (21వ), డాక్టర్ సయ్యద్ ఖలీలుల్లా (43వ), డాక్టర్ కృష్ణ కిషోర్ సోమాని (50వ), డాక్టర్ వి సాయి స్ఫూర్తి (58వ), డాక్టర్ ధీరజ్ అనిరుధ్ (67వ), డాక్టర్ అమ్తుల్ రహీం సుర్యమ్ (361వ), డాక్టర్ పీఎస్ఎన్ రజిత (420వ), డాక్టర్ ఏపీఎస్ శ్రీలేఖ్య (456వ) ఉన్నారు. జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన యువ వైద్యులను డీన్ లీజా రాజశేఖర్, జనరల్ మెడిసిన్ విభాగాధిపతి ప్రొఫెసర్ సుబ్బలక్ష్మి, సీనియర్ వైద్యులు ప్రొఫెసర్ నావెల్ చంద్ర, ప్రొఫెసర్ రాంమూర్తి, ఇతర వైద్యులు అభినందించారు.




ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తిరుమల; బయటకు తీసిన దూది

కడుపులో దూది పెట్టి కుట్లు వేసిన డాక్టర్

» వైద్యురాలి నిర్లక్ష్యం బాలింతకు ప్రాణసంకటం

» హనుమకొండ జిల్లా కమలాపూర్ సివిల్ ఆస్పత్రిలో ఘటన

ఎల్కతుర్తి, మే 4 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో వైద్యురాలి నిర్లక్ష్యం ఓ బాలింత ప్రాణాల మీదకు తెచ్చింది. ప్రసవం అప్పుడు శస్త్రచికిత్స చేసిన వైద్యురాలు.. బాలింత కడుపులో కాటన్‌ను ఉంచి కుట్లు వేసింది. దీంతో తీవ్రమైన కడుపు నొప్పితో ఆ బాలింత తిరిగి ఆస్పత్రిపాలైంది. హనుమకొండ జిల్లా కమలాపూర్ సివిల్ ఆస్పత్రిలో ఈ ఘటన జరిగింది. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం ఉప్పల్ గ్రామానికి చెందిన వానరాసి తిరుమలను ప్రసవం కోసం కుటుంబ సభ్యులు ఏప్రిల్ 27 మధ్యాహ్నం కమలాపూర్ సివిల్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. తిరుమలకు నొప్పులు అధికమయ్యాయని నర్సులు ఇచ్చిన సమాచారంతో రాత్రి ఎనిమిది గంటలకు ఆస్పత్రికి చేరుకున్న వైద్యురాలు.. తిరుమలకు చిన్న శస్త్రచికిత్స చేసి ప్రసవం చేశారు. అనంతరం శస్త్రచికిత్స చేసిన చోట రక్తస్రావం కాకుండా ఉండేందుకు కడుపులోనే కాటన్ ఉంచి కుట్లు వేసేశారు. మూడు రోజుల అనంతరం తిరుమల ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయి ఇంటికి వెళ్లింది. అప్పటి నుంచి తీవ్రమైన కడుపునొప్పితో సతమతమవుతున్న తిరుమల.. ఆదివారం మూత్ర విసర్జనకు వెళ్లగా శస్త్రచికిత్స చేసిన చోటు నుంచి కాటన్ బయటకు వచ్చింది. దీంతో తిరుమలను కుటుంబసభ్యులు తిరిగి కమలాపూర్ ఆస్పత్రికి తీసుకురాగా.. పరిశీలించిన ఓ నర్సు కాటన్‌ను బయటికి లాగేసింది. దీంతో కుట్లు పగిలి తీవ్ర రక్తస్రావమైంది. ఈ విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యురాలు, ఇతర సిబ్బందిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



లక్ష్మీనృసింహుడిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

యాదగిరిక్షేత్రంలో భక్తుల సందడి

యాదగిరిగుట్ట, మే 4(ఆంధ్రజ్యోతి): వరుసగా వెలువడిన పరీక్షా ఫలితాలు.. వేసవి సెలవులు.. వారాంతం కలిసి రావడంతో యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి క్షేత్రం భక్తజనసంద్రమైంది. కొండపైన, కింద పార్కింగ్ ప్రదేశాలు వాహనాలతో నిండిపోగా వైకుంఠద్వారం ఇరువైపులా వాహనాలను పార్కింగ్ చేశారు. సుమారు 46 వేల మంది భక్తులు క్షేత్ర దర్శనానికి రాగా ప్రత్యేక, ఉచిత ధర్మదర్శన క్యూకాంప్లెక్స్, క్యూలైన్లలో ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీ కొనసాగింది. ప్రత్యేక దర్శనానికి గంట, ధర్మదర్శనాలకు 3 గంటల సమయం పట్టింది. మరోవైపు శని, ఆదివారాల్లో ప్రముఖులకే ప్రోటోకాల్ దర్శనాలుంటాయని ఈవో వెంకట్రావు తెలిపారు.

ఈ మామిడి కిలో రూ.2.50లక్షలు!

» విదేశాల నుంచి మియాజాకీ మామిడి మొక్కలు తెచ్చి సాగు చేసిన ఖమ్మం రైతు

» కోతకు రావడంతో కుక్కలతో కాపలా



మామిడి చెట్టు వద్ద కాపలాగా ఉన్న కుక్కలు

ఖమ్మం రూరల్, మే 4(ఆంధ్రజ్యోతి): కిలో మామిడి కాయల ధర ఎంత ఉంటుంది. రూ.150 మహా అయితే రూ.300 పలుకుతాయి. కానీ ఈ మామిడి కాయలు తినాలంటే మాత్రం ఆస్తులు అమ్ముకోవాల్సిందే. ఎందుకంటే వీటి ధర కిలో రూ.2.50 లక్షలు.. అందుకే ఈ చెట్లను సాగు చేస్తున్న ఖమ్మం జిల్లాకు చెందిన ఓ రైతు ఇప్పుడు పంట కోతకు రావడంతో కుక్కలను కాపలాగా పెట్టి కాయలను అత్యంత పగడ్బందీగా రక్షిస్తున్నారు. ఖమ్మం జిల్లా రూరల్ మండలం బారుగూడెంలోని శ్రీసిటీలో ప్రముఖ వ్యాపారి, రైతు గరికపాటి వెంకట్రావు మియాజాకీ మామిడి మొక్కలను విదేశాల నుంచి తీసుకువచ్చి తన వ్యవసాయక్షేత్రంలో సాగు చేయగా ప్రస్తుతం ఆ చెట్లకు కాయలు వచ్చాయి. 2020 కరోనా సమయంలో జపాన్ నుంచి మియాజాకీ రకానికి చెందిన 15 మామిడి మొక్కలను ఒక్కొక్క దానికి రూ.10వేలు పెట్టి తెచ్చి సాగుచేశారు. అందులో 10 చెట్లు మాత్రమే బతికాయి. మూడేళ్ల తరువాత అవి కోతకు వచ్చాయి. గత ఏడాది ఒక్కో చెట్టుకు 10 కాయలు కాశాయి. ఈ ఏడాది ఒక్కో చెట్టుకు సుమారు 20 నుంచి 30 కాయలు కాశాయి. ఈ రకం మామిడి కాయలకు మార్కెట్లో మంచి ధర ఉండటంతో ఈ ఏడాది మరో 60 మొక్కలు తీసుకువచ్చి సాగు చేశారు. మియాజాకీ మామిడి పండ్లకు జపాన్‌లో మంచి డిమాండ్ ఉన్న నేపథ్యంలో తమ తోటలో కాసిన కాయలను ఆ దేశానికి ఎగుమతి చేసే యోచనలో ఉన్నామని రైతు గరికపాటి వెంకట్రావు తెలిపారు. కాగా, మియాజాకీ మామిడి సాగు కేవలం



మియాజాకీ రకం మామిడి కాయ

జాపాన్‌లోనే ఎక్కువగా చేస్తుంటారని, ఆ దేశ మార్కెట్‌లో వీటికి లక్షల్లో ధర ఉంటుందని ఖమ్మం హార్టికల్చర్, సెరికల్చర్ అధికారి మధుసూదన్ చెప్పారు. "ఈ పంటను ఖమ్మం జిల్లాలో మొదటి సారి శ్రీసిటీలో సాగు చేశారు. ఈ జాతి మొక్కలు మన నేలపైనా బతుకుతాయి. ఆసక్తి ఉన్న రైతులు వీటిని సాగు చేసుకోవచ్చు"అని సూచించారు.

10 నుంచి మెట్రో చార్జీల పెంపు!

» 25-30 శాతం పెంచేందుకు ఎల్ అండ్ టీ నిర్ణయం

» అనుమతి కోసం 8న సీఎం రేవంత్ రెడ్డితో భేటీ

» కనిష్ఠంగా రూ.15.. గరిష్ఠంగా రూ.75 వరకు ఉండే చాన్స్



హైదరాబాద్ సిటీ, మే 4 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగర రవాణాలో అతి కీలకమైన మెట్రో రైలు టికెట్ చార్జీల పెంపు దాదాపుగా ఖరారైంది. చార్జీల పెంపుపై కొంతకాలంగా ఊగిసలాడుతున్న ఎల్ అండ్ టీ అధికారులు నష్టాలను నివారించుకునేందుకు ముందుకు సాగుతున్నారు. రెండేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం నియమించిన చార్జీల నిర్ణయ కమిటీ (ఎఫ్ఎఫ్‌సీ) ఇచ్చిన నివేదిక ఆధారంగా టికెట్ రేట్లు పెంచాలని భావిస్తున్నారు. ఈ మేరకు ఈ నెల 8న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమై ఆయన అనుమతి కోరనున్నారు. ఈ అంశం ఇప్పటికే సీఎం దృష్టిలో ఉండడంతో ఆయన సానుకూలంగా స్పందిస్తారని ఆశిస్తున్నారు. ఇదే సమయంలో పెంచనున్న చార్జీలను ఈ నెల 10 నుంచి అమలులోకి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. హైదరాబాద్‌లో మొదటి దశ ప్రాజెక్టును ఎల్ అండ్ టీ సంస్థ నిర్మించిన విషయం తెలిసిందే. ప్రైవేటు, ప్రభుత్వ భాగస్వామ్యంలో 2012లో రూ.14,132కోట్ల వ్యయంతో పనులు ప్రారంభించి 2017 నవంబరులో పూర్తిచేశారు. మియాపూర్-ఎల్బీ నగర్, జేబీఎస్-ఎంజీబీఎస్, నాగోలు-రాయదుర్గం మధ్య 69.2 కిలోమీటర్ల పరిధిలో పనులు పూర్తిచేశారు. ప్రస్తుతం రోజుకు 1,200సర్వీసులు నడుస్తుండగా 4.80 లక్షల మంది ప్రయాణిస్తున్నారు.శని, ఆదివారాలు, సెలవు రోజుల్లో 5.10లక్షల మంది రాకపోకలు సాగిస్తున్నారు.

ఏడాదిన్నరగా యత్నాలు

కరోనాకు ముందు రోజుకు రూ.80 లక్షలకు పైగా ఆదాయం సమకూర్చుకున్న సంస్థ.. తర్వాత నుంచి కుదేలైంది. 2020 నుంచి 2022 వరకు ప్రయాణికుల రాకపోకలు తగ్గడంతో పాటు మాల్స్ ప్రకటనల నుంచి ఆశించిన ఆదాయం రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఇదే సమయంలో రవాణా ఆధారిత అభివృద్ధి (టీవోడీ) కింద ప్రభుత్వం ఇచ్చిన 267 ఎకరాల భూమిలో కేవలం నాలుగైదు ప్రాంతాల్లోనే కమర్షియల్ కాంప్లెక్సులు నిర్మించింది. చాలావరకు భూములు ఇప్పటికీ ఖాళీగా ఉన్నాయి. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీ బస్సుల్లో మహాలక్ష్మి పథకం పేరిట మహిళలకు ఉచిత ప్రయాణం అందిస్తుండడంతో ఆ భారం కూడా మెట్రోపై పడిందని ఎల్ అండ్ టీ అధికారులు చెబుతూ వస్తున్నారు. అయితే టికెట్ రేట్ల సవరణపై హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ (హెచ్ఎంఆర్), అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం విజ్ఞప్తితో కేంద్ర ప్రభుత్వం 2022 సెప్టెంబరులో ఎఫ్ఎఫ్‌సీని నియమించింది. ఆ కమిటీ నగరంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టి కేంద్రానికి నివేదిక సమర్పించింది. 2023 జనవరి నుంచి రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం రావడంతో ఆ విషయం మరుగునపడింది. అయితే చార్జీల పెంపుపై కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా కేంద్రం అనుమతి కోరేందుకు హెచ్ఎంఆర్, ఎల్అండ్‌టీ అధికారులు ఏడాదిన్నరగా యత్నిస్తున్నారు.

త్వరలో పెరిగే టికెట్ల చార్జీలు ఇలా (సుమారుగా)

దూరం (కి.మీ.లో)	ప్రస్తుత ఛార్జీ	పెరిగే ఛార్జీ (రూపాయల్లో)
0-2	10	15
2-4	15	20
4-6	25	35
6-8	30	40
8-10	35	45
10-14	40	55
14-18	45	60
18-22	50	65
22-26	55	70
26 పైన	60	75

25 నుంచి 30 శాతం పెంపు!

ఎఫ్ఎఫ్‌సీ నివేదిక ఆధారంగా టికెట్ చార్జీలు పెంచుకునే స్వతంత్రత.. నిర్మాణ సంస్థ అయిన ఎల్ అండ్ టీకి ఉంటుందని ఆ సంస్థకు చెందిన ఓ ముఖ్య అధికారి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. మెట్రో రైల్వే (ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్) యాక్ట్ 2002 ప్రకారం టికెట్ రేట్లను సవరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ ఏడాది బెంగళూరు మెట్రో రైలులో ఎఫ్ఎఫ్‌సీ ఆధారంగానే 50శాతం చార్జీలు పెంచారని, మన వద్ద 25 నుంచి 30 శాతం వరకు పెంచాలని నిర్ణయించినట్లు తెలిపారు. దీంతో ఏటా రూ.150-170 కోట్ల వరకు వార్షిక ఆదాయం రాబట్టుకోవాలని ఆలోచిస్తున్నామని, తద్వారా నష్టాలను కొంతైనా తగ్గించుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.



విత్తనాలను ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి చౌహాన్

దేశంలో తొలిసారిగా జన్యు సవరణ వరి

» ఐకార్ అభివృద్ధి చేసిన రెండు రకాల విత్తనాలు 'కమల', 'పూస' విడుదల

» ప్రతికూల వాతావరణాన్ని తట్టుకునే శక్తి

» త్వరలో అందుబాటులోకి: చౌహాన్

హైదరాబాద్, మే 4(ఆంధ్రజ్యోతి): దేశంలో తొలిసారిగా జన్యు సవరణ వరి విత్తనాలను కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఆదివారం ఢిల్లీలో విడుదల చేశారు. 'డీఆర్ఆర్ ధన్ 100 (కమల)', 'పూస (డీఎస్‌టీ రైస్ 1)' అనే ఈ విత్తనాలను వాతావరణ సమస్యలను తట్టుకునేలా, 20 నుంచి 30 శాతం వరకు అధిక దిగుబడి సాధించేలా భారత వ్యవసాయ పరిశోధనా మండలి(ఐకార్) అభివృద్ధి చేసింది. భారత వ్యవసాయ రంగంలో ఇది చాలా ముఖ్యమైన రోజు అని, ఈ రెండు రకాల విత్తనాలను త్వరలో రైతులకు అందుబాటులోకి తీసుకొస్తామని చౌహాన్ తెలిపారు. వీటిని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఒడిశా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్ లాంటి ప్రధాన వరి ఉత్పత్తి రాష్ట్రాల్లో సాగు చేయాలని సూచించారు. ఎక్కువగా సాగు చేసే సాంబమసూరి(బీపీటీ- 5204), ఎంటీయూ- 1010 (కాటన్‌దొర సన్నాలు)లను శాస్త్రవేత్తలు అభివృద్ధిచేసి కొత్త రకాలను రూపొందించారని వివరించారు. కొత్త రకాలు రెండూ సాధారణ రకాల కంటే 20 రోజుల ముందే పండుతాయని, తద్వారా కోతలు ముందే పూర్తయి.. పంట మార్పిడి విధానానికి అవకాశం కలుగుతుందన్నారు.



సీఎస్ రామకృష్ణారావుకు మెట్రో నిర్మాణ పనుల తీరును వివరిస్తున్న మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

హైదరాబాద్ అభివృద్ధిపై సీఎం రేవంత్ ప్రత్యేక దృష్టి

ఓల్డ్‌సిటీ మెట్రో వేగవంతానికి అదనపు నిధులిస్తాం

ప్రతిష్ఠాత్మకంగా మిస్ వరల్డ్ పోటీల నిర్వహణ

అన్నిశాఖల సమన్వయంతో సక్సెస్ చేస్తాం: సీఎస్

హైదరాబాద్ సిటీ, మే 4 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగర అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు పేర్కొన్నారు. ఆదివారం ఆయన రాజధాని నగరంలో సుడిగాలి పర్యటన చేశారు. సీఎస్‌గా బాధ్యతలు చేపట్టాక ఆయన హైదరాబాద్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా రామకృష్ణారావు మాట్లాడుతూ సీఎం రేవంత్ ఆదేశాల మేరకే నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించి పలు సూచనలు చేసినట్లు తెలిపారు. ఓల్డ్‌సిటీ మెట్రో రైలు మార్గ నిర్మాణ పనుల వేగవంతానికి అదనపు నిధులు కేటాయిస్తామని వెల్లడించారు. వ్యూహాత్మక రోడ్డు అభివృద్ధి ప్రణాళిక (ఎస్ఆర్‌డీపీ) ద్వారా జీహెచ్ఎంసీ నిర్మిస్తున్న ఫ్లైవర్, ఇతర మౌలిక సదుపాయాల పనుల్లో వేగం పెంచాలని అధికారులను రామకృష్ణారావు ఆదేశించారు. జలమండలి నిర్మిస్తున్న సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు (ఎస్టీపీ)ను త్వరలో అందుబాటులోకి తెస్తామని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో విస్ వరల్డ్ పోటీల నిర్వహణకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతోపాటు భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. తొలుత బంజారాహిల్స్‌లోని జీవీకే మాల్ వద్ద రూ.5 కోట్ల వ్యయంతో చేపట్టిన ఫుట్ ఓవర్ బ్రిడ్జిని రామకృష్ణారావు పరిశీలించారు. అటుపై ఓల్డ్ సిటీలో ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకూ 7.5 కి.మీ పొడవునా చేపట్టిన మెట్రోరైలు కారిడార్ విస్తరణ పనులను పరిశీలించారు. ఈ మార్గంలో గల సుమారు 105 మతపరమైన, చారిత్రక, ఇతర సున్నితమైన కట్టడాలకు హాని కలుగకుండా కూల్చివేతలు చేపట్టినట్లు సీఎస్‌కు మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి వివరించారు. మెట్రోరైల్ ప్రాజెక్టు రెండోదశలో పార్ట్-బీ కారిడార్లకు త్వరలోనే ఆమోదం లభిస్తుందని సీఎస్ చెప్పారు. హెచ్ఎండీఏ నిధులతో హుస్సేనీ ఆలంలోని ఖుర్షీద్ ఝా దేవిడీ హెరిటేజ్ భవన కన్జర్వేషన్ పునరుద్ధరణ, మరమ్మత్తుతో పాటు ఫలక్‌నుమాలోని రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబీ), ఫలక్‌నుమా ఫ్లైవర్ నుంచి నల్లగొండ ఫ్లై ఓవర్ పనులతోపాటు మూసారాం బాగ్ వద్ద వంతెన నిర్మాణ పనులను పరిశీలించారు. అంబర్‌పేటలో హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ చేపట్టిన 212.5 ఎమ్మెల్డీ సివరేజి ట్రీట్‌మెంట్ ప్లాంట్ (సీటీపీ) నిర్మాణ పనులను తనిఖీ చేశారు.

ప్రపంచ పర్యాటకంలో తెలంగాణ!

'మిస్ వరల్డ్' పోటీదారులకు రాష్ట్రంలోని పర్యాటక ప్రదేశాలను పరిచయం చేసేలా షెడ్యూల్

» విదేశీ పర్యాటకులను ఆకర్షించడమే లక్ష్యంగా ప్రణాళిక

» పర్యాటక రంగ వృద్ధితో ఉద్యోగ, ఉపాధి కల్పనకు ఊతం



మిస్ బ్రెజిల్ జెస్సికా స్కాండుజ్ పెడ్రోసోకు సంప్రదాయ రీతిలో స్వాగతం పలుకుతున్న దృశ్యం

హైదరాబాద్, మే 4 (ఆంధ్రజ్యోతి): చారిత్రక, సాంస్కృతిక నేపథ్యం కలిగిన తెలంగాణను ప్రపంచంలోనే ప్రధాన పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దడంతోపాటు పర్యాటక రంగంలో రూ.15వేల కోట్ల పెట్టుబడుల్ని ఆకర్షించేందుకు మిస్‌వరల్డ్ పోటీలను వినియోగించుకునేలా రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. హైదరాబాద్ వేదికగా ఈ నెల 10వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జరగనున్న మిస్ వరల్డ్ 72వ ఎడిషన్ పోటీల కోసం ప్రపంచ వ్యాప్తంగా 120దేశాల సుందరీమణులు, వేలాది మంది ప్రతినిధులు రాష్ట్రానికి రానున్న విషయం తెలిసిందే. వీరికి రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రాలను పరిచయం చేయడం ద్వారా పెద్ద ఎత్తున విదేశీ పర్యాటకులను ఆకర్షించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లోనేఉ చార్మినార్, లాడ్‌బజార్ చౌమొహల్లా ప్యాలెస్, వరంగల్‌లోని వేయి స్తంభాల ఆలయం, వరంగల్ కోట, భద్రకాళి ఆలయం, రామప్ప ఆలయం, నల్లగొండలోని నాగార్జున సాగర్ ప్రాజెక్టు, పోచంపల్లి వస్త్ర పరిశ్రమ, మహబూబ్‌నగర్ జిల్లాలోని పిల్లలమర్రి వృక్షం, చేవెళ్ల సమీపంలోని ఎక్స్‌పీరియం పార్కు వంటి పర్యాటక ప్రదేశాలను మిస్ వరల్డ్ పోటీ దారులు సందర్శించేలా అధికారులు షెడ్యూల్ రూపొందించారు. 2024లో తెలంగాణను 1,55,113మంది విదేశీ పర్యాటకులు సందర్శించగా..ఈ ఏడాది అంతకన్నా ఎక్కువ మందిని ఆకర్షించడమే లక్ష్యంగా కసరత్తు చేస్తున్నారు. తెలంగాణ సాంస్కృతిక వైభవం, చారిత్రక గాథలు, ఆధునిక అభివృద్ధి, పర్యాటక ప్రాముఖ్యతను ప్రపంచానికి తెలపడంతో పాటు ప్రపంచ పటంలో మల్టీడైమెన్షనల్ టూరిజం హబ్‌గా రాష్ట్రాన్ని పరిచయం చేయాలని సర్కారు యోచిస్తోంది. పర్యాటకరంగ వృద్ధితో ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఊతం లభిస్తుందని అంచనా వేస్తోంది.

90 మంది అందగత్తెల రాకతో శంషాబాద్‌లో సందడి

హైదరాబాద్/శంషాబాద్ రూరల్, మే 4(ఆంధ్రజ్యోతి): మిస్‌వరల్డ్ పోటీల్లో పాల్గొనేందుకు వివిధ దేశాలకు చెందిన అందాల బామలు హైదరాబాద్ చేరుకుంటున్నారు. శంషాబాద్ విమానాశ్రయం చేరుకున్న సుందరీమణులకు టూరిజంశాఖ అధికారులు సంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలుకుతున్నారు. ఆదివారం మిస్ బ్రెజిల్ జెస్సికా స్కాండుజ్ పెడ్రోసో, మిస్ సౌత్‌ఆఫ్రికా జోయాలిజే జాన్సన్‌వాన్ రెన్స్‌బర్గ్‌తోపాటు 90 మంది పోటీదారులు హైదరాబాద్ చేరుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సోమవారం మరికొందరు పోటీదారులు వచ్చే అవకాశం ఉంది. అందగత్తెలు ఎయిర్‌పోర్టుకు చేరుకోవడంతో ఆ ప్రాంగణమంతా సందడిగా మారింది. అనంతరం వారిని ఆయా హోటళ్లకు తరలించారు. కాగా, శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అతిథులకు సమాచారం ఇచ్చేందుకు ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్‌ను టూరిజం శాఖ అందుబాటులోకి తెచ్చింది.

16న అమెరికాకు ఎమ్మెల్సీ కవిత

» అనుమతినిచ్చిన సీబీఐ కోర్టు

హైదరాబాద్, మే 4 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఈనెల 16న అమెరికాకు వెళ్లనున్నారు. కుమారుడు ఆదిత్య గ్రాడ్యుయేషన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు భర్త అనిల్‌తో కలిసి కవిత అమెరికా వెళ్తున్నట్లు ఎమ్మెల్సీ కార్యాలయం ఆదివారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఈనెల 16 నుంచి 22 వరకు కవిత అక్కడే ఉంటారని.. 23న తిరిగి హైదరాబాద్ చేరుకోనున్నట్లు ప్రకటనలో పేర్కొంది. ఈమేరకు ఆమె పర్యటనకు ఢిల్లీలోని సీబీఐ ప్రత్యేక కోర్టు అనుమతినిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపింది.

జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన తిరుపతి యువతి



తిరుపతి(నేరవిభాగం), మే 4(ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన నిఖిత తెలంగాణ క్యాడర్‌కు జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. హైదరాబాదులోని నల్సార్ యూనివర్సిటీలో నిఖిత బ్యాచులర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్.. ఆ తర్వాత ఎల్ఎల్‌బీ పూర్తి చేశారు. ప్రస్తుతం హైదరాబాదులోని ఉస్మానియా వర్సిటీలో ఎల్ఎల్ఎం చదువుతున్నారు. ఈమె తల్లిదండ్రులు ఎస్‌బీఐలో ఉద్యోగులు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.